V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
28-12-2024

సంపుటి : 01 | సంచిక : 236 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

## టెట్ హాల్ టికెట్లు విడుదల

- జనవరి 2 నుంచి 20వ తేదీ దాకా ఆన్‌లైన్ పద్ధతిలో టెట్ పరీక్షలు
- సాంకేతిక కారణాలతో ఓ మూడు సెషన్లకు సంబంధించిన విడుదలకాని హాల్ టిక్కెట్లు



2

## కేటీఆర్‌ను 31 వరకు అరెస్టు చేయొద్దు

- హైకోర్టు జారీచేసిన ఉత్తర్వులు పొడిగింపు
- ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో కౌంటర్ దాఖలు చేసిన ఏసీబీ




2



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకోసం జరిగిన అరవై ఏండ్ల సుదీర్ఘ పోరాటానికి మన్మోహనుడి ప్రభుత్వంలోనే ముగింపులభించింది. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్ష మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ హయాంలోనే నెరవేరింది. దశాబ్దాల పాటు తెలంగాణపై కొనసాగిన అణచివేత, ఆర్థిక దోపిడీ, సామాజిక, సాంస్కృతిక వివక్ష తెలిసిన అతికొద్ది మంది జాతీయ నాయకుల్లో మన్మోహన్‌సింగ్ ముందు వరుసలో ఉంటారు. తెలంగాణ ఆకాంక్షలను, రాష్ట్రం ఆవిర్భవించకపోతే జరిగే అనర్థాలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ పూసగుచ్చినట్టు వివరిస్తే అర్థం చేసుకున్న మనసున్న పాలకుడు మన్మోహన్ సింగ్.ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తూ డిసెంబర్ 9 ప్రకటన వెలువడింది. 2014లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు బాటలు వేసిన ఘనత ఆయనకు దక్కుతుంది. పార్లమెంట్‌లో తెలంగాణ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు మద్దతు కూడగట్టడంలో కేసీఆర్‌కు మన్మోహన్ సింగ్ సూచనలు చేశారు.తన ప్రభుత్వానికి పూర్తిస్థాయి మెజార్టీ లేకున్నా అత్యంత వ్యూహాత్మకంగా తెలంగాణ బిల్లును మన్మోహన్ ఉభయసభల్లో గట్టెక్కించారు.

# తెలంగాణకు ఆప్తుడు

**ఇక్కడ ప్రజలు ఎప్పటికీ మరవలేని పేరు మన్మోహన్ సింగ్**

### ఆయన హయాంలోనే ప్రత్యేక రాష్ట్ర కల సాకారం

ఆరు దశాబ్ధాల ఆకాంక్షను నెరవేర్చిన మానవతామూర్తి

తెలంగాణ బిల్లు సమయంలో తీవ్రంగా వ్యతిరేకించిన ఆంధ్ర నేతలు

వ్యూహాత్మంగా వ్యవహరించి రాష్ట్రం ఏర్పాటు చేసి.. ఇచ్చిన మాటకు కట్టుబడ్డారు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో**

ఆరు దశాబ్దాల తెలంగాణ పోరాటానికి ముగింపు మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలోనే లభించింది. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల కల స్వరాష్ట్రం ఆయన హయాంలోనే నెరవేరింది. మన్మోహన్ సింగ్‌ను తెలంగాణ ఉన్నంతవరకూ రాష్ట్ర ప్రజలు గుర్తుంచుకుంటారు. 2009-2014 వరకూ ప్రతి అడుగు ఆచిచూతి వేసిన మన్మోహన్ సింగ్ సొంత పార్టీలో ఆంధ్రప్రదేశ్ ఎంపీల రాజీనామా హెచ్చరికల్ని కూడా బేఖాతరు చేశారు. ప్రత్యేక తెలంగాణ బిల్లు రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. . తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ రాష్ట్రాన్ని ఏర్పాటుచేయడంలో మన్మోహన్ కీలకంగా వ్యవహరించారు.అదే సమయంలో ఏపీ నుంచి వ్యతిరేకతను తగ్గించేందుకు ప్రత్యేక హోదా హామీతో పాటు కేంద్ర సంస్థల ఏర్పాటు హామీ ఇచ్చింది మన్మోహన్ సింగే.

**తెలంగాణ ఏర్పాటులో వ్యూహాత్మంగా వ్యవహరించిన మన్మోహన్..**

ప్రత్యేక రాష్ట్రం కోసం 1950 వ దశకం నుంచే ఉద్యమాలు మొదలయ్యాయి. కొన్నాళ్ల తర్వాత మిగతా2లో...




## దిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో మన్మోహన్ అంత్యక్రియలు

- సైనిక లాంఛనాలతో తుది వీడ్కోలు పలికేందుకు ఏర్పాట్లు చేయాలి
- కేంద్ర రక్షణ శాఖను కోరినట్లు కేంద్ర హోంశాఖ వెల్లడి
- స్మారక స్థలం నిర్మాణం కోసం ప్రధానికి ఖర్గే లేఖ..
- మన్మోహన్ సింగ్‌కు రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, సోనియాగాంధీ, సీఎం రేవంత్ నివాళులు



**దిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అంత్యక్రియలు శనివారం అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు. దిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో శనివారం ఉదయం 11.45గంటలకు ఆయన అంతిమ సంస్కారాలు జరుగుతాయని కేంద్ర హోంశాఖ వెల్లడించింది. సైనిక లాంఛనాలతో తుది వీడ్కోలు పలికేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని కేంద్ర రక్షణ శాఖను కోరినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది.

**స్మారక స్థలం నిర్మాణం కోసం ప్రధానికి ఖర్గే లేఖ..**

మరోవైపు, మన్మోహన్ సింగ్‌కు అంత్యక్రియలు నిర్వహించే ప్రదేశంలో స్మారక స్థలం నిర్మించాలని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. దేశానికి రెండుసార్లు ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్‌కు స్మారక స్థలం ఏర్పాటుపై ఉదయం ప్రధానితో ఫోన్‌లో మాట్లాడిన ఖర్గే.. తాజాగా ఈ అంశంపై ఆయనకు రెండు పేజీల లేఖ రాశారు. రాజనీతిజ్ఞులు, మాజీ ప్రధానమంత్రులకు అంత్యక్రియలు జరిగిన స్థలంలోనే వారి స్మారకాలను నిర్మించిన సంప్రదాయాన్ని మిగతా2లో...



2

## మన్మోహన్ పార్థివదేహానికి రాష్ట్రపతి, ప్రధాని నివాళి

## అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

### కౌంటర్ దాఖలుకు సమయం కోరిన పోలీసులు

పర్సువల్‌గా న్యాయస్థానం ఎదుట హాజరైన అల్లు అర్జున్



**విశ్వంభర, హైదరాబాద్:** సినీ నటుడు అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేసేందుకు పోలీసులు సమయం కోరారు. దీంతో నాంపల్లి కోర్టు విచారణను సోమవారానికి (డిసెంబరు 30) వాయిదా వేసింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో పోలీసులు ఇటీవల ఆయన్ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి విడుదలయ్యారు. మరోవైపు నాంపల్లి న్యాయస్థానం విధించిన 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ మిగతా2లో...



## జనవరి 3న ఇందిరా పార్క్ వద్ద భారీ సభ

- రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు వెళ్తామంటే తీవ్ర పరిణామాలు
- రానున్న జనగణనలో భాగంగా బీసీ కులగణన చేపట్టాలి
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఎమ్మెల్సీ కవిత డిమాండ్
- కవితతో భేటీ అయిన 40కిపైగా బీసీ కుల సంఘాల నేతలు

**స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలకు పోవద్దు**

**విశ్వంభర,హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచకుంటే తాము ఎన్నికలు జరగనివ్వబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ మేరకు రిజర్వేషన్లు పెంచిన తర్వాతే ప్రభుత్వం ఎన్నికలను నిర్వహించడంపై ఆలోచన చేయాలని, లేదంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీల అమలు కోసం జనవరి 3న ఇందిరా పార్కు వద్ద భారీ సభను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. దాదాపు 40కిపైగా బీసీ కుల సంఘాలకు చెందిన నాయకులు శుక్రవారం ఎమ్మెల్సీ కవితతో మిగతా2లో...

## తిరుమలలో తెలంగాణ భక్తులు నిర్లక్ష్యానికి గురవుతున్నారు

- మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చే సిఫార్సు లేఖలను టీటీడీ స్వీకరించడం లేదు
- అప్పట్లో తమ దురదృష్టం వల్ల శ్రీశైలాన్ని కోల్పోయి ఆంధ్రాకు ఇవ్వాల్సి వచ్చింది
- తెలంగాణ నుంచి టీటీడీకి అధిక రాబడి వస్తోంది
- తెలంగాణలో ధర్మప్రచారానికి నిధులు కేటాయించాలి
- మంత్రి కొండా సురేఖ



2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి

## పీహెచ్‌డీ విద్యార్థిని బలవన్మరణం

ముగ్గురు నిందితుల అరెస్టు



**విశ్వంభర, హైదరాబాద్:** కానిస్టేబుల్ వేధింపులు భరించలేక పరిశోధక విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. ఉద్యోగం ఇప్పిస్తానని తండ్రి తీసుకున్న డబ్బు తిరిగివ్వాలని మిగతా2లో...

## మితిమీరిన వేగం.. ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు దుర్మరణం

- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన బుల్లెట్ బైక్
- ఈ ప్రమాదంలో ఘటనా స్థలిలోనే ఒకరు మృతి చెందగా,
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి



2



## నేటి చికెన్ ధరలు

| ఫామ్ ధర | రిటైల్ |
|---|---|
| ₹ 103 | ₹ 125 |
| **స్కిన్** | **స్కిన్ లెస్** |
| ₹ 181 | ₹ 206 |



2

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించండి

సర్కార్‌కు మాజీ సర్పంచ్‌ల డిమాండ్

## దిల్లీలోని నిగమ్‌బోధ్ ఘాట్‌లో మన్మోహన్ అంత్యక్రియలు

**మొదటిపేజీ తరువాయి**
గుర్తు చేశారు. దేశ ప్రజల హృదయాల్లో మన్మోహన్ సింగ్ అత్యంత గౌరవనీయమైన స్థానాన్ని కలిగి ఉన్నారని, ఆయన సేవలు, సాధించిన విజయాలు అపూర్వమైనవన్నారు. దిల్లీలోని మోతీలాల్ నెహ్రూ రోడ్డులో మన్మోహన్‌సింగ్ నివాసంలోనే ఆయన పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచారు. శనివారం ఉదయం 8 గంటలకు అక్కడి నుంచి ఏఐసీసీ ప్రధాన కార్యాలయానికి తరలిస్తారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానుల సందర్శనార్థం ఉదయం 8.30గంటల నుంచి 9.30గంటల వరకు అక్కడే ఉంచుతారు. అనంతరం అక్కడి నుంచి అంతిమయాత్ర మొదలవుతుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు.

## పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించండి..

### మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేత

**హైదరాబాద్ :** పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని రేవంత్ రెడ్డి సర్కార్‌ను డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లంతా మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సర్పంచ్‌లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపు ఘాట్ వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ వినతిపత్రం సమర్పించింది.ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం పాటుపడ్డ సర్పంచ్‌ల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించడం లేదన్నారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు ఇవ్వకుండా ఏడాది కాలంగా ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. పెండింగ్ బిల్లులను చెల్లించకపోవడంతో.. ఆర్థిక ఇబ్బందులు కొంతమంది సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కొందరి సర్పంచ్‌ల కుటుంబాలు చిన్నాభిన్నం అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల కోసం తీసుకొచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక వేధింపులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇక మాజీ సర్పంచ్‌లను మభ్యపెట్టకుండా.. వీలైనంత త్వరగా పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, ఉపాధ్యక్షుడు కేశబోయిన మల్లయ్య, గణేష్, నవీన్ కుమార్, పల్లె వెంకటేశం, సంఘం రాష్ట్ర నాయకులు ప్రణీత్ చంద్, బాషబోయిన ఉప్పలయ్య, లాగ్గాని రమేశ్, పూర్ణ చందర్ గౌడ్ రాష్ట్ర కమిటి తదితరులు పాల్గొన్నారు.

### మితిమీరిన వేగం.. ఇద్దరు సాఫ్ట్‌వేర్

## ఉద్యోగులు దుర్మరణం

**విశ్వంభర, హైదరాబాద్:** రోడ్డు ప్రమాదంలో ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మృతి చెందిన ఘటన మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బోరబండకు చెందిన ఆకాష్, రఘుబాబు అర్ధరాత్రి సమయంలో బోరబండ నుంచి మాదాపూర్ వెళ్తుండగా.. మాదాపూర్ 100 ఫీట్ రోడ్‌లోని పర్వత్ నగర్ చౌరస్తా సమీపంలో బుల్లెట్ బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలిలోనే ఒకరు మృతి చెందగా, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరొకరు మృతి చెందినట్టు మాదాపూర్ పోలీసులు తెలిపారు. బైక్ నడిపిన యువకుడు మద్యం మత్తులో ఉన్నాడని, అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

## కేటీఆర్‌ను 31 వరకు అరెస్టు చేయొద్దు..

**విశ్వంభర, హైదరాబాద్:** ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో శుక్రవారం విచారణ జరిగింది. హైకోర్టు ఆదేశం మేరకు ఏసీబీ కౌంటర్ దాఖలు చేసింది. కేటీఆర్‌ను అరెస్టు చేయకుండా జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఏసీబీ కోరింది. కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దన్న ఉత్తర్వులను ఈ నెల 31వ తేదీ వరకు కోర్టు పొడిగించింది. తదుపరి విచారణను కోర్టు ఈ నెల 31వ తేదీకి వాయిదా వేసింది. ఈ నెల 30 వరకు కేటీఆర్‌ను అరెస్టు చేయొద్దని వారం రోజుల క్రితం హైకోర్టు ఏసీబీని ఆదేశించిన సంగతి తెలిసిందే.

## అల్లు అర్జున్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**మొదటిపేజీ తరువాయి**
నేటితో ముగిసింది. దీంతో శుక్రవారం ఆయన వర్చువల్‌గా న్యాయస్థానం ఎదుట హాజరయ్యారు.మరోవైపు సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట ఘటనలో విచారణనూ నాంపల్లి కోర్టు వాయిదా వేసింది. దీనిపై తదుపరి విచారణను జనవరి 10వ తేదీన చేపట్టనున్నట్లు వెల్లడించింది. అల్లు అర్జున్ రిమాండ్‌పైనా విచారణ ఆ రోజే జరగనుంది.

## ఎట్టకేలకు టీజీ టెట్ -2024 హాల్ టికెట్లు విడుదల..

**విశ్వంభర, హైదరాబాద్:** టీజీ టెట్ -2024 హాల్ టికెట్లు ఎట్టకేలకు విడుదలయ్యాయి. షెడ్యూల్ ప్రకారం గురువారమే హాల్ టికెట్స్ విడుదల చేయాల్సి ఉండగా.. కానీ విడుదల చేయలేదు. మొత్తానికి శుక్రవారం సాయంత్రం 5 గంటల తర్వాత టీజీ టెట్ హాల్ టికెట్లను విడుదల చేశారు.జనవరి 2 నుంచి 20వ తేదీ దాకా టెట్ పరీక్షలను ఆన్‌లైన్ పద్ధతిలో నిర్వహించనున్నారు. అయితే జనవరి 11వ తేదీన నిర్వహించే మార్నింగ్ సెషన్, జనవరి 20న నిర్వహించే ఉదయం, మధ్యాహ్నం సెషన్లకు సంబంధించిన హాల్ టికెట్లను విడుదల చేయలేదని అధికారులు పేర్కొన్నారు. సాంకేతిక కారణాల వల్ల ఆ మూడు సెషన్ల హాల్ టికెట్లను విడుదల చేయలేకపోతున్నామని, ఈ సెషన్స్‌కు సంబంధించిన హాల్ టికెట్లు సంబంధిత వెబ్‌సైట్‌లో డిసెంబర్ 28 నుంచి అందుబాటులో ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు. టెట్ హాల్ టికెట్ల కోసం https://tgtet2024.aptonline.in/tgtet/ అనే వెబ్‌సైట్‌ను సంప్రదించొచ్చు. టెట్ హాల్ టికెట్ డౌన్ లోడ్ కోసం జర్నల్ నంబర్, పుట్టిన తేదీ తప్పనిసరి.



# తెలంగాణకు ఆప్తుడు

**మొదటిపేజీ తరువాయి**
ఉద్యమం మరుగునపడినా.. మళ్లీ 2000 దశకంలో ఉధృతమైంది. దీంతో 2004 ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో తెలంగాణ అంశాన్ని చేర్చింది. తాము అధికారంలోకి వస్తే రాష్ట్రం తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆయన నాయకత్వంలోనే సోనియాగాంధీ కమిటీని నియమించారు. ఆ కమిటీ తెలంగాణ కాంగ్రెస్‌నేతల అభిప్రాయాలను విన్నారు. తెలంగాణ ప్రాంత ఎమ్మెల్యేలు తెలంగాణ ఎందుకు అవసరం అనే అంశాన్ని వివరించడానికి ప్రొఫెసర్‌జయశంకర్‌ఎంచుకుని ఆయనకు వివరించారు. ఆ తరువాతే ఆయనే ప్రధానమంత్రి కావడం, తెలంగాణ అంశాన్ని రాష్ట్రపతి ప్రసంగంలో చేర్చడం, ఆ తరువాత ప్రణబ్ ముఖర్జి నేతృత్వంలో కమిటీని వేయడం జరిగింది. మన్మోహన్ ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ ఏర్పాటు ప్రకటన నుంచి .. ఆవిర్భావం వరకు అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2009లో తెలంగాణ ఉద్యమం తారాస్థాయికి చేరింది. కేసీఆర్ దీక్ష, బంద్ లు, రాస్తారోకోలు, ఉస్మానియా యూనివర్సిటీ ఆందోళనలు, రాష్ట్రవ్యాప్తంగా నిరసనలతో తెలంగాణ ప్రాంతం అట్టుడికింది. దీంతో డిసెంబర్ 9, 2009 న నాటి హోం మంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రకటన చేసారు. ఆ వెంటనే ఆంధ్ర నేతలు, ఎంపీలు రాష్ట్ర విభజన నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. కేంద్ర కేబినెట్‌లో ఉన్న ఏపీ నేతలు రాజీమానా చేసేందుకు సిద్ధమయ్యారు. ఏపీ నుంచి నాటి మన్మోహన్ కేబినెట్ లో చిరంజీవితో సహా అయిదుగురు మంత్రులు ఉన్నారు. అయినప్పటికీ మన్మోహన్ సింగ్ వెనక్కి తగ్గలేదు. పార్లమెంట్ లో లగడపాటి పెప్పర్ స్ప్రేతో హంగామా చేసారు. కానీ, మన్మోహన్ వెనుకడుగు వేయలేదు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానం మేరకు అధ్యయనం కోసం జస్టిస్ శ్రీకృష్ణ కమిటీని నియమించింది. కమిటీ నివేదిక వచ్చిన తర్వాత రాష్ట్ర ఏర్పాటు విషయంలో మన్మోహన్ సర్కార్ ముందుకెళ్లింది. తెలంగాణ బిల్లు సమయంలోనూ తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అభి ప్రాయాలను మన్మోహన్ పరిగణలోకి తీసుకున్నారు.చిదంబరం ప్రకటన నాటి నుంచి నాలుగేళ్ల పాటు ఆలస్యమైనా ఆతర్వాత పార్లమెంటు ముందుకు తెలంగాణ బిల్లు వచ్చింది. పార్లమెంట్ లో 2014 ఫిబ్రవరిలో తెలంగాణ బిల్లు ఆమోదం వేళ నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. రాజ్యసభలో ఆమోదానికి ముందు అప్పటి బీజేపీ నేతలు అరుణ్ జైట్లీ, వెంకయ్యనాయుడు తదితరులు ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని పట్టుపడుతున్నప్పుడు.. ఏపీకి ప్రత్యేక హోదా హామి ఇచ్చి.. ఇప్పటికిప్పుడు బిల్లులో ప్రత్యేక హోదా చేర్చితే ఆ బిల్లు కాస్తా ఆర్థిక బిల్లుగా మారి మళ్లీ లోక్‌సభకు వెళ్లాల్సి వస్తుందని, అంత సమయం లేదని, ఏపీకి ఖచ్చితంగా ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించారు. ఏపీకి ప్రత్యేక హోదా తో పాటుగా కేంద్ర సంస్థలను కేటాయిస్తామని రాజ్యసభలో ప్రధాని హోదాలో మన్మోహన్ హామీ ఇచ్చారు.

బిల్లును ఆమోదం సమయంలో పార్లమెంటులో గందరగోళం నెలకున్నా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటులో ఇచ్చిన మాటకు కట్టుబడ్డారు. రాష్ట్ర విభజన సమయంలో మన్మోహన్ ప్రభుత్వానికి పూర్తి స్థాయి మద్దతు లేకపోయినా వ్యూహాత్మకంగా వ్యవహరించి తెలంగాణ ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి ఉండేవారమని మన్మోహన్ తరువాతి కాలంలో పలు సందర్భాల్లో వ్యాఖ్యానించారు.ప్రత్యేక రాష్ట్ర బిల్లు ఆమోదం పొందడంలో మన్మోహన్ సింగ్ కీలక భూమిక పోషించారని నాటి కేంద్ర హోంమంత్రి సుశీల్ కుమార్ షిండే వ్యాఖ్యానించారు.రాజ్యాంగ ప్రక్రియ ద్వారా ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేయడమే కాకుండా ఏపీ పునర్విభజన చట్టం రూపకల్పన, ఏపీకు హామీలు అన్నీ ఆయన ఇచ్చినవే.మొత్తానికి తెలంగాణ ఏర్పాటులో మన్మోహన్ సింగ్ పాత్రను తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం కోల్పోయినా విభజన సమస్యల పరిష్కారానికి మన్మోహన్ డిమాండ్ చేశారు.

**జయశంకర్ సార్‌తో..**
తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ ఉద్యమకారులతో మన్మోహన్ సింగ్ కు అవినాభావ సంబంధాలున్నాయి. తెలంగాణ సిద్దాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ కు మన్మోహన్ సింగ్ కు సన్నిహితంగా ఉండేవారు. మన్మోహన్ సింగ్ యూజీసీ చైర్మన్‌గా కూడా పనిచేశారు. మన్మోహన్‌యూజీసీ చైర్మన్‌గా ఉండగా ప్రొఫెసర్ జయశంకర్ ఇండియన్ ఫారన్‌లాంగ్వేజస్‌యూనివర్సిటి(ఇఫ్లూ) కు రిజిస్ట్రార్‌గా పనిచేశారు. ఇది సెంట్రల్ యూనివర్సిటి. దీంతో ఈ యూనివర్సిటికి నేరుగా యూజీసీతో సంబంధాలు ఉండేవి. దీంతో ప్రొఫెసర్ జయశంకర్ మన్మోహన్ సింగ్‌ను పలు మార్లు కలిసి యూనివర్సిటికి సంబంధించిన అనేక అంశాలను చర్చించారు. ఈ సంబంధాలు కొన్ని దశాబ్దాల తరువాత తెలంగాణ ఉద్యమ సమయంలో మళ్లీ కలిశాయి. తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రధానిగా ఉన్న మన్మోహన్‌సింగ్‌కు వివరించడానికి తనకు ఎంతగానో దోహదం చేశాయని పలు మార్లు జయశంకర్ సార్‌చెప్పే వారు.

**మన్మోహన్ సింగ్ సహకారం మరువలేనిది: కేసీఆర్**
మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ సంతాపం తెలియజేశారు. తెలంగాణ ఉద్యమం నుంచి రాష్ట్ర ఏర్పాటు వరకు మన్మోహన్ సింగ్ అందించిన సహకారం మరువలేనిదని కొనియాడారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. " దేశ ఆర్థిక సంస్కరణల ఆర్కిటెక్ట్ గా మన్మోహన్ సింగ్ దేశానికి అమోఘమైన సేవలు అందించారు.దాంతోపాటు తెలంగాణకు ప్రత్యేకమైన అనుబంధం మన్మోహన్ సింగ్ తో ఉంది. వారి కేబినెట్ లో మంత్రిగా పనిచేసిన నాకు వారితో వ్యక్తిగత అనుబంధం ఉంది. వారెంతో స్థితప్రజ్ఞత కలిగిన దార్శనికులు. తెలంగాణ ఉద్యమ సమయంలో నుంచి రాష్ట్ర ఏర్పాటు దాకా వారు అందించిన సహకారం తెలంగాణ సమాజం మరువదు. తెలంగాణ కోసం పోరాడుతున్న నాకు, టిఆర్ఎస్ పార్టీకి ప్రతి సందర్భంలో ఆయన మనోధైర్యాన్ని నింపుతూ అండగా నిలిచారు. వారు ప్రధానిగా ఉన్న సమయంలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగింది. రాష్ట్ర ఏర్పాటులో సానుకూల వైఖరితో నాకు వారు అందించిన సహకారం మరువలేను అన్నారు.

**చివరిసారి తెలంగాణకు వచ్చింది అప్పుడే..**
మన్మోహన్ సింగ్ చివరి సారిగా తెలంగాణలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక 2014 ఏప్రిల్ 26న భువనగిరిలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి మన్మోసింగ్ హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ లేకుంటే సాధ్యం కాకపోయేదని ఆ సభలో ప్రసంగించారు. అంతకు మందు ప్రధాని అధికారిక హోదాలో 2013 ఫిబ్రవరి 24కు తెలంగాణ ప్రాంతంలో పర్యటించారు. దేశ వ్యాప్తంగా నేటికి ప్రజల ఆధరణ పొందుతున్న పథకంగా ఉపాధి హామీ ఉంది. ఈ పథకాన్ని మొదట తీవ్ర కరువు దుర్భర పరిస్థితి ఉండే ఉమ్మడి రాష్ట్రంలో అనంతపురం జిల్లాలో మన్మోహన్‌సింగ్ ప్రారంభించారు. ఈ పథకం ఇప్పటికీ నిరుపేదలకు బుక్కెడు బువ్వను పెడుతుంది.

**పీవీ అంత్యక్రియలకు హాజరు..**
తాను ప్రధాని అయినా కూడా తనకు హోదా, గుర్తింపు రావడానికి ప్రధాన కారణమైన పీవీ నరసింహరావు పట్ల చివరి వరకు కృతజ్ఞతను వ్యక్తం చేశారు. పీఎం హోదాలో పీవీ నరసింహరావు అంత్యక్రియలకు హైదరాబాద్‌కు వచ్చి హాజరై నివాళులర్పించారు.

## జనవరి 3న ఇందిరా పార్క్ వద్ద భారీ సభ

**మొదటిపేజీ తరువాయి**
భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బీసీల సమస్యలు, హామీల అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తడి తెచ్చే కార్యచరణపై సుదీర్ఘంగా చర్చలు జరిపారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత మీడియా తో మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, కానీ ప్రధాన డిమాండ్ గా ఉన్న బీసీల రిజర్వేషన్ పెంపుపై స్పష్టత ఇవ్వకుండా ఎన్నికలు జరపడానికి వీలు లేదని తేల్చిచెప్పారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ లో పేర్కొందని గుర్తు చేశారు. రిజర్వేషన్లు పెంచకుండానే ఎన్నికలు నిర్వహిస్తారా అన్న అనుమానాలు కలుగుతున్నాయని, రిజర్వేషన్లు పెంచకుంటే ఎన్నికలు జరగనివ్వబోమని ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. మండల కేంద్రాల్లో, జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు చేస్తామని స్పష్టం చేశారు. బీసీ డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చాకా, బీసీ జనాభాను వెల్లడించిన తర్వాతే ప్రభుత్వం ఎన్నికలపై ఆలోచన చేయాలని, అంత వరకు స్థానిక సంస్థల ఎన్నికల గురించి ప్రభుత్వం ఆలోచన చేయకూడదని సూచించారు. రానున్న జనగణనలో భాగంగా బీసీ కులగణన చేపట్టాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. బీసీలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వాల వైఖరిని ఎండగడుతామని చెప్పారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌ను యధాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇది ట్రైలర్ మాత్రమే... జనవరి 3న సినిమా చూపిస్తామని వ్యాఖ్యానించారు. జనవరి 3 నాటి సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు.బీసీల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ హాయంలో ప్రవేశపెట్టిన పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడం పట్ల ఎమ్మెల్సీ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలకు, ముఖ్యంగా పేద ప్రజలకు ఎంతగానో లబ్ధీ చేస్తున్న పథకాలను నిలిపివేయడం సరికాదని సూచించారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బొల్లా శివశంకర్, సుమిత్ర ఆనంద్, మఠం భిక్షపతి, అనంతుల ప్రశాంత్ , పెంట రాజేష్, ఆలకుంట హరి, ఆర్వి మహేందర్, గోవర్ధన్ యాదవ్, గౌరిగే నరసింహ, గోప సదనందు, కోట్ల యాదగిరి, ఎం నరహరి, దుగట్ల నరేష్, ఇతరి మారయ్య, కుమార స్వామి, గంధాల శ్రీనివాస్ చారి, రమేష్ బాబు, జి హరిప్రసాద్, సురేందర్, విజేందర్ సాగర్, శ్రీధర్ చారి, రవీంద్రనాథ్, కే శ్రీనివాస్, ప్రవీణ్, భారత అఖిల్, హరి దేవ్ సింగ్, సురేష్, మురళీకృష్ణ, నిమ్మల వీరన్న, మందుల శ్రీనివాస్, కే నరసింహ రాజు, ప్రవీణ్, పార్వతయ్య, నరసింహ, కడెకేకర్ రాకేష్, ఆవుల మహేష్, ఎంగులూరి శ్రీను, హుస్సేన్, రామచందర్, వాడేపల్లి మాధవ్, శ్యాంసింగ్ లోదే, దామ శివ కుమార్, వేణుమాధవ్, ఎండి నవీద్, వరలక్ష్మి, స్వప్న, లావణ్య యాదవ్ పద్మా గౌడ్ సూర్య పల్లి పరశురాం, ఏ చాలా దత్తాత్రేయ, జిల్లా నరేందర్, డాక్టర్ కీర్తి లతా గౌడ్, వింజమూరి రాఘవాచారి, సాల్వా చారి, రూపా దేవి, అప్ప సతీష్ మరియు తదితరులు పాల్గొన్నారు

## తిరుమలలో తెలంగాణ భక్తులు నిర్లక్ష్యానికి గురవుతున్నారు

**విశ్వంభర, అమరావతి :** తెలంగాణ మంత్రి కొండ సురేఖ తిరుమల దర్శనంపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం నుంచి నేటి వరకు తిరుమలలో తెలంగాణ భక్తులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని విమర్శించారు. శ్రీశైలం భ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామిని ఆమె శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో తెలంగాణ భక్తులకు జరుగుతున్న నిర్లక్ష్యాన్ని ఎండగట్టారు.తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇచ్చే సిఫార్సు లేఖలను టీటీడీ (TTD ) స్వీకరించడం లేదని ఆరోపించారు. తెలంగాణ భక్తుల గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో మంతనాలు జరుపుతున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో మాట్లాడగా సీఎం సానుకూలంగా స్పందించారని అన్నారు. టీటీడీ తెలంగాణ భక్తుల మీద ప్రత్యేక దృష్టి సారించి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అప్పట్లో తమ దురదృష్టం వల్ల శ్రీశైలాన్ని కోల్పోయి ఆంధ్రాకు ఇవ్వాల్సి వచ్చిందని అన్నారు.తెలంగాణ నుంచి టీటీడీకి అధిక రాబడి వస్తోందని , టీటీడీ తెలంగాణలో ధర్మప్రచారానికి నిధులు కేటాయించాలని కోరారు. తెలంగాణలో దేవాలయాలు, కల్యాణ మండపాల నిర్మాణానికి టీటీడీ సహకరించాలని మంత్రి కోరారు.

## అకారణంగా పోలీసులు కొట్టారు

### నిమ్స్ అత్యవసర విభాగం వద్ద సిబ్బంది ఆందోళన

**విశ్వంభర, పంజాగుట్ట:** హైదరాబాద్ పంజాగుట్టలోని నిమ్స్ అత్యవసర విభాగం వద్ద సిబ్బంది ఆందోళనకు దిగారు. నిమ్స్ వర్కర్‌ను పంజాగుట్ట పోలీసులు కొట్టడాన్ని నిరసిస్తూ.. సిబ్బంది ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం ఓ రోగి .. ఎంఆర్ఐ స్కానింగ్ కోసం నిమ్స్‌కు వచ్చారు. ఈ క్రమంలో స్కానింగ్ పూర్తయిన తర్వాత చూడగా... రోగి బంగారు గొలుసు కనిపించలేదు. దీంతో అతను.. విధుల్లో ఉన్న వర్కర్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణలో భాగంగా నిమ్స్ వర్కర్‌ను పంజాగుట్ట పోలీసులు కొట్టారని ఇతర సిబ్బంది ఆరోపించారు. చివరకు ఆ బంగారు గొలుసు రోగి వద్దే లభించింది. దీంతో పూర్తిగా నిర్ధరణకు రాకుండానే దొంగతనం పేరుతో వర్కర్‌ను పోలీసులు కొట్టారని అత్యవసర విభాగం వద్ద సిబ్బంది నిరసనకు దిగారు.




## మన్మోహన్ పార్థివదేహానికి రాష్ట్రపతి, ప్రధాని నివాళి

**దిల్లీ:** భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ( పార్థివదేహానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము , ప్రధాని నరంద్రమోదీ నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం మన్మోహన్ నివాసానికి వెళ్లిన వీరు.. ఆయన భౌతికకాయం వద్ద అంజలి ఘటించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అనంతరం ప్రధాని మోదీ మాట్లాడుతూ.. ''ఆర్థికవేత్తగా, సంస్కరణల సారథిగా మన్మోహన్ సింగ్‌ను దేశం గుర్తుంచుకుంటుంది. ఆర్‌బీఐ గవర్నర్ సహా అనేక కీలక పదవుల్లో దేశానికి సేవలందించారు. పీవీ హయాంలో ఆర్థికమంత్రిగా దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చివేశారు. దేశం, ప్రజల పట్ల ఆయన సేవాభావం స్మరించుకోదగినది. విలక్షణ పార్లమెంటేరియన్‌గా ఆయన సేవలు అందించారు. ఎన్నో కీలక పదవులు చేపట్టినా నిరాడంబర జీవితం గడిపారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ఆయనతో చాలాసార్లు మాట్లాడా. ఆయన మృతి విచారకరం. నా తరఫున, దేశ ప్రజల తరఫున శ్రద్ధాంజలి ఘటిస్తున్నా'' అని మోదీ తెలిపారు.

**ఓ మార్గదర్శకుడిని కోల్పోయా: సోనియా గాంధీ**
మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వివేకానికి, వినయానికి ప్రతిరూపమైన ఓ గొప్ప నాయకుడిని, మార్గనిర్దేశకుడిని పార్టీ కోల్పోయిందన్నారు. ఆయన దూరదృష్టితో దేశంలోని లక్షలాది మంది ప్రజల జీవితాల్లో వెలుగులు విరిశాయన్నారు. గొప్ప రాజనీతిజ్ఞుడిగా ప్రపంచవ్యాప్తంగా మన్ననలు పొందారని గుర్తు చేసుకున్నారు. మన్మోహన్ సింగ్ వ్యక్తిగతంగా సౌమ్యుడే అయినప్పటికీ.. విశ్వాసాలకు సంబంధించిన అంశాల్లో దృఢ నిశ్చయంతో ఉండేవారని తెలిపారు. ఆయన లేని లోటు పార్టీకి, దేశానికి పూడ్చలేనిదని, వ్యక్తిగతంగా తాను ఓ స్నేహితుడిని, తత్వవేత్తను, మార్గదర్శకుడిని కోల్పోయానని ఆమె భావోద్వేగానికి గురయ్యారు.మన్మోహన్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తాం: సీడబ్ల్యూసీ తీర్మానం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సంతాపం తెలిపింది. ఆయన ఆశయాలను, వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్తామని తీర్మానం చేసింది. ఆయన నిజమైన రాజనీతిజ్ఞుడని, దేశం కోసమే జీవితాన్ని ధారపోశారని సీడబ్ల్యూసీ గుర్తు చేసుకుంది. నాయకుడిగా, ఆర్థికవేత్తగా, నిరాడంబరమైన వ్యక్తిగా మన్మోహన్ సింగ్ జీవితం చాలా మందికి ఆదర్శంగా నిలుస్తుందని, ఆయన వారసత్వం ఎప్పటికీ జీవించే ఉంటుందని దేశాభివృద్ధి కోసం అందర్నీ ప్రేరేపిస్తుందని సీడబ్ల్యూసీ పేర్కొంది.

**మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి నివాళులర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి**
మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పార్థివదేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాళులర్పించారు. బెళగావి నుంచి నేరుగా దిల్లీ వెళ్లిన సీఎం... అక్కడి నుంచి మన్మోహన్ నివాసానికి వెళ్లి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ, పలువురు ఎంపీలు, కాంగ్రెస్ నేతలు ఉన్నారు.



## పీహెచ్‌డీ విద్యార్థిని బలవన్మరణం

**మొదటిపేజీ తరువాయి**
దీప్తిని వేధించడంతో మనస్తాపానికి గురై ఉరేసుకుని బలవన్మరణాని పాల్పడింది. ఈ కేసులో సంగీతరావు, అనిత, ఆమె తండ్రి సోమయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనిత భర్త అనిల్, సైదులు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలివీ. నాచారంలోని బాపూజీనగర్ సరస్వతీకాలనీకి చెందిన పులివర్తి దీప్తి(28) హబ్సిగూడలోని ఐఐసీటీ(ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ)లో ప్రాజెక్టు అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. దీప్తి తండ్రి సంగీతరావు ఐఐసీటీలో పనిచేసి పదవీ విరమణ పొందారు. సంగీతరావుకు డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బెల్లా అనిల్‌తో పరిచయముంది. సంగీతరావు.. అనిల్ భార్య అనితకు ఐఐసీటీలో ఉద్యోగం ఇప్పిస్తానని రెండేళ్ల క్రితం రూ.15 లక్షలు తీసుకున్నాడు. ఈ ఏడాది సెప్టెంబరు వరకూ ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో అనిల్ తన డబ్బు తిరిగివ్వాలని దీప్తిని అడిగేవాడు. డబ్బు తన తండ్రి తీసుకున్నాడని, ఆయన తమతో చాలా ఏళ్ల నుంచి కలిసి ఉండడం లేదని సమాధానం చెప్పింది. అనిల్ పట్టించుకోకుండా తన భార్యతో నాచారం ఠాణాలో ఫిర్యాదు చేయించాడు. దీప్తి, సంగీతరావు మీద ఛీటింగ్ కేసు నమోదైంది. అనిల్, అనిత న్యాయస్థానంలో సివిల్ దావా కూడా వేశారు. మనస్తాపానికి గురైన దీప్తి బుధవారం రాత్రి 10 గంటల సమయంలో చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తల్లి వచ్చి చూసేసరికి అప్పటికే మరణించింది. ఫోన్ తనిఖీ చేస్తే.. సెల్ఫీ వీడియో ఉంది. నాచారం పోలీసులు అనిత, అనిల్, సోమయ్య, సైదులు మీద కేసు నమోదు చేశారు.

**వీడియోలో ఏముందంటే..!**
''నా మరణానికి అనిల్, ఆయన భార్య అనిత, ఆమె తండ్రి సోమయ్య కారణం. నాన్న డబ్బు తీసుకుంటే నామీద నకిలీకేసు నమోదు చేయించి జీవితాన్ని నాశనం చేశారు. ఈ కేసుల మీద పోరాడే స్తోమత లేదు. నా మరణంతోనైనా కుటుంబానికి న్యాయం జరుగుతుంది. నా చావుకు కారణమైన వాళ్లకు శిక్షపడాలి. నా మృతదేహాన్ని వైద్య పరిశోధనకు ఇచ్చేయండి'' అని కన్నీరు పెట్టుకుంటూ సెల్ఫీ వీడియో చిత్రీకరించింది. దీప్తి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా తెలంగాణ ప్రాంత పద్మశాలి మహిళా విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ

- రాజ్యాధికారంలో మహిళలు భాగస్వామ్యం కావాలి
- ఎమ్మెల్సీ ఎల్ రమణ



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ప్రాంత పద్మశాలి మహిళా విభాగం ఆధ్వర్యంలో అధ్యక్షురాలు గుంటక రూప సదాశివ్ సభాధ్యక్షతన పద్మశాలి మహిళా విభాగం క్యాలెండర్‌ను పద్మశాలి భవన్, నారాయణగూడలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ ఎల్. రమణ, తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రి హాజరై ప్రసంగించారు. మొదటిసారిగా మహిళా విభాగం నుంచి క్యాలెండర్ ఆవిష్కరణ గొప్ప విషయమని, చాలావరకు మహిళలు ఇంటికే పరిమితం కాకుండా సేవ కార్యక్రమాల్లో, సంఘాల అభ్యున్నతికి పాల్పడడంలో చాలా కీలకమైన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. మహిళలు శక్తివంతమైన ఆలోచనలు, ఆచరణ కలిగి ముందుకు సాగాలని, అన్ని రంగాల్లో మహిళలు కీలకం కావాలని అన్నారు. రానున్న రోజుల్లో రాజ్యాధికారంలో కూడా కీలకంగా ముందుకు వెళ్తూ అన్ని విభాగాల్లో మహిళలు సాధించ లేనిది ఏమి లేదని అనేలా ఎదగాలని ఆకాంక్షించారు. రాబోయే జిహెచ్ఎంసీ ఎన్నికల్లో ఆయా పార్టీల నేతలు పద్మశాలి మహిళలకు ప్రాధాన్యత కల్పించేలా అడుగులు వేయాలని మహిళా విభాగం నేతలు ఎమ్మెల్సీ ఎల్. రమణ, టిజి ఎండిసి చైర్మన్ ఈరవత్రి అనిల్ లను కోరారు. పద్మశాలి మహిళా సంఘాలకు అనుబంధ సంఘాలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కమార్తపు మురళి, గడ్డం జగన్నాథం, బర్రింకల మధుసూదన్, వనం విశ్వనాథం, పుట్ట పాదురంగం, కొక్కుల దేవేందర్, వనం దుశ్యంతల, బొమ్మ రఘురాం, గుర్రం శ్రవణ్, పాచికంటి విష్ణుమూర్తి, రాపోలు సుధాకర్, తుమ్మ సత్యనారాయణ, అంబాటి శ్రీనివాస్, కల్లేపల్లి రాజుగారు, పోరండ్ల శారద అఖిల భారత పద్మశాలి, తెలంగాణ ప్రాంత పద్మశాలి , గ్రేటర్ పద్మశాలి మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని మన్మోహన్‌కు మహేందర్ యాదవ్ ఘన నివాళి



**విశ్వంభర, ఎల్బీనగర్:** భారత దేశ ఆర్థిక మంత్రిగా క్లిష్ట సమయాలలో తన ఆలోచన తో దేశ ఆర్థిక పరిస్థితిని చక్కబెట్టిన ఘనుడు, 10 సంవత్సరాలు భారత దేశ ప్రధాన మంత్రిగా ఉన్న మన్మోహన్ సింగ్ మృతికి టి పీసీసీ క్యాంపెనింగ్ కమిటీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ దాము మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైతన్యపురి డివిజన్‌కు చెందిన అభిమానులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని, శ్రద్ధంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, గంధం రవి కేశవ్, విజయ్ కుమార్, మహేష్ గౌడ్, విజయ్ రంగ, కుమార్, నరేందర్ రెడ్డి, రాహుల్ జైన్, తిరుమల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో కొల్లూరు డబుల్ బెడ్ రూమ్ వాసులకు బస్ సౌకర్యం



**విశ్వంభర, కొల్లూరు ;** కొల్లూరు కేసీఆర్ డబుల్ బెడ్ రూమ్ వాసులకు బస్ సౌకర్యం త్వరలో కల్పిస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. డబుల్ బెడ్ రూమ్స్ ఏఈ సత్యనారాయణ ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. డబుల్ బెడ్ రూమ్ నిర్వాసితుల విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ కి చెందిన అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు ట్రయల్ రన్ కూడా చేపట్టారు. మరో వారం రోజుల్లో బస్ సౌకర్యం పూర్తిగా కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్ రూమ్ వాసులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో 92 బ్లాక్ అడ్మిన్ మహమ్మద్ అప్సర్, హరిగౌడ్ , వసంత్ కుమార్, శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 29 వరకు శబరిమల అయ్యప్ప ఆలయం మూసివేత




**శబరి :** దేశంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శబరిమల అయ్యప్ప ఆలయంలో మండల దీక్షల సీజన్ ముగిసింది. నిన్న మధ్యాహ్నం మండల పూజ అనంతరం ఆలయం మూసివేశారు. ఈ నెల 29 వరకు ఆలయం మూసి ఉంచుతామని, తిరిగి మకర విళక్కు సీజన్ కోసం డిసెంబరు 30న సాయంత్రం 5 గంటలకు ఆలయాన్ని తెరుస్తామని దేవస్థానం వర్గాలు వెల్లడించాయి. జనవరి 14న మకర విళక్కు పర్వదినం సందర్భంగా లక్షలాదిగా అయ్యప్ప భక్తులు శబరిమలకు తరలివస్తారు. కాగా, ఈ ఏడాది అయ్యప్పస్వామిని 32,39,756 మంది దర్శించుకున్నారు. గతేడాది 28,42,447 మంది స్వామివారి దర్శనం చేసుకున్నారు.

## గెహిస్ ఇమ్మిగ్రేషన్, ఇంటర్నేషనల్ లీగల్ సర్వీసెస్ కార్యాలయం ప్రారంభం



**విశ్వంభర, హైదరాబాద్ :** ఇమ్మిగ్రేషన్ అంతర్జాతీయ చట్టపరమైన విషయాలలో ప్రత్యేకత కలిగిన ప్రముఖ న్యాయ సంస్థ గెహిస్ ఇమ్మిగ్రేషన్, ఇంటర్నేషనల్ లీగల్ సర్వీసెస్, హైదరాబాద్, నాలెడ్జ్ పార్క్ లో కొత్త బ్రాంచ్‌ను అద్దంకి దయాకర్ తెలంగాణ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, సుధా జైన్ సోషలైట్, నరేష్ ఎం గెహి ముఖ్యతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సంక్లిష్ట ఇమ్మిగ్రేషన్, అంతర్జాతీయ చట్టపరమైన సవాళ్లను ప్రతిబింబిస్తూ చేసే వ్యక్తులు, కుటుంబాలు వ్యాపారాలకు వ్యక్తిగతీకరించిన, సమర్థవంతమైన, అత్యాధునిక న్యాయ సేవలను అందించడంలో తమ సంస్థ ముందుంటుందని నిర్వహాకులు అన్నారు. ఈ సందర్భంగా గెహిస్ ఇమ్మిగ్రేషన్, ఇంటర్నేషనల్ లీగల్ సర్వీసెస్ మేనేజింగ్ పార్టనర్ నరేష్ ఎం గెహి మాట్లాడారు. భారత్, అమెరికా మధ్య ఇమ్మిగ్రేషన్ సంబంధిత వ్యవహారాలు, ఇబ్బందులు తొలగించి కుటుంబం, బిజినెస్, వ్యక్తిగతంగా వివిధ రకాల వీసాల సమస్యల పరిష్కారంలో గేహిస్ ఇమ్మిగ్రేషన్ ప్రత్యేకం అన్నారు.

భారత్, యునైటెడ్ స్టేట్స్ మధ్య అంతరాన్ని తగ్గించే మ ప్రయాణం గేహిస్ ఇమ్మిగ్రేషన్‌కు ముఖ్యమైన మైలురాయి, ఎదుగుదల ఆవిష్కరణలు, అవకాశాలు అమెరికాకు అందించడంలో భారతదేశం ఎపుడు అగ్రగామిగా వుంటుందన్నారు. చదువు, బిజినెస్, గ్రీన్ కార్డ్, వ్యవస్థల బదిలీ, స్పోర్ట్స్ రిలేటెడ్‌కు సంబధిత హెచ్ 1బీ, LIA, Eb5, EB1C, Eb1A, P వంటి పలు రకాల వీసాలు భారత్ అమెరికా దేశాలమధ్య భవిషత్తు, పురోగతికి మంచి తోడ్పాటునిస్తాయని తెలిపారు.

ఇమ్మిగ్రేషన్, అంతర్జాతీయ న్యాయ సేవల కోసం డిమాండ్ పెరుగుతున్నందున, తాము తమ ఖాతాదారులకు అందుబాటులో ఉండటానికి మరిన్ని ప్రదేశాలలో సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని నరేష్ ఎం గెహి పేర్కొన్నారు.

## జగన్ ఇంటి ముందు ధర్నా చేయండి: మంత్రి నిమ్మల



**అమరావతి :** జగన్ హయాంలో తొమ్మిది సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తాను పెంచిన విద్యుత్ చార్జీలపై తానే ధర్నా చేస్తున్న వ్యక్తి జగన్ అని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ప్రజల నెత్తిన విద్యుత్ చార్జీల బండ వేసిందంటూ వైసీపీ నేతలు ధర్నాలు చేస్తుండడం పట్ల నిమ్మల తీవ్రస్థాయిలో స్పందించారు. విద్యుత్ చార్జీలు పెంచింది జగనే కాబట్టి, ఆ ధర్నాలేవో జగన్ ఇంటి ముందు చేయాలని వైసీపీ నేతలకు సూచించారు. విద్యుత్ చార్జీల పేరుతో ప్రజలపై రూ.16 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు. మరోవైపు డిస్కంలపై రూ.18 వేల కోట్ల బకాయిల భారం పడిందని, అది ఇప్పుడు ప్రజల పై ప్రభావం చూపుతోందని అన్నారు. కమీషన్లకు కక్కుర్తిపడి అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేశారని మంత్రి నిమ్మల ఆరోపించారు. 201419 కాలంలో ఏపీని మిగులు విద్యుత్ రాష్ట్రంగా మార్చిన ఘనత చంద్రబాబుదేనని అన్నారు.

## ఎంపీడీవోపై దాడి.... నేడు కడప వెళ్లనున్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్



**కడప :** అన్నమయ్య జిల్లాలో ఓ వైసీపీ నేత దాష్టీకానికి గురైన గాలివీడు ఎంపీడీవో జవహర్ బాబు ప్రస్తుతం కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం కడప వెళ్లి రిమ్స్ లో జవహర్ బాబును పరామర్శించనున్నారు. గాలివీడు ఎంపీపీ పద్మావతమ్మ కుమారుడు సుదర్శన్ రెడ్డి ఇవాళ మండల పరిషత్ కార్యాలయానికి వచ్చి ఎంపీపీ ఛాంబర్ తాళాలు ఇవ్వాలని ఎంపీడీవో జవహర్ బాబును అడిగాడు. ఎంపీపీ వస్తేనే తాళాలు ఇస్తామని జవహర్ బాబు చెప్పడంతో, ఆగ్రహావేశాలకు గురైన సుదర్శన్ రెడ్డి తన అనుచరులతో కలిసి దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలపాలైన జవహర్ బాబును పోలీసులు అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనపై పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగిపై దాడికి పాల్పడిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తద్వారా బలమైన సంకేతాలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఆ ఎంపీడీవోకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగిపై దాడిని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ వ్యవహారంపై నివేదిక ఇవ్వాలంటూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ను ఆదేశించారు.

## వైసీపీకి రాజీనామా చేసిన మాజీ ఐఏఎస్ ఇంతియాజ్ అహ్మద్



**కర్నూల్ :** జగన్ నాయకత్వంలోని వైసీపీ నుంచి మరో నేత బయటికి వచ్చారు. మాజీ ఐఏఎస్ అధికారి, కర్నూలు వైసీపీ ఇన్చార్జి ఇంతియాజ్ అహ్మద్ పార్టీకి గుడ్ బై చెప్పారు. వైసీపీకి రాజీనామా చేస్తున్నట్టు ఆయన ఇవాళ ప్రకటించారు. ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటానని స్పష్టం చేశారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సూచన మేరకే రాజీనామా చేశానని వెల్లడించారు. ఇక మీదట సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటానని ఇంతియాజ్ అహ్మద్ తెలిపారు.

గత ఎన్నికల్లో ఇంతియాజ్ అహ్మద్ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసీపీ తరఫున పోటీ చేశారు. అయితే ఆ ఎన్నికల్లో ఆయన ఓటమిపాలయ్యారు. 2019లో వైసీపీ గెలిచాక ఇంతియాజ్ అహ్మద్ కృష్ణా జిల్లా కలెక్టర్ గా పనిచేశారు. పదవీ విరమణ సమయం సమీపిస్తుండడంతో, ఆయన రాజకీయాలపై ఆసక్తి ప్రదర్శించారు. దాంతో, జగన్ ఆయనను పార్టీలోకి తీసుకోవడమే కాకుండా, కర్నూలు సిట్టింగ్ ఎమ్మెల్యేను సైతం కాదని టికెట్ కేటాయించారు. కానీ కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఇంతియాజ్ అహ్మద్ ఓటమిపాలయ్యారు. ఈ స్థానంలో టీడీపీ నుంచి టీజీ భరత్ విజయం సాధించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇంతియాజ్ అహ్మద్ పార్టీ కార్యకలాపాల్లో పెద్దగా కనిపించింది లేదు.

### తెలంగాణ ప్రజాప్రతినిధుల

## సిఫార్సు లేఖలపై టీటీడీ కీలక నిర్ణయం!



**తిరుమల :** తిరుమల శ్రీవారి దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించాలని తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయించింది. వారానికి రెండుసార్లు వారి సిఫార్సు లేఖలను అనుమతించాలని నిర్ణయించింది. శ్రీవారి దర్శనానికి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించకపోవడంపై ఇటీవల చర్చ సాగుతోంది. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించకపోవడాన్ని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తో పాటు అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా ఖండించారు. తిరుమల శ్రీవారి దర్శనంలో తెలంగాణ వారికి అన్యాయం జరుగుతోందని ఈరోజు మంత్రి కొండా సురేఖ కూడా వాపోయారు. ఈ క్రమంలో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల అంశాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం పునఃపరిశీలించింది. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించాలని టీటీడీ బోర్డులోని మెజార్టీ సభ్యులు కోరారు. దీంతో వారానికి రెండుసార్లు తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలను అనుమతించాలని టీటీడీ నిర్ణయించింది. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.






# అమ్మ భాషకు అడుగడుగునా అగచాట్లే..

- తెలుగును ఇంటి నుండి ప్రోత్సహించాలి
- మాతృ భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- ఈనెల 28, 29 విజయవాడ లో 6వ ప్రపంచ తెలుగు మహా సభలు జరుగుతున్న సందర్భంగా..

"అమ్మ మాటే మాతృభాష. అందుకే ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కూడా కాపాడుకోవాలి. మనుగడ కోసం ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదు. కానీ వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. మాతృ భాషను పరిరక్షించుకోవాలి. ఈ కర్తవ్యాన్ని గుర్తుచేసేందుకే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. అమ్మ భాషను రక్షించుకోవడానికి 1999లో 30వ యునెస్కో మహాసభ ఫిబ్రవరి 21వ తేదీన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించింది. ఈ వరవడిలోనే ప్రతి ఏటా విజయవాడలో కృష్ణాజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు మహాసభలు వైభవపేతంగా జరుగుతున్నాయి. ఇలా ఏటేటా తెలుగు మహాసభలను నిర్వహించుకోవడం వెనక మాతృ భాషను రక్షించుకోవాలనే పట్టుదల ప్రగాఢమైన ఆశ ఉండడం తెలుగువారు గర్వించదగిన విషయం. కాలక్రమేణా ఇంగ్లీషు భాష పై మోజు పెరిగిపోవడం వల్ల తల్లి వంటి తెలుగు భాష తల్లడిల్లి పోతుంది. తనయులమైన తెలుగు వారమంతా మన తల్లి భాష తెలుగును రక్షించుకోవలసిన ఆవశ్యకతను అందరము గుర్తించి, ఆ దిశలో మనం ప్రయత్నించాలి. తెలుగు భాష సాహిత్య సౌందర్యాన్ని అవగతం చేసుకోవాలి. పరభాష మోజులో పడి మన మాతృభాష అయిన తెలుగును అవహేళన చేయకూడదు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ బిడ్డలకు "మమ్మీ.. డాడీ.." అనే పిలుపులు నుంచి "అమ్మ.. నాన్న.." అనే పిలిపించుకొని, తెలుగును ఇంటి నుండి ప్రోత్సహించాలి. మధురమైన తెలుగు భాషను, తేనెలూరు తెలుగు భాష సౌరభాన్ని అందరము కాపాడుకోవాలి. ఇది మనందరి కర్తవ్యం గా భావించినప్పుడే తెలుగు భాష మనుగడ సాగిస్తుంది. లేదంటే తెలుగు భాషను నిర్లక్ష్యం చేస్తే అందుకు తగిన ప్రతిఫలాన్ని మనందరం అనుభవించక తప్పదు."



### తల్లడిల్లుతున్న తెలుగు భాష!

భాష అనేది భావవ్యక్తీకరణకు మాత్రమే ఒక సాధనం కాదు. అది ఒక జాతి జీవనానికి సంస్కృతులకు మూలమైనది. ఆ జాతి జీవన విధానాన్ని ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప సాధనం. నేడు ప్రపంచం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతున్నప్పటికీ ఇంగ్లీషు భాష పట్ల మోజుతో అనేక దేశాలు తమ తమ మాతృ భాషల పట్ల నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడం వలన క్రమక్రమంగా మాతృభాషలు మృత భాషలుగా మారిపోతున్నాయి. ఈ మృత భాషల జాబితాలో తెలుగు భాష కూడా ఉండడం అత్యంత బాధాకరమైన విషయం. ఏ మాతృభాష అయితే ఆ దేశంలో నిర్లక్ష్యానికి గురవుతుందో అనగా మాతృభాషలో విద్యాబోధన జరిగనట్లయితే ఆ భాష 40 ఏళ్ళలో నశించిపోతుందని యునెస్కో బహిరంగంగా ప్రకటించింది. మాతృ భాషతోనే మానవజాతికి వికాసం జరుగుతుంది. అలాంటి తల్లి భాష తెలుగు భాష నేడు తల్లడిల్లుతోంది.

### ప్రతి లోగిలిలో "అమ్మనాన్న" పిలుపుతో...

ప్రపంచంలో సుమారు 7 దేశాల్లో 230 భాషలు అంతరించాయి. ఇంకా 3000 భాషలు అంతరించే దశలో ఉన్నాయని యునెస్కో హెచ్చరిస్తోంది. ఈ భాషను జాబితాలో తెలుగు భాష కూడా ఉందని యునెస్కో ఇప్పటికే ప్రకటించింది ఒక భాషను మాట్లాడే జనాభాలో 30 శాతం మంది ఆ భాషను చదవకుండా తల్లి భాషకు దూరమైతే ఆ భాష కాలక్రమంలో మృత భాషగా మారిపోతోందని యునెస్కో ప్రకటించింది. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రతి రెండు వారాలకు ఒక భాష కనుమరుగవుతోందని కొన్ని అధ్యయనాలు ద్వారా తెలుస్తుంది. ఇలా ఉండగా భారత్ లో ఇప్పటికే 40 కి పైగా భాషలు మాండలికలు కనుమరుగయ్యే పరిస్థితి దాపురించింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ కు చెందిన గదబ, నైకి అనే గిరిజన తెగల భాషలు ఉన్నాయి. పదివేల మంది కంటే తక్కువగా మాట్లాడే భాషలు క్రమంగా కాలగర్భంలో కలిసిపోతాయని భాషా పండితులు, పరిశోధకులు చెబుతున్నారు. నీతి నియమాలు నడవడిక నేర్పే మాతృభాషలు అంతరిస్తే మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని భాషావేత్తలంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచీకరణ వల్ల ప్రపంచమంతా మనకు దగ్గరవుతుందేమో కాని మన తల్లి భాష మాత్రం మనకు దూరం అవుతుంది. ఇది ఎంతో బాధాకరమైంది. భాషా సంస్కృతులు ఒకదానితో ఒకటి ముడిపడి ఉండడం వల్ల మారుతున్న మన సంస్కృతి తో పాటు మన భాష కూడా మారిపోతుంది. ఒకప్పుడు భాషలో వచ్చే మార్పులకు కొన్ని తరాల సమయం పట్టేది. కానీ నేడు పరిస్థితి మారింది. నేడు ఒక్క తరంలోని ఎన్నెన్నో మార్పులను చూడాల్సిన పరిస్థితి వచ్చింది. తెలుగు భాష పరిస్థితి చూస్తే మరీ ఘోరంగా తయారయ్యింది. తెలుగులో చదవడానికి రాదు. తెలుగు రాష్ట్రాల్లో పుట్టి తెలుగులో మాట్లాడానికి సిగ్గు పడిపోయే దారుణమైన పరిస్థితులు దాపరించాయి. ఇద్దరు తెలుగు వాళ్ళు కలిస్తే తెలుగు తప్ప ఏ భాషలో అయినా సరే, మాట్లాడుకునే దుర్గతి దాపురించింది. తెలుగు భాషను రక్షించుకోవాలని గంటల తరబడి ఛానల్స్ లోనూ, సభా వేదికల మీద, ఉపన్యాసాలు ఇచ్చే పెద్దలు సైతం తమ చర్చలను కేవలం చర్చల వరకే పరిమితం చేస్తూ, తెలుగు భాషకు తీరని అన్యాయం చేస్తున్నారు. తమ ఇళ్లలో తమ బిడ్డలకు సైతం ఇంగ్లీషులో ఇతర భాషల్లో విద్యాబోధనను జరిపిస్తూ, ఇంట్లో "మమ్మీ.. డాడీ.. "లుగా పిలిపించుకుంటూ, ఇంగ్లీష్ భాషకు ప్రోత్సాహం ఇస్తూ, తెలుగును కనుమరుగు చేస్తున్నారు. అలాగే తెలుగు మాధ్యమంలో తమ పిల్లలకు విద్యాబోధనలు జరిపించకుండా, ఇంగ్లీష్ మాధ్యమంలోనే వారిని చదివిస్తూ ఇంగ్లీషు పట్ల తమ ఉత్సాహాన్ని చూపుతున్నారు. ఇంతకంటే అన్యాయం ఎవరు తమ తల్లి భాషకు చేసుకోవడం లేదు ఒక్క తెలుగువాడు తప్ప. తెలుగు వారు ఆత్మ విమర్శ చేసుకోవలసిన అవసరం ఎంతైనా కనిపిస్తుంది. ఇంకోపక్క ధనార్జన కోసం అంటూ ఉద్యోగాన్వేషణలో ఇంగ్లీషు భాషకే తల్లిదండ్రుల మద్దతు ఇవ్వడం, మరో వైపు ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం ఇలా అమ్మ భాషకు అడుగడుగునా అగచాట్లు కలుగుతున్నాయి. మాతృభాషకు అధికారభాష హోదా ఇచ్చినంత మాత్రాన సరిపోతుందా? అన్నింటా దానికి చెల్లు చీటీ ఇస్తే, ఇక ఆ భాష ఎలా మనుగడ సాగిస్తుంది? అన్న ప్రశ్న వేధిస్తోంది. కానీ నేటి పరిస్థితి చూస్తే అలా అనే అనిపిస్తుంది.

" అమ్మ మాటే మాతృభాష అందుకే ప్రతి బిడ్డ అమ్మను కాపాడుకున్నట్టే మాతృభాషను కూడా కాపాడుకోవాలి మనుగడ కోసం ఇతర భాషలను నేర్చుకోవడంలో తప్పులేదు కానీ వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి మాతృ భాషను పరిరక్షించుకోవాలి ఈ కర్తవ్యాన్ని గుర్తుచేసేందుకే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్నారు. అమ్మ భాషను రక్షించుకోవడానికి 1999లో 30వ యునెస్కో మహాసభ ఫిబ్రవరి 21వ తేదీన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించింది ఈ వనవడిలోనే ప్రతి ఏటా విజయవాడలో కృష్ణాజిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు మహాసభలు వైభవపేతంగా జరుగుతున్నాయి ఇలా ఏటేటా తెలుగు మహాసభలను నిర్వహించుకోవడం వెనక మాతృ భాషను రక్షించుకోవాలని పట్టుదల ప్రగాఢమైన ఆశ ఉండడం తెలుగువారు గర్వించదగిన విషయం కాలక్రమేనా ఇంగ్లీషు భాష పై మోజు పెరిగిపోవడం వల్ల తల్లి వంటి తెలుగు భాష తల్లడిల్లి పోతుంది తనయులమైన తెలుగు వారమంతా మన తల్లి భాష అయినా తెలుగును రక్షించుకోవలసిన ఆవశ్యకతను అందరము గుర్తించి ఆ దిశలో మనం ప్రయత్నించాలి తెలుగు భాష సాహిత్య సౌందర్యాన్ని అవగతం చేసుకోవాలి పరభాష మోజులో పడి మాతృభాష అయిన తెలుగును అవహేళన చేయకూడదు ముఖ్యంగా తల్లిదండ్రులు తమ బిడ్డలకు మమ్మీ డాడీ అని పిలుపులు నుంచి అమ్మ నాన్న అని పిలిపించుకొని తెలుగును ఇంటి నుండి ప్రోత్సహించాలి మధురమైన తెలుగు భాషను తేనెలూరు తెలుగు భాష సౌరభాన్ని అందరము కాపాడుకోవాలి ఇది మనందరి కర్తవ్యం గా భావించినప్పుడే తెలుగు భాష మనుగడ సాగిస్తుంది లేదంటే తెలుగు భాషను నిర్లక్ష్యం చేస్తే అందుకు తగిన ప్రతిఫలాన్ని మనందరం అనుభవించక తప్పదు."

### అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం వెనుక కారణం ఇదే..!

మాతృభాషను పరిరక్షించుకోవాలి అని భావంతో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఏటేటా నిర్వహిస్తున్నాము. అమ్మ భాషను రక్షించుకోవడానికి 1999లో 30వ యునెస్కో మహాసభ ఫిబ్రవరి 21వ తేదీన అంతర్జాతీయ మాతృభాష దినోత్సవంగా ప్రకటించింది. ఇలా ఏటా మాతృభాషా దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించడం వెనుక పెద్ద సంఘటన దాగి ఉంది. అదేమిటంటే.. మాతృభాషా దినోత్సవం జరుపుకోవడానికి ప్రధాన కారణం బంగ్లాదేశ్ దేశ విభజన తర్వాత బంగ్లాదేశ్ ను తూర్పు పాకిస్తాన్ గా పిలిచేవారు. వారి మాతృభాష బెంగాలీ కానీ వారి భాషకు తగిన గుర్తింపు లభించలేదు. అందుకే తమ భాషకు గుర్తింపు ఇవ్వాలని అక్కడి ప్రజలు ఉద్యమించారు. ఆ ఉద్యమం 1952 నుంచి 4 ఏళ్ల పాటు కొనసాగింది ఆ ఉద్యమాన్ని అణిచివేసేందుకు పాక్ ప్రభుత్వం మేధావులను, అధ్యాపకులను జైళ్లలో వేసింది. ఫిబ్రవరి 21న పోలీసులతో కాల్పులు జరిపించింది. మాతృభాష కోసం మొదలుపెట్టిన ఆ ఉద్యమంలో నెత్తురు ఏరులై పారింది. మాతృభాష పరిరక్షణ కోసం అనేకమంది యువకులు అసువులు బాసారు. చివరికి దిగివచ్చిన ప్రభుత్వం 1956లో బెంగాలీ ఉర్దూ భాషలను అధికార భాషలుగా ప్రకటించింది.

అయితే 1953 నుంచి బంగ్లాదేశ్ ప్రజలు ఫిబ్రవరి 21వ తేదీని మృత వీరుల దినోత్సవం గా జరుపుకుంటున్నారు. కనుక ఆ దేశ అభ్యర్థన మేరకు యునెస్కో వారు ఆ రోజునే మాతృభాషా దినోత్సవంగా జరిపేందుకు నిర్ణయించారు. ఈ ప్రతిపాదనకు భారత్ పాక్ లతో సహా 28 దేశాలు మద్దతు ఇచ్చాయి. ఆ సంఘటనను పురస్కరించుకొని యునెస్కో ఫిబ్రవరి 21వ తేదీని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించింది. 2000వ సంవత్సరము నుంచి ఇలా ప్రతి ఏటా మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రపంచంలోని చిన్న పెద్ద భాషలన్నింటినీ రక్షించుకోవాలని భాషా సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవవైవిద్యాన్ని కాపాడుకోగలమని యునెస్కో చెబుతుంది. బహు భాషల విధానాన్ని ప్రోత్సహించాలని, అది విశాల దృష్టిని, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తుందని యునెస్కో ప్రకటించింది. అయితే మాతృభాషను కాపాడుకుంటూనే దాని ద్వారానే తక్కిన భాషలన్నిటినీ నేర్చుకోవడం అనంత విజ్ఞానాన్ని పొందడం సరైన మార్గమని యూనిస్కో వెల్లడించింది.

**అమ్మ భాషను కాపాడుకుందాం!**
**ఆత్మాభిమానం పెంచుకుందాం!**

ఇక సాహితీ సమరాంగణ చక్రవర్తి అయిన శ్రీకృష్ణ దేవరాయల వారు తమ ఆముక్తమాల్యదలో "దేశభాషలందు తెలుగు లెస్స" అని ప్రకటించారు. తెలుగు భాషలోని మాధుర్యం గొప్పదనం ఏ ఇతర భాషల్లోనూ లేదని అనేకమంది కవులు గతంలోని నినదించారు. బ్రౌన్ నిఘంటు నిర్మాత అయిన సిపి బ్రోన్ తెలుగు భాషను ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని కొనియాడారు. అనేకమంది దేశ విదేశాలకు చెందిన భాషా పండితులు, విజ్ఞానవంతులు, భాషా పరిశోధకులు తెలుగు భాష గొప్పదనాన్ని వేనోళ్ళ కొనియాడినారు. అయితే నేటి సామాజిక పరిస్థితుల దృష్ట్యా ఇంగ్లీషు భాష నేర్వటం అన్నది అవసరమైనప్పటికీ, అది మోజు కాకూడదు. ఈ ఆంగ్ల భాషా వ్యామోహం లో బడి మన మాతృభాషను నిర్లక్ష్యం చేయకూడదు.అమ్మ భాషను అవహేళన చేయకూడదు. సుసంపన్నమైన తెలుగు భాషా సాహిత్య సౌందర్యాన్ని అవగతం చేసుకోవాలి. తెలుగు భాషను తెలుగు సంస్కృతిని కాపాడుకోవడం తెలుగు వాడిగా ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తించాలి. అంతేకాక మధురమైన లలితమైన సరళమైన తెలుగు భాషను భావితరాలకు అందించాలి. తెలుగు భాషా సౌందర్య సంపదను కాపాడటం మనందరి కర్తవ్యంగా భావించాలి. ఆంగ్ల భాషా వ్యామోహం విడనాడాలి. మనందరికీ తల్లి భాష అయిన తెలుగు భాషను పరిరక్షించుకోవాలి. ఈ దిశలోనే ఈ ప్రపంచ తెలుగు మహాసభలను మనం జరుపుకుందాం!

ఆత్మీయంగా అమ్మ భాషలోనే పలకరించుకుందాం! అమ్మ భాషను కాపాడుకుందాం! ఆత్మాభిమానం పెంచుకుందాం! తెలుగు భాషను పరిరక్షించుకుందాం! తెలుగువారి గొప్పదనాన్ని మరల ప్రపంచానికి చాటి చెబుదాం!






- చౌదూరి నరసింహారావు
సాహిత్య కళా విభూషణ
నంది పురస్కార గ్రహీత
సాహిత్య, సామాజిక విశ్లేషకులు
: 9705100788

---

విప్లవకారుల ఐక్యతే లక్ష్యంగా..

# రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీనం

సీపీఐ (ఎంఎల్ ) న్యూడెమోక్రసీ పార్టీ 2013 లో రెండు పార్టీలు గా విడిపోయింది. 2024 డిసెంబర్ 28 న హైదరాబాద్ లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో తమ మధ్య గల సిద్ధంత, రాజకీయ, నిర్మాణ విబేధాలు చర్చించు కుని విలీనం కావాలని నిర్ణయించాయి.

భారతదేశంలో కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యత ఒక జరూరు సమస్యగా చాలాచాలా కాలం నాటి నుండే ఎజెండాలో కొనసాగుతున్నది. దున్నేవానికే భూమి నినాదంగా ప్రారంభమైన సాయుధ పోరాటం నక్సల్బరి లో, శ్రీకాకుళంలో, లఖింపూర్‌ఖేరిలో భూస్వాముల గుండెల్లో రైళ్ళు పరుగెత్తించాయి. వందల, వేల ఎకరాల భూములను మట్టి కాళ్ళ మనుషులు ఎర్ర జెండాలు పాతి ఆక్రమించుకోగా, సదరు ఫ్యూడల్ భూస్వాములు,పెత్తందార్లు గంగవెర్రులెత్తి గ్రామాలనొదిలి పట్టణాలకు, నగరాలకు పారిపోయారు. బతికుంటే బలుసాకు తినైనా బతకొచ్చని ప్రాణాలు కాపాడుకున్నారు.

బాంచెన్ నీ కాల్మొక్కుతా ... దొరా... అన్న నాటి తెలంగాణ రైతాంగం వెట్టి బానిసత్వంపై తుపాకుల తో తిరగబడింది.క్రూర నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా 1946 నుండి 1952 వరకు సాగించిన ఆ మహత్తర రైతాంగ సాయుధ పోరాటం భారత ప్రజల విముక్తికి మార్గం చూపింది.

ఆ మార్గాన్ని ఆనాటి ఉమ్మడి భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) విస్మరించింది. ఎన్నికల ద్వారానే, అంటేపార్లమెంటరీ పంథా ద్వారానే భారత ప్రజల విముక్తిని సాధించవచ్చనే వాదనను తలకెత్తుకున్నది. సిపిఐ బాటనే ఆ తరువాత ఏర్పడిన సిపిఐ(ఎం) కూడా అనుసరించింది. దీనిని త్రోసిపుచ్చి చారూ మజుందార్, సత్యనారాయణ సింగ్, చంద్ర పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరిమెల నాగిరెడ్డి తదితర అగ్రశ్రేణి నాయకత్వం నక్సల్బరి నాయకుల తో విప్లవ సంస్థలను ఏర్పరచి ప్రజలను భూమి, భుక్తి, విముక్తి పోరాటాలలోకి ఉప్పెన లా కదిలించారు.

నక్సల్బరి, శ్రీకాకుళం, ముషహరి,గోపీవల్లభ్ పూర్, గోదావరి లోయ పరీవాహక ప్రాంతంలో, సిరిసిల్ల, జగిత్యాల లో ముందుకొచ్చిన వ్యవసాయక విప్లవ పోరాటాలు పీడిత ప్రజలకు అంతులేని ఉత్సాహాన్ని, ఊపునూ యిచ్చాయి . గణనీయమైన విజయాలు సాధించాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 1970 తరువాత గోదావరి లోయ పరీవాహక ప్రాంతంలో దాదాపు 10 లక్షల ఎకరాలకు పైగా అటవీ భూములపైకి భూమిలేని పేద ఆదివాసీలు, గిరిజనులను, బడుగు బలహీన వర్గాలను కదిలించి, వారికి దున్నుకునేందుకు భూములిప్పించిన గొప్ప చరిత్ర కూడా యీ పోరాటాలకే దక్కింది. ఈ పోడు, అటవీ భూములకు పట్టా హక్కులు కల్పించాలనే డిమాండ్ నేటికీ పరిపూర్తి కాలేదు.



భూమి పోరాటాల్లో లెక్కకు మించి వందలు, వేల కామ్రేడ్స్ బూటకపు ఎదురు కాల్పులలో నేలకొరిగారు. క్రూర భూస్వాములు, పెత్తందార్లు, గూండాలు ,పాలక పార్టీలా అండదండలతో వివిధ రకాల సిపిఐ(ఎంఎల్) పార్టీ నేతలను, కార్యకర్తలను, ప్రజలను హత్యలకు, దాడులకు గురిచేశారు.

ఎన్నో చిరస్మరణీయ విజయాలను సాధించిన యీ విప్లవోద్యమం గత మూడు, నాలుగు దశాబ్దాలుగా ఎన్నెన్నో చీలికలకు,పీలికలకు గురయ్యింది.ఉద్యమం బలహీనపడింది. ప్రజలకు , ముఖ్యంగా రెక్కాడితే గానీ డొక్కాడని కోట్లాదిమంది శ్రమజీవుల కష్టాలను, కడగళ్ళను తీర్చే పరిస్థితే లేకుండాపోయింది. బువ్వ పెట్టే భూమి, బతుకునిచ్చే చదువు అత్యధిక ప్రజానీకానికి అందని ద్రాక్షగా మారిపోతున్న దుస్థితి కార్పొరేటికరణ కాలం లో నానాటికీ మరింతగా పెరిగిపోతున్నది. ప్రపంచీకరణ విధానాల పేరిట, కాషాయీకరణ, మతోన్మాద విధానాల పేరిట పాలకులు ప్రజలను అనునిత్యం అధిక ధరలతో,పన్నులతో దోచుకుంటూ, కాల్చుకు తింటున్న నేపథ్యంలో విప్లవ సంస్థలన్నీ ఐక్యం కావలసిన ఆవశ్యకత అంతకంతకూ పెరుగుతూనే వున్నది. 2013 నుండి సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ పేరుతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ లలో రెండు పార్టీలుగా కొనసాగుతున్న వీటి నాయకత్వాలు భాద్యతగా గత ఎనిమిది నెలలుగా ఐక్యతా చర్చలు సాగిస్తూ వచ్చాయి. అంతకు ముందు జాతీయ స్థాయిలో జనశక్తి, క్లాస్ స్ట్రగుల్ తోపాటు రెండు న్యూడెమోక్రసీ పార్టీల మధ్య నాలుగైదేళ్లుగా ఐక్యతా ప్రయత్నాలు సాగినా ముందడుగు వేయలేక పోయాయి. ఈ స్థితి లో రెండు న్యూడెమోక్రసీ పార్టీలు తమ మధ్య గల సిద్ధాంత, రాజకీయ, నిర్మాణ సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించుకుని, ఒకే సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీగా ఐక్యం కావాలని నిర్ణయించుకున్నాయి. విప్లవ పార్టీల ఐక్యత కు ఇది ఎంతో సానుకులమైన పరిణామం.

ఆ క్రమంలో డిసెంబర్ 28, 2024న రాష్ట్ర రాజధాని నగరమైన హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉభయ పార్టీల విలీన సభ ను నిర్వహిస్తున్నాయి. ఈ విలీనం భవిష్యత్తులో మరిన్ని విప్లవ సంస్థల ఐక్యతకు స్ఫూర్తిని కలుగచేయాలని, తగు విధమైన ప్రేరణను అందించాలని లక్షలాది ఆదివాసులు, గిరిజనులు, అసంఖ్యాక పేదలు ఆకాంక్షిస్తున్నారు..విడిపోతే ఓడిపోతాం కలిసుంటే గెలిచి తీరుతామని అనే విధంగా గత 50 యేళ్ళ అనుభవం ఆధారంగా అమరుల స్వప్నాలను నిజం చేయడం కోసం సాగే యీ ఐక్యతా ప్రయత్నాలను ఆదరించాలని, మద్దతుగా నిలబడాలని కోరుకుంటున్నారు.

- కె.గోవర్ధన్,
రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు
సిపిఐ(ఎం-ఎల్)న్యూడెమోక్రసీ
తెలంగాణ రాష్ట్ర కమిటీ

# మన్మోహన్ మృతి దేశానికి తీరని లోటు

## మన్మోహన్ సింగ్ కు కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి

**విశ్వంభర, ఇనుగుర్తి:** ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అస్తమయం దేశానికి తీరని లోటని కాంగ్రెస్ జిల్లా నేతలు బైరు అశోక్ గౌడ్,చిన్నాల కట్టయ్య యాదవ్, పీఏసీఎస్, ఏఎంసీ డైరెక్టర్లు కొట్టం మహేందర్ రెడ్డి,కొట్టం రాము అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి శుక్రవారం పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పివి మంత్రివర్గంలో మంత్రిగా, పదేళ్ల ప్రధానిగా దేశ ఆర్థిక స్థితిని చక్కదిద్ది ప్రగతి పథంలో నడిపించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు గంజి రాజేందర్ రెడ్డి,గుజ్జునూరి బాబురావు,వల్లంల మురళి,గండు అజయ్,మహంకాళి రాము,మీటు నాయక్, కుంచాల రమేష్,వల్లపు రాములు,రామగిరి యాదగిరి,నాగేల్లి సుధీర్,గంజి తిరుపతిరెడ్డి, నద్దు నూరి ప్రశాంత్,ఉత్తెపు శ్రీను,పప్పుల అంజి తదితరులు పాల్గొన్నారు.

### మన్మోహన్ సింగ్ కు నివాళులు

**విశ్వంభర, సరూర్ నగర్:** దేశంలోనే ప్రప్రథమంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న నిరుపేదలు, కూలీల సమగ్ర అభివృద్ధి కోసం "మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం"ను ప్రవేశపెట్టి ప్రథమంగా తెలంగాణలోని పాలమూరు జిల్లా నుంచి ప్రారంభించిన మహెూన్నత వ్యక్తి భారతదేశ మాజీ ప్రధాని స్వర్గీయ మన్మోహన్ సింగ్ అని కాంగ్రెస్ నాయకులు వెల్లంకి ధనరాజ్ అని అన్నారు. స్వర్గీయ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శంకర్ యాదవ్, రంజిత్, మహేశ్వరం నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బేర బాలకిషన్, ఇమ్రాన్ అలీ, యూనస్, అరుణ, జంగారెడ్డి, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

### మన్మోహన్ సింగ్ కు కాంగ్రెస్ నాయకుల ఘన నివాళి

**విశ్వంభర, తంగళ్ళపల్లి:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ వద్ద మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల కాంగ్రెస్ నాయకులు విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ప్రధాని భారతరత్న నరసింహారావు హయాంలో అర్థికమంత్రిగా పనిచేసి న కాలంలో దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు అర్థిక వ్యవస్థకు బాటలు వేశారని ఒక ఉన్నతమైన వ్యక్తి ఆర్థికవేత్తగా సంస్కరణ పట్ల అంకితభావంతో ఎప్పటికీ గుర్తుండిపోయే సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని అభివృద్ధిలో ముందు ఉంచారని, దేశానికి రెండుసార్లు ప్రధానమంత్రిగా సేవలందించి గొప్ప ఆర్థికవేత్తగా పనిచేశారని, దేశం ఒక దిగ్గజనాయకుని కోల్పోయిందని, దేశానికి దేశ ప్రజలకు తీరనిలోటు అని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్, నేరెళ్ల నర్సింగ్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పొన్నాల పరుశురాం, ఆరేపల్లి బాలు, తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పూర్మాని రాంలింగారెడ్డి, తంగళ్ళపల్లి మండలం ఉపాధ్యక్షుడు గుగ్గిళ్ళ శ్రీకాంత్ గౌడ్, లక్ష్మీరాజ్యం, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు రాజు, బేరినేని రాము, జూపల్లి రాజేశ్వరరావు, పొన్నం లక్ష్మణ్, తంగళ్ళపల్లి మాజీ ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, చిన్నమనేని ప్రశాంత్, మాజీ బాలసాని శ్రీనివాస్, ధర్మ రెడ్డి, జూపల్లి రాజేశ్వరరావు, చందు వాసు, మల్లేశం, యాదవ్ రెడ్డి, పరశు రాములు, ఆసాని సత్య నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

### మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కి ఘన నివాళి

**విశ్వంభర, రామన్నపేట:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం నీర్నెముల గ్రామస్తులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

### తీవ్ర దిగ్భ్రాంతి

**విశ్వంభర, చారకొండ:** డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని నాగర్ కర్నూలు జిల్లా చారకొండ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గణేష్ గౌడ్ అన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడే దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని మండల పార్టీ అధ్యక్షుడు బలరాం గౌడ్ అన్నారు. ఒక ఆర్థిక వేత్తగా, ఒక అధ్యాపడిగా, రిజర్వు బ్యాంకు గవర్నర్ గా, రాజ్యసభ సభ్యుడిగా, ప్రతిపక్ష నాయకుడిగా, ప్రధానమంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని మాజీ ఎంపీటీసీ సభ్యులు నర్సింహా రెడ్డి అన్నారు. మన్మోహన్ సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గుండె శివ, సాయి, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు గోరేటి శివ, రామకృష్ణ, సత్తార్, బొడ్డు దశరతం, వెంకట్ రెడ్డి, కందికంటి శ్యామ్, వెంకటేష్ పాల్గొన్నారు.

### మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులు

**విశ్వంభర, పరిగి:** భారత మాజీ ప్రధానమంత్రి ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ మృతి కాంగ్రెస్ పార్టీకి, దేశానికి తీరనిలోటని డీసీసీ ప్రధాన కార్యదర్శి హనుమంతు అన్నారు. శుక్రవారం పరిగి పట్టణంలోని అమరవీరుల చౌరస్తా వద్ద డీసీసీ ప్రధాన కార్యదర్శి హనుమంతు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఆర్థికవేత్తగా సంస్కరణల సారథిగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ను దేశం మొత్తం గుర్తిస్తుందన్నారు. భారతదేశ ప్రధానమంత్రిగా పనిచేసిన కాలంలో అపారమైన జ్ఞానం సమగ్రతతో భారతదేశాన్ని అభివృద్ధి వైపు నడిపించారని తెలిపారు. ఆర్థికవేత్తగా నూతన సంస్కరణల పట్ల అంకితభావంతో ఉన్న నాయకుడిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు లాలు కృష్ణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కృష్ణ, ఉపాధ్యక్షులు ఎజాజ్, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ అయుబ్, డీసీసీ కార్యదర్శి కృష్ణారెడ్డి, రామచందర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు వెంకటరామిరెడ్డి, రామకృష్ణ, సత్యనారాయణ,



వెంకటేష్, సర్వర్, మల్లేష్, నజీర్, జగన్, రామకృష్ణారెడ్డి, నాగవర్ధన్, శ్రీకాంత్ రెడ్డి, రవి కాంత్ రెడ్డి, నవాజ్ పాల్గొన్నారు.

### మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించిన గంట సంజీవరెడ్డి

**విశ్వంభర, కేసముద్రం:** భారత మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి భారతదేశానికి తీరని లోటు అని కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంట సంజీవరెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. కేసముద్రం మార్కెట్ యార్డులో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దస్రు నాయక్,మాజీ జడ్పీటీసీ బండారు వెంకన్న,డీసీసీ ఉపాధ్యక్షుడు మహేందర్ రెడ్డి,బండారు దయాకర్,పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల మురళి, మార్కెట్ డైరెక్టర్స్ వోలం రమేష్,ఎండీ అయిబ్ ఖాన్,యాదగిరి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దమరకొండ ప్రవీవ్,యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లం గణేష్,మాజీ ఉప్ప సర్పంచ్ వెంకన్న,గ్రామ కమిటీ అధ్యక్షులు పోలేపల్లి వెంకట్ రెడ్డి,నూకల వెంకటేశ్వర్లు, ముజ్జు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### మాజీ ప్రధానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల స్థానిక రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు మన్మోహన్ సింగ్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని, అశ్రునయనాలతో తమ ప్రగాఢ సంతాపం తెలిపి, శ్రద్ధాంజలి ఘటించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జమీరుద్దీన్ మాట్లాడుతూ రెండు పర్యాయాలు ప్రధానమంత్రిగా చేసి భారత ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన ఆర్థికవేత్తను భారతదేశం కోల్పోవడం ఎంతో బాధాకరమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోదాస్ పృధ్వీరాజ్, వనం చంద్రశేఖర్, మహమ్మద్ నాసర్, జిల్లా వెంకటేశం, కొత్తపెల్లి అబ్రహం, కుమార్, ఎండి బషీర్ దౌల, పూస బాల నరసయ్య, పెద్దబోన వెంకటేశం, మహమ్మద్ అక్రం, మోటి రమేష్, కోట సుధాకర్, రాపోల్ రాజశేఖర్, గురుకు శివ, సంగిశెట్టి సుదర్శన్, మోటే మహేష్, మొహమ్మద్ రిజ్వాన్, మహమ్మద్ అజార్, రాజు, పెద్దలు కక్కిరేణి రవీందర్, మీర్జా ఖదీర్ బేగ్, మహమ్మద్ జానీ తదితరులు పాల్గొన్నారు.



### మన్మోహన్ సింగ్ కి ఘన నివాళులు

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలం, అరూరు గ్రామంలో శుక్రవారం మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ మరణం పట్ల విచారం వ్యక్త చేసి, వారి చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. యాదాద్రి జిల్లా కిసాన్ సెల్ నాయకులు బండారు నరసింహారెడ్డి, మత్స్యగిరిగుట్ట ధర్మకర్త బండి రవికుమార్, డైరెక్టర్ ఆవుల స్వామి, మండల ఓబిసి సెల్ అధ్యక్షులు చిలకమర్రి కనకాచారి లు మాట్లాడుతూ దేశం గొప్ప మేధావిని, రాజనీతిజ్ఞుడిని కోల్పోయిందని, ఇది దేశానికి చాలా బాధాకరమని, 10 సంవత్సరాలు భారతదేశ ప్రధానమంత్రిగా ఎలాంటి మచ్చలేకుండా పరిపాలించిన మహానేత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోలెపాక చంద్రయ్య, మాజీ సర్పంచ్ పోలేపాక చెమ్మయ్య, వేములకొండ మాజీ సర్పంచ్ ఎలగందుల కృష్ణమూర్తి, సుంకి ఆనంద్, ఆవుల అంజయ్య, ఎర్ర వెంకయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు పిట్టల సుధాకర్, బత్తిని వెంకటేశం, వెలిమినేటి సంతోష్, మీసాల మత్స్యగిరి, పోలేపాక నరసింహ, కొయిగురి మధు, నల్ల రామచంద్రం, బోగారం ఎల్లయ్య, సుంకిశాల వెంకటేశం పాల్గొన్నారు.

### శుభోదయం స్కూల్లో మన్మోహన్ సింగ్ కు సంతాపం

**విశ్వంభర, తంగళ్ళపల్లి:** రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండల కేంద్రంలో శ్రీ సరస్వతి శుభోదయ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో భారతమాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చనిపోయిన సందర్భంగా స్కూలు విద్యార్థులు యజమాన్యం ఉపాధ్యాయులు కలిసి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతదేశానికి 10 సంవత్సరాలు ప్రధానమంత్రి పని చేయడం జరిగిందని అనేక ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చి భారతదేశం ఆర్థిక అభివృద్ధిలో ముందు ఉంచారని అలాగే 2005లో చట్టాలలో ముఖ్యమైన సమాచార హక్కు చట్టం తీసుకువచ్చి ప్రతి ఒక్కరికి జవాబు దారి ఇవ్వడంలో చాలా ప్రముఖ పాత్ర పోషించారని, ప్రతి పేదవారికి గ్రామంలోని పని కల్పించడానికి మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టం, తీసుకువచ్చి 100 రోజుల పని కల్పించడం జరిగిందని పేదవారి కడుపు నింపిన మహనీయుడని, ఇప్పటికీ ఈ ప్రభుత్వాలు ఆ చట్టాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎం శ్రీనివాస్ యాదవ్, ప్రిన్సిపాల్ మాధవి లతా రెడ్డి, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.










## కార్మికుడి కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం

- అంత్యక్రియలకు తక్షణ సాయం
- కుటుంబానికి అండగా నిలిచిన కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి



**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజకవర్గం జిన్నారం మండలం బొల్లారం పారిశ్రామిక వాడలో నివసించే కడారు కిషన్ (38) ఎక్సల్ రబ్బర్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేసేవాడు. పరిశ్రమ పనుల నిమిత్తం బయటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ వి.చంద్రారెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జైపాల్ రెడ్డి, పరిశ్రమ యజమాని రఘునాథ్ రెడ్డి తో చర్చించి కడారు కిషన్కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పరిశ్రమ నుంచి మృతుడి కుటుంబానికి 25 లక్షల నష్టపరిహారం అందించేందుకు యజమాన్యం అంగీకరించింది. అదేవిధంగా అంత్యక్రియల నిమిత్తం తక్షణసాయం అందజేస్తామన్నారు. కష్టకాలంలో కార్మికుడి కుటుంబానికి అండగా నిలిచిన నాయకులకు, పరిశ్రమ యజమాన్యానికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోప్షన్ మెంబర్ మునీర్, స్థానిక నాయకులు భాస్కర్ రెడ్డి, చంద్రారెడ్డి, శంకర్, శ్రీనివాస్, యువజన నాయకులు బషీర్, అంజి, ఆంజనేయులు, బాధిత కుటుంబ సభ్యులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అమిత్ షా వెంటనే క్షమాపణ చెప్పాలి

**సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్**

**విశ్వంభర, హైదరాబాద్:** భారత పార్లమెంటులో 75 వ రాజ్యాంగ దినం సందర్భంగా జరిగిన చర్చలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆద్వర్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు, అన్ని జిల్లాలలో నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చిన సందర్భంగా గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్ లో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ భారత పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హెూం మంత్రి అమిత్ షా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ను అవమానించాడని, అమిత్ షా వెంటనే దేశ ప్రజలకు భారత పార్లమెంటుకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో ఉద్యమం ఉధృతం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర



కార్యదర్శి రమేష్, రాష్ట్ర నాయకులు సోమన్న, నగర అధ్యక్షులు కుమారస్వామి, నగర నాయకులు సీ.మల్లేష్, డిఎల్ మోహన్, జి.రాములు, ఎం. సత్యనారాయణ, మహేందర్, మల్లయ్య, జగదీశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

## ఇనుగుర్తిలో గ్రామపంచాయితీ సిబ్బంది టోకెన్ సమ్మె

**విశ్వంభర, ఇనుగుర్తి:** గ్రామపంచాయితీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ..తెలంగాణ గ్రామపంచాయితీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ పిలుపు మేరకు ఇనుగుర్తి పెద్ద బస్టాండ్ వద్ద జీపీ సిబ్బంది శుక్రవారం టోకెన్ సమ్మె చేపట్టారు.ఇనుగుర్తి పట్టణ సిబ్బందితో పాటు వివిధ గ్రామాల కార్మికుల రెండు రోజుల ఆందోళన కు సీఐటీయూ,ఎఐటీయూ,టీయూసీఐ, ఐఎఫ్ టీయూ సంఘాల నాయకులు జల్ల జయరాజ్ ఎస్కే అమీర్ సోమరపు ఎల్లయ్య తదితరులు మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయితీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. ప్రత్యేక బడ్జెట్ కేటాయించి సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరారు. సిబ్బంది నాయకులు బోళ్ల మాట్లాడుతూ ఇనుగుర్తి తో పాటు ఆయా గ్రామాల ప్రజలు తమకు సహకరించాలని కోరారు. సమ్మెలో బోళ్ళ రాములు, గోపందాస్,




ఎల్లయ్య, బూరయ్యాక లక్ష్మి, బిక్షం, ఎల్లమ్మ, గుజ్జునూరి యాకమ్మ, యాకయ్య, ఉపేంద్ర,ప్రసాద్, ఎల్లయ్య,తమ్మడపల్లి సుగుణ,ఎర్రం పార్వతమ్మ, ఇసంపెల్లి సోమక్క,మంగళపల్లి ఇద్దమ్మ,బూర ఎల్లమ్మ,లింగాడపు దర్గయ్య,పి బిక్షం, వసంతరావు, రాము తండా జరుపుల చంద్రు, అయ్యగారి పల్లి తమ్మడపల్లి నాగయ్య గుజ్జునూరి ఎల్లమ్మ చీన్య తండా గుగులోతు రాము ఉన్నారు.

## ఎల్ ఓ సి అందజేసిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆర్కే పురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ ఫేజ్ -3 కి చెందిన సంతోషి ఎముకల సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులతో డివిజన్ నాయకులను సంప్రదించగా వారు మహేశ్వరం శాసనసభ్యులు సబితాఇంద్రారెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 1,25,000 ఎల్ ఓ సీ లెటర్ ను సంబంధిత లబ్ధిదారుకు మీర్ పెట్ లోని క్యాంపు కార్యాలయంలో అందచేశారు. సబితా ఇంద్రా రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్, నాయకులు వెంకటేష్, వలిగొండ దీపు, శ్రీకాంత్,నవీన్, పాండు పాల్గొన్నారు.

## జాతర ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే జీఎంఆర్



**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు మండలం పోచారం గ్రామ పరిధిలో గల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర మహెూత్సవ ఆహ్వాన పత్రికను శుక్రవారం పటాన్ చేరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. జనవరి 6, 7 తేదీలలో జాతర సందర్భంగా వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని నిర్ణయం జీఎంఆర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, పోచారం మాజీ సర్పంచ్ జగన్, మాజీ ఎంపీటీసీ బిక్షపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మహా ధర్నాను జయప్రదం చేయండి

సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ పట్టణలో సీపీఎం పార్టీ పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం కోసం ఎన్నో ఉచిత హామీలు ఇచ్చి వాటి పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, గ్యారెంటీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని హామీలను పరిమితుల మేరకే అమలు చేసిందని, అవి కూడా అందరికీ అందే పరిస్థితిలో లేవని రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా అధికారంలో ఉండి రాష్టాలకు రావలసిన నిధులను పక్కదారి మళ్లించి నిరుద్యోగ యువతను ఉద్యోగాలు ఇవ్వకుండా మతోన్మాద రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్యపెడుతుందని ఆర్థిక పరిస్థితులతో దేశం వెనుకబడిపోయిందని అన్నారు. దేశంలో కొత్త డ్రామా జమిలి ఎన్నికలు అనే నేపథ్యంతో రాష్ట్రాల హక్కులను హరించే బిల్లులను పార్లమెంట్లో తీసుకొచ్చి క్రూరత్వం కనబరుస్తుందని, ఇలాంటి స్వార్థ రాజకీయ పాలన వల్ల దేశానికి నష్టం వాటిల్లుతుందని చెప్పారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 500వందల కోట్ల రూపాయలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో ఉన్న సమస్యలు, ప్రజా సమస్యల మీద సీపీఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే కార్యక్రమం ఈనెల 8 నుంచి 20 వరకు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను గుర్తించిందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న పట్టణంలోని మున్సిపాలిటీ ఆఫీసు ముందు మహాధర్న కార్యక్రమం ఉంటుందని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమాఇకి ప్రజలు భారీ ఎత్తున హాజరై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వలు ప్రజల సమస్యలు పరిష్కరించే దిశగా సీపీఎం పార్టీ ఎర్ర జండా ఎప్పుడు ముందుటుందని, ప్రభుత్వం మెడలు వంచి ప్రజల సమస్యలు అయ్యంత వరకు పోరాటం చేస్తుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా శాఖ కార్యదర్శి లు అన్వేష్, ఉమారాణి అనూష, గోపీచంద్, శ్రావణి, తేజవత్ నీలా, బేబీ, కాలనీ ప్రజలు భారీగా పాల్గున్నారు.

## రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయండి



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో మాతృదేవోభవ పితృదేవోభవ సంస్థ ఆధ్వర్యంలో గురు హాస్పిటల్ సహాకారంతో 30 డిసెంబర్ 2024 సోమవారం ఉదయం 10 గంటలకు రామన్నపేట మండల కేంద్రంలోని గురు హాస్పటిల్ ముందు జరగబోయే రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని రామన్నపేట మండల కేంద్రంలో రక్త దాన శిబిరం వాల్ పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా గురు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కళ్లెం సైదులు పాల్గొని మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటి 50 కిలోల బరువు ఉన్న ప్రతీ ఒక్కరూ రక్తదానం చేయవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో మాతృదేవోభవ పితృదేవోభవ వ్యవస్థాపకుడు కురుమేటి నవీన్, నోముల యాదగిరి, వేముల సైదులు, అక్కెనపల్లి సైదులు, మేడి యాదయ్య, మేడి రాజు, కళ్లెం వినయ్, అప్పం సురేందర్, సాపిడి రాంప్రసాద్ పాల్గొన్నారు.

# క్లినికల్ డేటా సైన్స్ పై ముజీబుద్దీన్ చర్చాగోష్ఠి

– పెప్టైడ్, న్యూక్లియోటైడ్ లలో అపార అవకాశాలు

– ఆతిథ్య ఉపన్యాసంలో డాక్టర్ నవీన్



**విశ్వంభర, సంగారెడ్డి:** పెప్టైడ్ లు, న్యూక్లియోటైడ్ లలో అపార వాణిజ్య, పరిశోధన అవకాశాలు ఉన్నాయని, ఔషధ పరిశ్రమలో వాటికి ప్రాధాన్యం పెరుగుతోందని డాక్టర్ కె. నవీన్ కుమార్, సీనియర్ టెక్నికల్ సేల్స్ మేనేజర్, రికీ గ్లోబల్ ట్రేడింగ్ జోస్యం చెప్పారు. గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీలో 'వర్తమాన ఫార్మాస్యూటికల్ ఆవిష్కరణలు: పెప్టైడ్స్, బయోసిమిలర్స్' అనే అంశంపై ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు.వచ్చే ఏడాది నాటికి ఆ పరిశ్రమ వంద బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని, వృద్ధి రేటు 10 నుంచి 12 శాతం ఉంటుందని ఆ రంగ నిపుణుడు డాక్టర్ నవీన్ అంచనా వేశారు. మనదేశంలో పెప్టైడ్ మార్కెట్ 2024 నుంచి 2030 వరకు వార్షిక వృద్ధి రేటు 13.9 శాతం ఉంటుందన్నారు. అదే విధంగా ప్రపంచ పెప్టైడ్ థెరప్యూటిక్స్ మార్కెట్ విలువ 2033 నాటికి 5.9 శాతం వృద్ధి రేటుతో 76.11 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని జోస్యం చెప్పారు. పెప్టైడ్ చికిత్సా సామర్థ్యాలను వివరిస్తూ, ల్యాబ్-ఉత్పత్తి చేసిన మానవ ఇన్సులిన్, గ్రోత్ హార్మోన్ తో సహా వివిధ వ్యాధుల చికిత్సలో వాటి కీలక పాత్రను డాక్టర్ నవీన్ ప్రముఖంగా ప్రస్తావించారు.

### క్లినికల్ డేటా సైన్స్ భవిష్యత్తు..

ఉద్భవిస్తున్న ధోరణులు, అవకాశాలు' అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో క్లినోసోల్ రీసెర్చ్ వ్యవస్థాపకుడు, ముఖ్య కార్యనిర్వహణాధికారి సీ.ఎస్.ముజీబుద్దీన్ ప్రధాన వక్తగా పాల్గొన్నారు. ఔషధ పరిశ్రమలో జరుగుతున్న అభివృద్ధి, పరిశోధన-అభివృద్ధి, క్లినికల్ ట్రయల్స్, ఔషధ అభివృద్ధి, ఫార్మాకోవిజిలెన్స్, తయారీ, నియంత్రణ వంటి పలు రంగాలలో ఎన్నో ఉపాధి అవకాశాలు వస్తున్నాయని చెప్పారు. వాటిని అందిపుచ్చుకోవడానికి ఇప్పటినుంచే సన్నద్ధం కావాలని, ఆయా రంగాలకు తగిన నైపుణ్యాలను అలవరచుకోవాలన్నారు. రెజ్యూమ్ తయారీ, స్మార్ట్ హైరింగ్ పద్ధతులు, నెట్ వర్కింగ్ ప్రాముఖ్యతలను ఆయన వివరించారు. అంతేగాక, ఆధునిక ఇంటర్వ్యూ పద్ధతులు, యజమాని అంచనాలను ప్రస్తావించారు. పోటీ ఉద్యోగ మార్కెట్లో అభివృద్ధి చెందడానికి విద్యార్థులకు ఆచరణాత్మక వ్యూహాలను అందించారు. క్లినికల్ డేటా సైన్స్, డేటా ఆధారిత ఆరోగ్య సంరక్షణ వంటివి వేగంగా వృద్ధి చెందుతున్న రంగాలుగా ముజీబుద్దీన్ పేర్కొన్నారు. విడివిడిగా జరిగిన ఈ కార్యక్రమాల అతిథులిద్దరినీ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. శివకుమార్ స్వాగతించి, సత్కరించగా, డాక్టర్ శ్రీకాంత్ గటాడి వందన సమర్పణతో ముగిశాయి. కెరీర్ గైడెన్స్ సెంటర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రమాకాంత్ బాల్ కూడా ఇందులో పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కు ఘన నివాళులు





**విశ్వంభర, తలకొండపల్లి:** మన్మోహన్ సింగ్ పేదల ప్రజల కోసం వందరోజుల పని దినాల లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని వారి మరణం దేశానికి తీరని లోటని తలకొండపల్లి కాంగ్రెస్ నేతలు అన్నారు. మండలంలోని వెల్జాల్ గ్రామంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కాంగ్రెస్ నాయకులు వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అమన్ గల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి డీసీసీ ఉపాధ్యక్షుడు ఏ భగవాన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంబాజీ, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, ఎండి ఆరిఫ్, ఏ వెంకటరెడ్డి, బి నర్సింలు, టి.కృష్ణయ్య గౌడ్, టి. భాస్కర్ రెడ్డి, సి.వెంకటరమణారెడ్డి, ఎండి యూసుఫ్, వి. రాజు చింతకాయల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

**విశ్వంభర, కల్వకుర్తి:** మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం పట్ల కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఆయన రాజకీయం, ఆర్థిక రంగాలలో దేశానికి చేసిన అమూల్యమైన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో స్థానిక నాయకులతో కలిసి ఆయన చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజవర్గం రామకృష్ణా పురం చౌరస్తాలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత ఆద్వర్యంలో మాజీ ప్రధాని, ఆర్థికవేత్త, డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, బండి మధుసూదన్ రావ్, సురేష్ కుమార్, గట్ల రవీంద్ర, రమేష్, శివ, దుర్గాప్రసాద్,పగిల్ల భూపాల్ రెడ్డి, జెల్ల జగన్నాథం, జిన్నమ్ వేంకటేశ్వర్లు, కృష్ణా రెడ్డి, యాదవ రెడ్డి, మహేందర్, కల్యాణ్, లింగస్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**విశ్వంభర, రామన్నపేట:** లౌకికవాదం, ప్రజాస్వామ్యం మరియు భారతదేశం యొక్క భిన్నత్వంలో ఏకత్వం పట్ల బలమైన నిబద్ధత కలిగిన నాయకుడు మన్మోహన్ సింగ్ అని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి కొనియాడారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ 1998 నుంచి 2004 వరకు రాజ్యసభలో ప్రతిపక్ష నాయకునిగా, 1991 నుంచి 1996 వరకు కేంద్ర ఆర్థిక మంత్రిగా పని చేశారని అన్నారు. 1985 నుంచి 1987 వరకు ప్లానింగ్ కమిషన్ డిప్యూటీ ఛైర్మన్ గా, భారత రిజర్వు బ్యాంకు గవర్నర్ గా 1982%-%1985 మధ్య పని చేశారని తెలిపారు. భారత దేశం తరపున అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో ఒకరుగా ఉన్నారని తెలిపారు. రాజకీయ అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా జనతా పార్టీ, కాంగ్రెస్, జనతా దళ్ ప్రభుత్వాల్లో ఆర్థిక శాఖలో అనేక హోదాల్లో పని చేశారు. కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయం నుంచి అర్థ శాస్త్రంలో డాక్టరేట్ పొందారు. మన దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశ పెట్టిన ఆర్థిక మంత్రిగా పేరొందిన మన్మోహన్ సింగ్ అదే విధానాల వల్ల పేద, ధనిక తారతమ్యాలు పెరిగాయనే విమర్శను సైతం ఎదుర్కొన్నారు. 2004 నుండి 2009 మధ్యలో లెఫ్ట్ మరియు లౌకికవాద పార్టీల మద్దతుతో యూపిఏ-1 పేరిట, ఆ తరువాత ఇంకో అయిదు సంవత్సరాలు యుపిఏ-2 ప్రభుత్వాలను కాంగ్రెస్ పార్టీ నాయకుడుగా నడిపారు. యూపిఏ-1 ప్రభుత్వ హయాంలో అనేక పురోగామి చట్టాలను తీసుకు వచ్చారని. 2005 లో గృహహింస నుండి మహిళల రక్షణ చట్టం, సమాచార హక్కు చట్టం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం, 2006 లో షెడ్యూల్డ్ తెగలు మరియు ఇతర సాంప్రదాయ అటవీ నివాసులు (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం, 2007 లో తల్లిదండ్రులు మరియు సీనియర్ సిటిజన్ల నిర్వహణ మరియు సంక్షేమ చట్టం, 2008లో అసంఘటిత కార్మికుల సామాజిక భద్రతా చట్టం, 2009 లో పిల్లల ఉచిత మరియు నిర్బంధ విద్య హక్కు చట్టం లాంటివి తీసుకొచ్చారని పేర్కన్నారు. మహిళలకు, పేద పిల్లలకు, వయో వృద్ధులకు, గిరిజనులకు, గ్రామీణ పేదల రక్షణకు, వారి అభివృద్ధి కోసం తెచ్చిన చట్టాలు నిర్వీర్యం కాకుండా వాటి అమలు కోసం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అవుతుందని ఐలు భావిస్తున్నదన్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం ప్రకటిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా ఉపాధ్యక్షులు కుక్క దువ్వ సోమయ్య, పాల్వంచ జగతయ్య, తడక మోహన్, సహాయ కార్యదర్శిలు బొల్లెపల్లి కుమార్, శ్రీసా శ్రీనివాస్, చింతల రాజశేఖర్ రెడ్డి, బోడ్డు కిషన్, ఎండి నిహాల్, తదితరులు పాల్గొన్నారు.



**విశ్వంభర, మహబూబాబాద్:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాపం తెలియజేస్తూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఎమ్మెల్యే రెండు నిమిషాలు మౌనం పాటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలుపుతూ వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహబూబాబాద్ టౌన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ నాయకురాలు, 26.వ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బండి వెంకన్న, టౌన్ ఉపాఅధ్యక్షులు బట్టు దేవ్ సింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భూక్య శ్రీను, భూక్యా సురేష్ నాయక్, జిల్లా జాయింట్ సెక్రెటరీ సూరనేని రాము, దండెం వెంకన్న, బానోతు రెడ్డి, మహిళ నాయకురాలు పొన్న బోయిన మాధవి, ఇంకా నాయక్లు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రముఖ ఆర్థిక వేత్త, మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణం పట్ల చాంద్రాయణగుట్ట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బోయ నగేష్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్ సింగ్ మరణంతో దేశం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని అన్నారు. వారు ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడే దేశంలో ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టారని అన్నారు. మన రాష్ట్ర ఆవిర్భావానికి కృషిచేసిన మహానుభావుడు ఆయన అని పేర్కొన్నారు. దేశానికి సేవ చేయడానికి తన జీవితాన్ని అంకితం చేసిన నాయకులు అని అన్నారు. తను భారతదేశ ఆర్థిక అభివృద్ధికి చేసిన అమూల్యమైన కృషితో ఎల్లప్పుడూ గుర్తుండిపోతారు అన్నారు. మన్మోహన్ సింగ్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని కాంగ్రెస్ పార్టీ పాత బస్తీ నాయకులు కార్యకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమములో పలువురు పార్టీ ముఖ్య నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆర్థిక మంత్రిగా పనిచేసిన మన్మోహన్ సింగ్ దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేయడంలో జీడీపీ వృద్ధి చెందడంలో కీలక పాత్ర పోషించారని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. యూపీఏ ప్రభుత్వంలో ఆర్టీఐ, ఉపాధి హామీ పథకం వంటి పథకాలను ప్రవేశపెట్టడం లో ఆయన పాత్ర చాలా కీలకమైనది అని అన్నారు. దాదాపు దశాబ్ద కాలం పాటు దేశ ప్రధానిగా సుదీర్ఘ సేవలు అందించి తనదైన ముద్రవేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. సకల జనుల సమ్మె, విద్యార్థుల అసహజ మరణాల గురించి వివరంగా అడిగి తెలుసుకుని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో పూర్తి సహకారం అందించారని అన్నారు.







## పార్టీ కోసం పనిచేస్తున్న వారిపై విమర్శలు సరికాదు



**విశ్వంభర, ఆమనగల్లు:** కాంగ్రెస్ పార్టీ కోసం గత 20 సంవత్సరాలుగా పార్టీ అధికారంలో లేకున్నా కాంగ్రెస్ జెండాను భుజాన మోసుకొని కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి తన వంతు కృషిచేసిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ ముదిరాజ్ పార్టీ కోసం కష్టపడుతున్నారని, అలాంటివారికి పార్టీ పదవులు అప్పజెప్పిందని వారిని విమర్శిస్తే కాంగ్రెస్ పార్టీ అపేక్షించదని పార్టీ నియమాలకు కట్టుబడి అందరూ ఉండాలని యువజన కాంగ్రెస్ నాయకులు శ్రీకాంత్ విలేకరుల సమావేశంలో సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విజయ్ రాథోడ్, రఫీ శేఖర్ సురేష్, నాజర్, గౌస్ జగదీష్, వినయ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ హాస్టళ్లను తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**విశ్వంభర, మహబూబ్ నగర్:** మహబూబ్ నగర్ పట్టణం, పద్మావతి కాలనీ లోని ప్రభుత్వ ఎస్సీ డీడీ హాస్టల్, ఆనంద నిలయం హాస్టళ్లను మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాలను ఆయన పరిశీలించారు. వార్డెన్లు శివ కుమార్, తిరుపతయ్య లను హాస్టల్ లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్స్ ప్రాంగణంలో కావాల్సిన అన్ని రకాల మౌలిక వసతుల కల్పన చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం హాస్టల్ విద్యార్థుల తో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, బుద్దారం సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సాయం



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల కేంద్రంలో రాయి కంటి సాలమ్మ అనారోగ్యంతో మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జయపాల్ యాదవ్ తో కలిసి సాలమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం సాలమ్మ మృతదేహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. తదుపరి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా 5,000 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని జైపాల్ యాదవ్ ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ జోగు వీరయ్య నాయకులు మంగళపల్లి నరసింహ, లాయక్ ఆలీ, పాండు, సురేష్, బిక్షపతి, రాజు, శ్రీకాంత్, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

## దోకూరి ప్రభాకర్ రెడ్డిని పరామర్శించిన కడమోని శ్రీశైలం



**విశ్వంభర, కలకొండపల్లి:** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డోకురి ప్రభాకర్ రెడ్డి తండ్రి డోకూరి నరేందర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న దేవుని పడకల్ మాజీ సర్పంచ్ కడమోని శ్రీశైలం తన అనచరుల తో కలసి పార్థిక దేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమం లో దేవునిపడకల్ మాజీ సర్పంచ్ కడమోని శ్రీశైలం, తుమ్మల రామస్వామి, రాజమోని శంకర్, పద్మ పాండు, అంబటి శ్రీను, అంబటి బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనం రూ.26,000 చెల్లించాలి

– సీపీఎం కార్యదర్శి సైదులు




**విశ్వంభర,నెల్లికుదురు:** గ్రామపంచాయితీ కార్మికులకు కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి ఇసంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ జేఏసీ ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో ఆఫీస్ వద్ద శుక్రవారం చేపట్టిన గ్రామపంచాయితీ సిబ్బంది టోకెన్ సమ్మెలో సైదులు పాల్గొని మాట్లాడారు.పెండింగ్ వేతనాలు చెల్లించాలని. సిబ్బందిని పర్మినెంట్ చేసి,పది లక్షల ప్రమాద బీమా కల్పించాలన్నారు.అంతకుమునుపు జీపీ కార్మికులు వంటావార్పు చేసి సామూహిక భోజనం చేశారు. కార్యక్రమంలో కార్మికులు బొల్లం ఎల్లయ్య వెంకన్న, చాందు పాషా, విజయ, రాధ, హెచ్చు వెంకన్న హెచ్చు విజయ, మురళి, ఉప్పలయ్య చంద్రయ్య వెంకన్న మల్లయ్య బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన సింగల్ విండో డైరెక్టర్



**విశ్వంభర, వెల్దండ:** వెల్దండ మండలానికి చెందిన పుట్ట బాలస్వామి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్ మృతుని కుటుంబాన్ని పరామర్శించి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొయ్యల పుల్లయ్య, తిరుపతి రెడ్డి, ఎండి రషీద్, గుద్దటి కిష్టాలు, కాషారపు వెంకటయ్య, మల్లయ్య, పుట్ట యాదయ్య, నాగార్జున, మల్లేష్, భయ్యా సాయి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీని పరామర్శించిన ఎమ్మెల్యే



**విశ్వంభర, హైదరాబాద్:** అనారోగ్య సమస్యలతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎంపీ మందా జగన్నాథం ను ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి పరామర్శించారు. అనంతరం ఆయన ఆయురారోగ్యాలతో ఆసుపత్రి నుండి డిశ్చార్జి కావాలని ఆశించారు.

# సర్వే ద్వారా సమగ్ర సమాచారం సేకరించండి

**నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి**

**విశ్వంభర, వరంగల్:** వరంగల్ జిల్లా 29 వ డివిజన్ లో ఇందిరమ్మ ఇడ్ల సర్వే నిర్వాహణ తీరు సర్వే ద్వారా సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి లబ్దిదారులు ప్రజాపాలన లో దరఖాస్తు చేసుకున్న నేపథ్యం లో క్షేత్ర స్థాయి లో సంబంధిత సమాచారాన్ని సేకరించి ఆప్ ద్వారా నమోదు కోసం 29 వ డివిజన్ గాంధీ బొమ్మ ప్రాంతం లో కొనసాగుతున్న సర్వే తీరును మేయర్ శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బల్దియా పరిధిలో 66 డివిజన్ ల వ్యాప్తంగా కాశీబుగ్గ, ఖాజీపేట సర్కిళ్ల పరిధిలలో సర్వే నిర్వహించి లబ్ధిదారుల ఎంపిక కోసం సూచించిన ధృవ పత్రాలను సమగ్ర పరిశీలన చేసి సంబంధిత సమాచారాన్ని ఆప్ ద్వారా ఎలాంటి పొరపాట్ల కు తావు లేకుండా ఆయా డివిజన్ ల వార్డు ఆఫీసర్లు ఆర్ పి లు నమోదు చేస్తారని, ఇందుకోసం వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించి వాస్తవ సమాచారం అందజేయాలని మేయర్ కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, టీఎంసీ రమేష్, ఆర్ ఐ విజయ్, సీఓ రజిత, ఆర్ పీ లు షర్మిల, సునీత లక్ష్మి, అరుణ మంజుల తో పాటు స్థానిక నాయకులు ఓరుగంటి పూర్ణ రుద్ర శ్రీను, రఫిక్, బొమ్మ సురేష్ ,సౌరం బాలకృష్ణ, చంద్రగిరి రమేష్, కొలిపాక పద్మ, మాధవి, రమ తదితరులు పాల్గొన్నారు.



## 29న మున్నూరు కాపు వధూవరుల పరిచయ కార్యక్రమం



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ ఆధ్వర్యంలో ఈ నెల 29 వ తేదీన మున్నూరు కాపు వధూవరుల పరిచయ వేదిక కాచిగూడలోని తెలంగాణ మున్నూరు కాపు సంఘం లో నిర్వహించనున్నట్లు మున్నూరు కాపు మహాసభ ప్రెసిడెంట్ మణికొండ వెంకటేశ్వర్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో యువతీ, యువకుల కు పరిచయ వేదిక ఒక గొప్ప అవకాశమని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని మున్నూరుకాపు మహాసభ నిర్వహకులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్నూరు కాపు కమ్యూనిటీలో ఉన్న వారు వధూవరుల పరిచయ వేదిక ద్వారా ఒక్కటి చేసి సంఘ బాధ్యతను నిర్వహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో రమేష్, జితేందర్, హనుమంత రావు, వినోద్, సురేష్ బాబు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## వేణుమాధవ్ యాదిలో...

**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభ లో గాన సభ నిర్వహణ లో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమం లో విఖ్యాత మిమిక్రీ కళాకారుడు డాక్టర్ నేరేళ్ళ వేణుమాధవ్ యాది లో సంస్మరణ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా బెవరెజెస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మెన్ దేవీ ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ గడ్డ పై పుట్టిన ఎందరో ప్రతిభావంతులు లో నేరేళ్ల వేణుమాధవ్ ప్రముఖులు అన్నారు. ఐక్య రాజ్య సమితి లో మిమిక్రీ కళను ప్రదర్శించి దేశ ఖ్యాతిని నిలిపిన వేణు మాధవ్ నాటి ప్రముఖులు నెహ్రూ, రాధా కృష్ణన్, ఇందిరా గాంధీ వంటి వారి సమక్షం లో తన ప్రతిభను ప్రదర్శించి అభినందన అందుకున్నారు అని గుర్తు చేశారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో మిమిక్రీ కళాకారుడు సినీ దర్శక నిర్మాత మల్లం రమేష్ మాట్లాడుతూ తెలుగు విశ్వవిద్యాలయం లో మిమిక్రీ కళను శాస్త్ర బద్ధం చేసి కోర్సు ను ఏర్పాటు చేయటం లో కీలక పాత్ర వేణు మాధవ్ పోషించారు అని అన్నాడు. కార్యక్రమం లో మిమిక్రీ కళా కారులు అర్ సి ఎం రాజు, భవిరి శివ, శివ ప్రసాద్, షరీఫ్, అంజన్ కుమార్ , మహిళా మిమిక్రీ కళాకరిణి ఉదయ శ్రీ తదితరులు మాట్లాడుతూ వేణు మాధవ్ ఎందరికో శిక్షణ ఇచ్చి కళాకారులుగా తయారు చేశారు అని గుర్తు చేశారు.

## వీడిన మర్డర్ కేస్ మిస్టరీ

- నిందితుల అరెస్ట్

**విశ్వంభర, డిండి:** మండలంలో సోమవారం దేవత్ పల్లి తండా గ్రామంలో రమావత్ కుమార్ 27 సం.రాలు హత్య కేసులో మృతుని తల్లి రమావత్ సుకిని ఫిర్యాదు మేరకు సీఐ సురేష్ దర్యాప్తు చేసి శుక్రవారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రమావత్ కుమార్ మృతుని భార్య రమావత్ లక్ష్మి తుంగతుర్తి కి చెందిన వంగాల మధు తాపీ మేస్త్రి తో అక్రమ సంబంధం ఏర్పరచుకున్నది. అక్రమ సంబంధంకు అడ్డుగా ఉన్న భర్త రమావత్ కుమార్ ను ఎలాగైనా అంతమొందించాలని ఉద్దేశంతో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతుడి పొలం వద్ద భార్య లక్ష్మి, వంగాల మధు మరియు మధుకు వెంట వచ్చిన నల్లరపు కిరణ్ లతో కలిసి రమావత్ కుమార్ గొంతు నులిమి చంపి, చీరతో చెట్టుకు ఉరివేసి చంపారు. ఈ కేసు విచారణ డిఎస్పి గిరిబాబు ఆధ్వర్యంలో నిందితులను త్వరతగతిన అరెస్టు చేసినందుకు సీఐ సురేష్, ఎస్సై రాజు, పోలీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ రివార్డులు ప్రకటించి, అభినందించారు.

## ఆదర్శప్రాయుడు మన్మోహన్ సింగ్: కోదండరెడ్డి



**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ బిఆర్కే భవన్లో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎన్ రెడ్డి, రాములు నాయక్ ల తోపాటు రైతులు నివాళ్లు అర్పించారు. రైతులకు దేశానికి చేసిన సేవలను కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, రైతులు గుర్తుచేసుకున్నారు. మన్మోహన్ సింగ్ మితభాషి, మంచి నాయకుడు, ఆర్థిక శాస్త్రవేత్త, మాజీ ప్రధానిగానే కాదు జాతీయ నాయకుడుగా ఎంతగానో ఆయనకు పేరుందని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు.

## ధన్వంతరి గ్రామీణ వైద్యుల సంఘం ఏర్పాటు



**విశ్వంభర, నందిగామ:** రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలో నూతనంగా ధన్వంతరి గ్రామీణ వైద్యుల సంఘం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. అధ్యక్షులడాక్టర్.వెంకట్ రాజు, ఉపాధ్యక్షులు డాక్టర్.మదర్ సాబ్, జనరల్ సెక్రెటరీ, శ్రీనివాస్, ట్రెజరర్, వనూర్ వల్లి, మహిళా అధ్యక్షురాలుగా డాక్టర్ జి. శోభారాణి ఎన్నుకోవడం జరిగింది. డాక్టర్ వెంకటరాజు మాట్లాడుతూ నందిగామ మండలంలో మాపై నమ్మకముతో గ్రామీణ వైద్యులు అందరు కలిసి నూతన కమిటీని ఎన్నుకోవడం ఎంతో సంతోషకరమని తెలిపారు. నందిగామ మండలంలో ధన్వాంతరి గ్రామీణ వైద్యుల సంఘం లో ఉన్న సభ్యులందరికీ ఎలాంటి సంఘటనలు జరిగిన మీ ముందుండి వారికి సహాయ సహకారాలు అందిస్తామని మా యొక్క కోరిక. గ్రామాలలో ఉన్న వైద్యులందరూ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సహాయ సహకారాలు అందించాలని కోరుకున్నారు.

## 'వ్యాసాల సంకలనం' ఆవిష్కరణ




**విశ్వంభర, హైదరాబాద్:** చరిత్ర సగం రాసిన వాక్యం అని తెలంగాణ సాహిత్య అకాడెమీ పూర్వ అధ్యక్షులు జులూరు గౌరిశంకర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్ బుక్ ఫెయిర్ లో సీనియర్ జర్నలిస్ట్ పీవీ రావు రాసిన వ్యాసాల సంకలనం తెలంగాణ సాహిత్య అకాడెమీ పూర్వ అధ్యక్షులు జులూరు గౌరిశంకర్ ఆవిష్కరించారు. ఈ సభకు కవి, జర్నలిస్ట్ ప్రసేన్ అధ్యక్షత వహించగా గౌరీశంకర్ మాట్లడుతూ చరిత్ర సగం రాసిన వాక్యం అన్నారు. మల్లసాగర్ రైతుల పక్షం నిలిచినట్లుగానే లగచర్ల అంశం పట్ల స్పందించాలని అన్నారు. జర్నలిస్టుల వాక్యాలకు పదును వుంటుంది. సామజిక చింతన వున్న వారే గొప్ప జర్నలిస్టులు అవుతారని గౌరీశంకర్ అన్నారు . హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు పుస్తక నివురు గప్పిన నిప్పు అని అన్నారు. రచయిత పీవీ రావు నన్ను కదిలించిన సంఘటనలు రాశానని అన్నారు. ఈ సభలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, మిమిక్రీ ఆర్టిస్ట్ రమేష్, సింగరేణి మాజి డైరక్టర్ డిఎల్ ఆర్ ప్రసాద్, కొండపల్లి పవన్, తెలంగాణ పబ్లికేషన్స్ నిర్వాహకులు కోయ చంద్రమోహన్, కవి తంగిరాల చక్రవర్తి పాల్గొన్నారు.

## గల్ఫ్ బాధితుడికి అండగా ఎమ్మెల్యే ఆది శీను



**విశ్వంభర, మేడిపల్లి:** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం వల్లంపల్లి వాసి మందుల దేవరాజం బతుకుదెరువు నిమిత్తం మూడు నెలల కిందట సౌదీ వెళ్లాడు. నెల రోజుల నుండి ఎలాంటి ఆచూకీ లేని మందుల దేవరాజం ఆచూకీ కనుక్కొని స్వదేశానికి క్షేమంగా వచ్చేలా చూడాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎంబసీ అధికారులను కోరారు. మూడు నెలల క్రితం బతుకుదేరువు నిమిత్తం సౌదీ దేశంలోని జడ్డనగరంలో ఒక కంపెనీలో చేరడం జరిగింది. కాగా గత నెల రోజులుగా మందుల దేవరాజం తమ కుటుంబ సభ్యులకు ఏలాంటి ఫోను చేయడం లేదని, తెలిసిన వాళ్ళ వెళ్లిన తన ఆచూకీ తెలియడం లేదని వారి కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ని సంప్రదించగానే ప్రభుత్వ విప్ తక్షణమే స్పందించి మందుల దేవరాజం ఆచూకీ కనిపెట్టవలసిందిగా కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇండియన్ ఎంబసీ, సౌదీ అరేబియా దేశానికి లేఖ రాసి అధికారులతో మాట్లాడడం జరిగింది. మందుల దేవరాజం ఆచూకీ కోసం అధికారులతో మాట్లాడడం జరిగిందని కుటుంబ సభ్యులు ఎలాంటి ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు.

## రక్షణ కవచం ఏదీ?

- ఇబ్బందులకు గురవుతున్న రోగులు
- పట్టించుకోని కాంట్రాక్టర్



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఆవరణలో మాతా శిశు ఆరోగ్య కేంద్రం వద్ద ఎటువంటి రక్షణ కవచం లేకుండా కొత్తగా బిల్డింగ్ నిర్మాణం చేస్తున్నారు. తగు రక్షణ చర్యలు లేకుండా నిర్మాణాలు చెప్పటంతో ఆసుపత్రికి వచ్చే రోగులు ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిల్డింగ్ నిర్మాణంలో ఉండడంతో పైనుండి ఇటుక పెడ్డలు, సిమెంట్ మాల్ పైనుండి పోయడంతో కింద ఉన్నవారి మీద అనేకసార్లు పడ్డ ఘటనలు ఉన్నాయని ఆస్పత్రికి వచ్చే ప్రజలు వాపోతున్నారు. ఈ ఘటన పై అనేకసార్లు రోగులు సంబంధిత వారి దృష్టికి తీసుకుపోయిన గుత్తేదారుల నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏమైనా జరగరానిది జరిగితే కారకులు ఎవరని రోగులు ప్రశ్నిస్తున్నారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రానికి అనేకమంది గర్భిణీలు వివిధ ప్రాంతాల నుండి ఆస్పత్రికి రాకపోకలు కొనసాగిస్తూ ఉంటారనీ కానీ రక్షణ లేకుండ ఉండటం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గుత్తేదారుల నిర్లక్ష్యంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని సంబంధిత అధికారులు కళ్ళు తెరిచి నెలకొన్న సమస్యను పరిష్కరించాలని ఆస్పత్రికి వచ్చే గర్భిణీలు రోగులు వారి వెంట వచ్చే బంధువులు కోరుతున్నారు.

## ఘనంగా సామూహిక లక్ష కుంకుమార్చన



**విశ్వంభర, సూర్యాపేట:** జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గత 12 రోజులుగా నిర్వహిస్తున్న ధనుర్మాస వ్రత మహోత్సవములలో భాగంగా శుక్రవారం ఉదయం భక్తులందరూ కలిసి సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు భక్తులచే అమ్మవారికి అష్టోత్తర నామాలు జరిపించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి మంగళ నిరాజనాలు పలుకుతూ మహాలక్ష్మీ నమోస్తుతే అంటూ స్తుతించారు. ప్రతిరోజు ప్రతి ఇంట్లో అమ్మవారిని ఎలా ఆరాధించాలో తెలియచేస్తూ పూజలు జరిపింప చేశారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని అర్చించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అండాల్ గోష్టి మహిళా భక్త బృందం చక్కటి సేవలు అందించారు. పూజ అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాదం అందజేశారు. అర్చకులు సంకర్షణాచార్యులు, శ్రీహరి ఆచార్యులు, ఫణికుమార్ ఆచార్యులు, హరిచరణ్ ఆచార్యులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సీపీఎం శ్రేణులు సిద్ధం కావాలి




**విశ్వంభర, రామన్నపేట:** రాబోయే గ్రామ పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం సత్తా చాటేందుకు సీపీఎం కార్యకర్తలు సిద్ధం కావాలని యాదాద్రి జిల్లా కార్యదర్శి యండి జహంగీర్ పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలోని సీపీఎం మండల కార్యాలయంలో రామన్నపేట ముఖ్య కార్యకర్తల సమావేశానికి సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, బల్గూరి అంజయ్య, మండల కార్యవర్గ సభ్యులు కల్లూరి నాగేష్, కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు, గన్నేబోయిన విజయభాస్కర్, నాగటి ఉపేందర్, ఎం డి రషీద్, వేముల సైదులు, తొరుపునూరి శ్రీనివాస్, ఆవనగంటి నగేష్, శాఖ కార్యదర్శిలు పులిబిక్షం, మునికుంట్ల లెనిన్, శానకొండ వెంకటేశ్వర్లు, నాగటి అంజయ్య, నోముల రమేష్, కూనూరు మల్లేశం, గుండాల ప్రసాద్, కొమ్ము అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరనిలోటు



**విశ్వంభర, మహబూబాబాద్:** భారతదేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరనిలోటని ఎంఆర్పీఎస్ జాతీయ కార్యదర్శి దళితరత్న కోండ్ర ఎల్లయ్య అన్నారు. మన్మోహన్ సింగ్ మరణం పట్ల కోండ్ర ఎల్లయ్య తన ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా నాయకుడు జినక స్వామి ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కార్యాలయంలో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మాజీ భారత ప్రధాని మన్మోహన్ సింగ్ దేశ ప్రధానిగా ఉన్న సమయంలో దేశ ఆర్థిక వ్యవస్థను గాడిన పెట్టిన సంస్కరణ రూపశిల్పి మన్మోహన్ సింగ్ అని ఆయన మాటలు గట్టిగా వినిపించకపోయిన మౌనమే ఘనంగా పనిచేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకపోడు సేవా సంఘం జిల్లా అధ్యక్షులు పులి శ్రీను, మహజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సీహెచ్. రాధ, ఎంఆర్పీఎస్ మహిళా అధ్యక్షురాలు కుక్కల సుధారాణి, నీరుడు బాలరాజు, అవారి సందీప్, డోలి మల్లయ్య, వల్లెపు వెంకటయ్య, సాంబయ్య, జక్కుల యాదగిరి, గోలోజు యశ్వంత్, జిట్టబోయిన శ్రీను, భాగ్యరేఖ, సమ్మక్క, అరుణ, మంకిడి జయ, సంధ్య, మీసాల స్వరూప, శశిరేఖ, సరస్వతి, విజయ, బానోతు లక్ష్మి, మాలోతు మూతి, కోన వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

**విశ్వంభర, మిర్యాలగూడ:** మన భారతదేశ మాజీ ప్రధాని ఆర్థిక వేత్త డా. మన్మోహన్ సింగ్ అకాల మరణానికి సంతాపం ప్రకటిస్తూ మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం (రాజీవ్ భవన్) నందు వారి చిత్ర పటానికి పూలమాలను వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ ప్రధానిగా నెహ్రూ తర్వాత వరుసగా 10 ఏళ్లు ప్రధానిగా చేసిన ఘనత మన మన్మోహన్ సింగ్ ది అన్నారు.1990 లో మన దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో చిక్కుకుపోతున్న సమయంలో ఆనాటి ప్రధాని పీవీ నరసింహారావు నేతృత్వంలో ఆర్థికమంత్రిగా బాధ్యతలు స్వీకరించి దేశంలో ఆర్థిక సంస్కరణలు తీసుకురావడంలో కీలక పాత్ర దక్కించుకున్న ఘనత అతనిదే. నిజానికి ఆనాడు వారు చేసిన సంస్కరణ లే నేటి దేశ ఆర్థిక పురోగతికి పునాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్, బి ఎల్ ఆర్ బ్రదర్స్ , ఇతర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

**విశ్వంభర, హనుమకొండ:** హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సంతాప సభలో జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తో కలిసి పాల్గొని మన్మోహన్ సింగ్ కి నివాళులు అర్పించారు. అనంతరం వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ దేశానికి సరికొత్త దిశ, దశ చూపిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సేవలు చీరస్మరణీయమైనవని కొనియాడారు. ప్రపంచంలోని గొప్ప ఛాంపియన్స్ లో మన్మోహన్ ఒకరని అన్నారు. యూఎస్ ఇండియా పౌర అణు సహకార ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని, భారత్ వేగంగా అభివృద్ధి చెందాటానికి ఆయన ప్రవేశ పెట్టిన ఆర్థిక సంస్కరణలు ప్రజలకు ఎల్లవేళలా గుర్తుండిపోతాయని, కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారుగా, ఆర్బీఐ గవర్నర్ వంటి అనేక ముఖ్యమైన పదవులను ఆయన నిర్వహించారని ముఖ్యంగా దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని అన్నారు. ముఖ్యంగా తెలంగాణ ప్రజల ఎన్నో దశాబ్దాల ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ను నెరవేర్చింది మన్మోహన్ నని, నాడు ప్రధానిగా ఉన్న ఆయన ఎంతో రాజనీతితో వ్యవహరించి విభజనకు అనుకూల, అననుకూల నేతలతో ఎన్నో చర్చలు చేసి సామరస్యంగా విభజన చేయడానికి ఎంతో కృషి చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

**విశ్వంభర, సూర్యాపేట:** జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భారత దేశ మాజీ ప్రధానమంత్రి, డాక్టర్. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పీసీసీ సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేపట్టిన వ్యక్తిగా నిలిచిన మన్మోహన్ సింగ్ అక్టోబర్ 1991లో తొలిసారి రాజ్యసభలో అడుగుపెట్టారు. 1991 నుంచి 1996 వరకు పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పని చేసిన ఆయన.. ఆ తర్వాత 2004 నుంచి 2014 వరకు పదేళ్ల పాటు భారత ప్రధానిగా సేవలందించారని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో ఇప్పటికీ పని కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని మన్మోహన్ సింగ్ హయాంలోనే ప్రారంభించారని తెలిపారు. పేదవాడి అభ్యున్నతి కోసం రూపొందిన విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, ఆహార భద్రత చట్టం, ఉపాధి హామీ చట్టం వంటి కీలక నిర్ణయాలతో పాటు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులోనూ కీలక పాత్ర పోషించి మన రాష్ట్ర కళను సాకారం చేసిన దార్శనికుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని గుర్తుచేశారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు దేశం ఏ నాటికి మరిచిపోదని కొప్పుల వేణారెడ్డి పేర్కొన్నారు.







**విశ్వంభర, హైదరాబాద్:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చనిపోవడం దేశానికి, కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని మాజీ ఎంపీ వి. హన్మంతరావు అన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్ లో మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి నివాళులు అర్పించిన అనంతరం మీడియా తో మాట్లాడారు. ప్రపంచ స్థాయిలో దేశ ఆర్థిక వ్యవస్థ ను మన్మోహన్ సింగ్ నిలిపారని, సోనియా గాంధీ కి రెండు సార్లు ప్రధాని అయ్యే అవకాశం వచ్చినా ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ ను ప్రధానిని చేశారని అన్నాడు. ఓబీసీ లకు ఐఐటీ, ఐఐఎం లలో రిజర్వేషన్ కోరడం.. వెంటనే బిల్లు ప్రవేశ పెట్టారని వి. హన్మంతరావు తెలిపారు.

## 28న హైదరాబాద్‌లో న్యూడెమోక్రసీ విలీన సభను జయప్రదం చేయాలి



**విశ్వంభర, మహబూబాబాద్:** సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రెండు పార్టీల విలీన సభ ఈనెల 28న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని ఈ కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ మహబూబాబాద్ మండలం లక్ష్మి పురం (బి) గ్రామంలో పోస్టర్ ఆవిష్కరణ చేశారు. అనంతరం ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మహబూబాబాద్ సబ్ డివిజన్ కార్యదర్శి గుజ్జు దేవేందర్, సామ పాపయ్యలు మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం విప్లవ పార్టీలు అవతరించాయని ఆ పోరాట క్రమంలో లక్షలాది ఎకరాల భూములను ప్రజలకు పంచిపెట్టిన చరిత్ర విప్లవ పార్టీలకు ఉందని గుర్తు చేశారు. ఈ విప్లవ ఉద్యమంలో పదివేల మందికి పైగా తమ అమూల్యమైన ప్రాణాలు అర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో చారి హరీష్, సూర్య, అలకుంట్ల ఎల్లయ్య, విమల, గంగమ్మ, రాజు, భద్రమ్మ, నూరుద్దీన్, నవీన్,వెంకన్న నాయకులు పాల్గొన్నారు.

## సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



**విశ్వంభర, సిద్దిపేట:** తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె శుక్రవారానికి 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బాలకిషన్ మాట్లాడుతూ సమగ్రశిక్షలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. అప్పటి వరకు ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కేల్ ఇవ్వాలన్నారు. ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా 10లక్షలు, ఆరోగ్యబీమా 10 లక్షలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, విద్యాశాఖ నియమకాలలో వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. సమగ్రశిక్ష ఉద్యోగులందరికీ రీ-ఎంగేజ్ విధానాన్ని తీసేయాలన్నారు. పై డిమాండ్లతో 2023 ఆగష్టు-సెప్టెంబర్ నెలలో సమగ్రశిక్ష ఉద్యోగులు చేసిన సమ్మెకు నాడు పీసీసీ అధ్యక్షుడి హెూదాలో సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ లో మద్దతు తెలిపారని గుర్తుచేశారు.

## మైసిగండి అమ్మవారికి రూ.11 లక్షల 40 వేల ఆదాయం



**విశ్వంభర, కడ్తాల్:** మైసిగండి మైసమ్మ దేవత శివాలయ, రామాలయ దేవస్థానము అమ్మవారి కొబ్బరి చిప్పలు, వడిబియ్యం మరియు చీరలు సేకరించు హక్కు బహిరంగ వేలం అధికారుల సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. ఈ బహిరంగ వేలం లో నలుగురు పాల్గొనగా మైసిగండి గ్రామానికి చెందిన కెతావత్ పరంసింగ్ రూ. 11,40,200 లు దక్కించుకన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా దేవాదాయ శాఖ తూర్పు విభాగం ఇన్స్పెక్టర్ ప్రణీత్, పౌండర్ ట్రస్టీ లక్ష్మి శిరోళి, ఈఓ స్నేహలత, భాస్కర్, ఉప ప్రధాన అర్చక మాదారం యాదగిరి, సిబ్బంది, కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు,శ్రవణ్ కుమార్ హర్షవర్ధన్, వెంకటేష్, అమర్ సింగ్ నాయక్, శివరాంనాయక్,గోపి నాయక్, తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐఎం 6వ మహాసభలు




**విశ్వంభర, మహేశ్వరం:** భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ (సీపీఐఎం), మహేశ్వరం మండల 6వ మహాసభ మండల కేంద్రంలో బీసీ కమ్యూనిటీ హాల్లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ రాజు జండా ఆవిష్కరణ చేయడం జరిగింది. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ రాజు, జి. కవిత, సీపీఐఎం జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ దేశంలో మతం పేరిట రాజకీయాలు చేస్తూ ప్రజలను విచ్చినం చేస్తుందన్నారు. దేశంలో దళితులపైన దాడులు, మహిళ పైన దాడులు పెరిగాయన్నారు. 6 గ్యారంటీలను అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. ఉచిత బస్సు మినహా మిగతా హామీలు అమలుకు సిద్ధంగా లేదన్నారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన మండల కార్యదర్శిగా ఏర్పుల శేఖర్, కమిటీ సభ్యులుగా ఏ రవికుమార్, ఎం ప్రకాష్, పి జగన్, జే జంగయ్య, జై మల్లేష్, జై శ్రీశైలం, ఎస్ చంద్రయ్య, లక్ష్మి, శైలజ, బుజాతలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: టీపీటీఎఫ్



**విశ్వంభర, నెల్లికుదురు:** ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయవద్దని టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 18 ఏళ్లుగా చాలీ చాలని వేతనాలతో పనిచేసిన ఎస్ఎస్ఏ ఉద్యోగులు 20 రోజులుగా ఆందోళన చేపట్టారు.వారి స్థానాలలో డిప్యూటేషన్ ద్వారా ఉపాధ్యాయులను నియమించడం సరైంది కాదన్నారు.

# ఐక్యమత్యంగా ఉంటేనే ప్రభుత్వాలు గుర్తిస్తాయి

ఎంపీ ఈటెల రాజేందర్




**విశ్వంభర, ఎల్బీనగర్:** ఐక్యమత్యంగా ఉంటేనే ప్రభుత్వాలు గుర్తించి విశ్వకర్మలకు తగిన ప్రాధాన్యత ఇస్తారని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. శుక్రవారం ఆర్కే పురం లోని బాబు జగ్జీవన్ రాం భవనంలో అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కౌలే జగన్నాథం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాష్ట్ర సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 25 లక్షల జనాభా కలిగి ఉన్న విశ్వకర్మ సామాజిక వర్గం వారి కులవృత్తుల ఆధారంగానే జీవనాన్ని సాగిస్తుంటారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం వస్తే వృత్తులకు తోడ్పాటు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తారని ఆశపడ్డారని, ఈ తొమ్మిదేళ్ల కాలంలో పాలకులు విశ్వకర్మ విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి సంక్షేమం కొరకు పని చేయలేదని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. అనంతరం అధ్యక్షుడు జగన్నాథం మాట్లాడుతూ విశ్వకర్మ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి 1000 కోట్ల రూపాయలు బడ్జెట్ కేటాయించాలన్నారు. 55 సంవత్సరాలు నిండిన వృత్తి కళాకారులకు 5,000 రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, ప్రమాదవశాత్తు చనిపోతే 10 లక్షలు ఇవ్వాలన్నారు. రాజకీయంగా నామినేటెడ్ పదవులు ఇవ్వాలని, బ్యాంక్ షూరిటీ లేకుండా 25 లక్షల వరకు వ్యక్తిగత రుణం ఇప్పించాలన్నారు. రాష్ట్ర రాజధానిలో కేటాయించిన ఐదు ఎకరాల స్థలంలో 200 కోట్ల రూపాయలు కేటాయించి అన్ని వసతులతో కూడిన విశ్వకర్మ భవనాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాలని అన్నారు. సెప్టెంబర్ 17 విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రతిభగనపరిచిన విశ్వకర్మ చేతి వృత్తుదారులకు గౌరవప్రద పురస్కారాలు ఇవ్వాలని అన్నారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన అధ్యక్ష కార్యదర్శుల ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు చెదిలాల్ శర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఫైలేష్ కుమార్, జనరల్ సెక్రటరీ దినేష్ బాయ్ శర్మ, ఉపాధ్యక్షుడు ఎం ఎం శర్మ, నాయకులు మనోరంజన్, రాజశేఖర్, కృష్ణ గంజ్, సూర్యనారాయణ గులాబ్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రూ కప్ చారిత్రాత్మకమైంది

నెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాచలంలో ప్రతి ఏటా నిర్వహించే నెహ్రూ కప్ చారిత్రాత్మకమైందని నెహ్రూ కప్ వ్యవస్థాపకులు తోటమల్ల బాలయోగి వ్యాఖ్యానించారు. భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నెహ్రూ కప్ మూడు దశాబ్దాలుగా ఏజెన్సీలో సుందర స్వప్నంగా ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే కాక భారత దేశంలోనే భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ పేరు మీదుగా 29 సంవత్సరాల పాటు టోర్నమెంట్ నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. ఇందుకు కారణం భద్రాచలం క్రికెట్ ప్రేమికులే అన్నారు. నెహ్రూ కప్ నిర్వహణ ద్వారా ఎంతోమంది యువతి, యువకులు తమ క్రికెట్ నైపుణ్యాన్ని పెంపొందించుకొని ఉన్నత స్థానాలను అధిరోహించారని తెలిపారు. ప్రస్తుతం భారత మహిళ అండర్ 19 జట్టులో ఆడుతున్న గొంగడి త్రిష కూడా నెహ్రూ కప్ నుంచి స్ఫూర్తి పొందిందని వెల్లడించారు. అదేవిధంగా ఇటీవల హైదరాబాద్ హెచ్.సి.ఏ జట్టుకు ఎంపికైన విద్వాన్ తదితరులకు కూడా నెహ్రూ కప్ స్ఫూర్తిదాయకమన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రంలో నెహ్రూ కప్పు ది ఒక పెద్ద రికార్డు అని, ఇన్నాళ్లపాటు ఈ టోర్నమెంట్ జరగటానికి స్థానికుల సహాయ సహకారాలు మరువలేనివి అని అన్నారు. నెహ్రూ కప్ మ్యాచ్ లను చూసేందుకు పెద్ద ఎత్తున క్రికెట్ అభిమానులు భద్రాచలం తరలిరావాలని కోరారు. డిసెంబర్ 29 నుంచి జనవరి 5 వరకు ఈ ఏడాది నెహ్రూకప్ అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని నెహ్రూ కప్ ప్రధాన కార్యదర్శి దాట్ల శ్రీనివాసరాజు తెలిపారు. ఈనెల 27 నుంచి టోర్నమెంట్ జరగాల్సి ఉన్నప్పటికీ వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో 29వ తేదీకి మార్చడం జరిగిందన్నారు. ఎప్పట్లాగానే నెహ్రూ కప్ నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. భద్రాచలం ఏజెన్సీకి వన్నెతెచ్చిన టోర్నమెంటు నెహ్రూ కప్ అని వ్యాఖ్యానించారు.నెహ్రూ కప్ క్రికెట్ టోర్నమెంట్ లో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా, సమీప ఛత్తీస్గఢ్ నుంచి రాష్ట్రం నుంచి కూడా పేరుందిన క్రికెట్ జట్లు ఈసారి టోర్నమెంట్లో పాల్గొంటున్నాయని నెహ్రూ కప్ కన్వీనర్ ఎస్ కే సలీం తెలిపారు. ఈ ఏడాది 21 టీములకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. టోర్నమెంట్ నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.ఈ సమావేశంలో నెహ్రూ కప్ క్రికెట్ టోర్నమెంట్ అధ్యక్షులు అట్లూరి శ్రీధర్, ఉపాధ్యక్షులు గుమ్ములూరు శ్రీనివాసరావు, కోశాధికారి కుంచాల సదానందం (సిద్దు) సహాయ కార్యదర్శి మడిపల్లి నాగార్జున, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు తోటమల్ల సురేష్ బాబు, విద్యాసాగర్, పూణెం ప్రదీప్ కుమార్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తక పఠనంతో మెదడుకు పదును

**– లయన్ మోహన్ దాస్**



**విశ్వంభర, హైదరాబాద్:** పుస్తక పఠనంతో మెదడుకు పదును పెరుగుతుందని డిస్ట్రిక్ట్ లియో ఛైర్మన్ 320ఏ లయన్ మోహన్ దాస్ అన్నారు. నవభారత లయన్స్ క్లబ్, చౌక్కాపు వెంకటరమణ, డా.హిప్నో పద్మా కమలాకర్ ఆధ్వర్యంలో 37 వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ బొంబాయి విజయ భారతి వేదిక మీద ప్రభుత్వ వసతిగృహం బాల బాలికలు దేశ భక్తి పాటలు, డ్యాన్స్ లతో అలరించారు. చక్కగా ప్రదర్శించిన బాల కళాకారులుకు లయన్ మోహన్ దాస్, లయన్ డా.జి.మహేంద్ర కుమార్ రెడ్డి, చౌక్కాపు వెంకటరమణ, డా.రమేష్ కుమార్, జి.కృష్ణ వేణి, శాతరావు, శ్యామల, డా.హిప్నో పద్మా కమలాకర్ బహుమతులు, పుస్తకాలు, కేకులు అందజేశారు.ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం జీవితంలో అత్యంత ప్రభావవంతమైన అలవాటుగా నిలుస్తుందన్నారు. మొదటి వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డా. జి.మహేంద్రకుమార్ రెడ్డి మాట్లాడుతూ పఠనంతో ఆలోచనాశక్తి పెరుగు తుందన్నారు. చదవడం ద్వారా పిల్లల్లో సృజనాత్మక ఆలోచనల తీరులు విస్తరిస్తాయని చెప్పారు.కథలు, కవితలు, పరిశోధనల చదివితే మెదడుకు కొత్త ఆలోచనల వస్తాయన్నారు. మంచి పుస్తకం మనసుకు తృప్తినిచ్చి మానసిక ఒత్తిడిని తగ్గిస్తుందన్నారు. విశ్లేషణాత్మక ఆలోచనా విధానం అభివృద్ధి చెందుతుందన్నారు. స్టాల్ నెం.245 లో బుక్ లవర్స్ అడిగిన ప్రశ్నలకు చక్కని అవగాహన కల్పించారు. చౌక్కాపు మాట్లాడుతూ మేధస్సు మెరుగుపడుతుందన్నారు. ఇది జ్ఞాపకశక్తి మెరుగుపరచడంతో పాటు, నిర్ణయాలు తీసుకోవడంలో స్పష్టతను పెంచు తుందన్నారు. డా.హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ పుస్తకం ఎంత అద్భుతంగా కనిపించినా, అందులో అక్షరాలు లేకపోతే అది కేవలం అలంకారమే అవుతుందన్నారు. మనిషి ఎంత అందంగా ఉన్నా, మేధస్సు లో జ్ఞానం లేకపోతే జీవితంలో విలువను సంతరించుకోలేదన్నారు. ఒక నిమిషం పాటు ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్ కి శ్రద్ధాంజలి ఘటించారు.

## సిద్ధార్థ కవిత్వం అంతా ప్రజలకోసమే

**పీఓడబ్ల్యూ సంధ్య**




**విశ్వంభర, హైదరాబాద్:** హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేదికగా 'సిద్ధార్థ కవిత్వం మల్లెల తీర్థం మహా ఖననం' పుస్తకావిష్కరణ జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన పీఓడబ్ల్యూ సంధ్య మాట్లాడుతూ ఈ ముఖచిత్రంలోనే ఎన్నో భావ విస్ఫోటనాలు కనిపిస్తున్నాయి. ఆయన సృష్టించే కవిత్వం అంతా ప్రజలకోసమే అని అన్నారు. ఏలె లక్ష్మణ్ మాట్లాడుతూ, సిద్ధార్థతో స్నేహం ఏర్పడి 35 ఏళ్ళకు పైగా అవుతుంది. 35 ఏళ్ళ ముందు ఎలా ఉన్నాడో ఇప్పుడు కూడా అలాగే ఉన్నాడు. సిద్ధార్థ సంపూర్ణమైన కవి. ఈ కవితలు చూస్తుంటే నా పెయింటింగ్ గుర్తొస్తున్నాయి. బి.ఎస్. రాములు మాట్లాడుతూ, తెలంగాణ భాషను అద్భుతంగా కవిత్వరీకరించారు అన్నారు. కవి సిద్ధార్థ మాట్లాడుతూ ఇంత మంది హేమాహేమీల మధ్య ఈ పుస్తకం రావడం కన్నా గొప్ప సందర్భం ఏదీ ఉండదు అన్నారు. పాశం యాదగిరి, బి.ఎస్. రాములు, కె. ఆదిత్య, అంబటి సురేంద్ర రాజు, కవి యాకూబ్ పాల్గొన్నారు.

## ధ్యానంతో జ్ఞానం వస్తుంది

**– మాజీ ఎమ్మెల్యే జయపాల్ యాదవ్**



**విశ్వంభర, కడ్తాల్:** ధ్యానం గొప్ప జ్ఞానాన్ని ఇస్తుందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద ధ్యాన పిరమిడ్ మనకు అందుబాటులో ఉందని జీవ హింస చేయకుండా ధ్యానం చేసి మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. కడ్తాల్ మండలంలోని అన్మాస్పల్లి సమీపంలోని పిరమిడ్ లో ప్రతి సంవత్సరం మహా ధ్యాన మహేశ్వర పిరమిడ్ ఆధ్వర్యంలో 11 రోజులపాటు ధ్యానంతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధ్యాన మహా పిరమిడ్ ఛైర్మన్ విజయ భాస్కర్ రెడ్డి డైరెక్టర్, జోగు వీరయ్య, గంప శీను, అంజి, శ్రీకాంత్, మహేష్ పాల్గొన్నారు.

## పీజీఎన్ కంపెనీ అవుట్ లెట్ ప్రారంభం



**విశ్వంభర, హనుమకొండ:** హనుమకొండ నయీమ్ నగర్ వాగ్దేవి విద్యాసంస్థల ఎదురుగా మెయిన్ రోడ్డులో నిర్వాహకులు నల్లవెల్లి మధుకర్ రెడ్డి మాధవి, దంపతులు నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ మహాలక్ష్మి ఎంటర్ప్రైజెస్ పిజిఎన్ కంపెనీ అవులేట్ షాపును ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏపీజీవీబీ, వరంగల్ బ్రాంచ్ రీజినల్ మేనేజర్ జీపీఎస్ చైతన్య కుమార్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రవీందర్, సూరంరాజు, రాజు నాయక్, ఏపీజీవీబీ, బ్యాంకు ఉద్యోగులు, బంధువులు పాల్గొన్నారు.

## బీజేపీ క్రియాశీలక సభ్యత్వం పొందిన వారికి పార్టీలో గుర్తింపు



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండలం వెంకటంపేట బీజేపీ గ్రామ 48, 49 బూత్ అధ్యక్షులుగా బొడ్డు గణేష్, శివర్ల ప్రవీణ్ యాదవ్ ల నియామకం జరిగింది. అధ్యక్షులుగా బొడ్డు గణేష్, శివర్ల ప్రవీణ్ లకు నియామక పత్రాన్ని బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు శివర్ల రమేష్ యాదవ్ రాష్ట్ర నాయకులు ధరణి పతి రమణారావు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు మాట్లాడుతూ బీజేపీ లో కనీసం 25 సభ్యత్వాలు చేసి క్రియాశీలక సభ్యత్వం పొందితేనే గ్రామ బూత్ నుంచి రాష్ట్ర బాధ్యత వరకు అర్హుడు అన్న విషయాన్ని గుర్తించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్జ అభినవ్ గౌడ్, ఐతగోని శివ పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసిన పోలీసులు

**విశ్వంభర, త్రిపురారం:** త్రిపురారం మండలం లో నీలాయగూడెం గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం జరిగిందని త్రిపురారం ఎస్సై తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం అందిన సమాచారం మేరకు త్రిపురారం మండల స్థానిక ఎస్సై మరియు పోలీస్ బృందం త్రిపురారం మండలంలో నీలాయగూడెం గ్రామ శివారులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారు. అందిన సమాచారం మేరకు పోలీసు బృందం పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న వ్యక్తులు గున్ రెడ్డి వెంకట్ రెడ్డి, గ్యార రవి, కంచర్ల నరసింహ చారి, వెంగుల శ్రీనివాసరావు అను నలుగురు వ్యక్తులను పేకాట అడుతుండగా పట్టుకొని విచారించగా వారు నేరము ఒప్పుకోగా తదుపరి పంచ నామ నిర్వహించి వారి వద్ద నుండి రు.20,560 రూపాయల నగదు మరియు నాలుగు స్మార్ట్ ఫోన్లు, 2 మోటర్ సైకిళ్ళను, మరియు పేక ముక్కలను స్వాధీనం పరుచుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

# మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ నివాళి



**విశ్వంభర, నెల్లికుదురు:** అస్తమయం చెందిన మాజీ ప్రధాని డా.మన్మోహన్ సింగ్ కు మండల కేంద్రం నెల్లికుదురు లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ వేర్వేరుగా శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించింది. కార్యక్రమాలలో నాయకులు ఎదెల్ల యాదవ రెడ్డి,గొల్లపెల్లి ప్రభాకర్ గౌడ్,హెచ్ వెంకటేశ్వర్లు, గుగులోతు బాలాజీ నాయక్,భాస్కర్ నాయక్, రాజేష్, రత్నపురపు యాకయ్య,క్రాంతి రెడ్డి, దాసరి ప్రకాష్,పయ్యావుల బిక్షం,పులి శ్రీను,ఆకుల కొమురెల్లి,మాదరి ప్రశాంత్,చట్ల యాకయ్య,కిషన్ సమరం తదితరులు పాల్గొన్నారు.

**విశ్వంభర, మహేశ్వరం:** కందుకూరు మండలం నేదునూరు గ్రామంలో మాజీ ప్రధానమంత్రి అంబేద్కర్ విగ్రహం దగ్గర రాజకీయాలకు అతీతంగా గ్రామ పెద్దల సమక్షంలో మన్మోహన్ సింగ్ కు నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గంగుల ప్రభాకర్ రెడ్డి, కందుకూరు మండలం కోఆర్డినేటర్ ఎండి అఫ్జల్ బేగ్, చెన్నకేశవుల స్వామి ఆలయం ఛైర్మన్ రూప్ చందర్, నేదునూరు గ్రామం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్ర సురేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంకగాళ్ల బాలయ్య, వరికుప్పల బాబు, మాధవరెడ్డి, సీపీఎం పార్టీ నేదునూరు గ్రామం మాజీ ఉపసర్పంచ్ బుడ్డిరుపు శ్రీనివాస్, వీరమల్ల శ్రీరాములు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంజీవ, జగన్,ఎండి సద్దాం, ఫయాజ్, రఫీ,మహేందర్ పాండు, వెంకటయ్య, మహేందర్, బిక్షపతి, జంగిలి, రమేష్, ఆర్ గణేష్, భాస్కర్ పాల్గొన్నారు.

**విశ్వంభర, ఉప్పల్:** మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల చింతిస్తూ బోడుప్పల్ 13వ డివిజన్ కార్పొరేటర్ మరియు కాంగ్రెస్ సీనియర్ నాయకులు దానగల్ల అనిత యాదగిరి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన మృతి కి సంతాపం తెలిపారు. ఆయనతో పాటు పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**విశ్వంభర, మిర్యాలగూడ:** భారతదేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతికి మిర్యాలగూడ మున్సిపల్ ఛైర్మన్ తిరునగరు భార్గవ్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది. తిరునగరు భార్గవ్ మాట్లాడుతూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆర్థిక దృష్టి, వివేకం, దేశ సేవాపరమైన భావం ఎప్పటికీ మనందరికి ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ రోశయ్య, కౌన్సిలర్లు దుర్గ సత్యం, ఖాదర్ భాయ్, సలీం భాయ్, సైదిరెడ్డి, కోల వెంకన్న, మధు, లింగారెడ్డి, దుర్గారావు, అశోక్, అంజయ్య, నాగరాజు, వంశీ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.





## లష్కరే తోయిబా డిప్యూటీ చీఫ్ మృతి



**లాహోర్:** పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రసంస్థ లష్కరే తోయిబా డిప్యూటీ చీఫ్ హఫీజ్ అబ్దుల్ రెహమాన్ మక్కి మరణించారు. అతడు ముంబై ఉగ్రదాడి ప్రధాన సూత్రధారి హఫీజ్ సయీద్ బావమరిది. అతడు గత కొంత కాలంగా మధుమేహంతో బాధపడుతున్నాడు. శుక్రవారం ఉదయం గుండెపోటుతో లాహోర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మరణించినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.16 ఏళ్ల క్రితం అంటే 2008 నవంబర్ 26న పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా ముఠాకు చెందిన 10 మంది ఉగ్రవాదులు ముంబైలో మారణహోమానికి పాల్పడ్డారు. కొబాలా సముద్ర తీరం వెంబడి దక్షిణ ముంబైలోకి ప్రవేశించిన ఈ ముఠా తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ సహా అనేక ప్రాంతాల్లో విచక్షణారహితంగా దాడులు జరిపారు. ఈ దాడుల్లో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ 26/11 ముంబై ఉగ్ర దాడులకు మక్కి ఆర్థిక సాయం అందించారు.

మే 2019లో మక్కిని పాకిస్థాన్ ప్రభుత్వం అరెస్ట్ చేసింది. లాహోర్‌లో గృహనిర్బంధంలో ఉంచింది. 2020లో టెర్రర్ ఫైనాన్సింగ్‌కు సంబంధించిన కేసుల్లో పాకిస్థాన్ కోర్టు అతడిని దోషిగా తేల్చింది. ఈ మేరకు జీవిత ఖైదు విధించింది. ఇక గతేడాది (2023) జనవరిలో యునైటెడ్ నేషన్స్ సెక్యూరిటీ కౌన్సిల్ కూడా మక్కిని గ్లోబల్ టెర్రరిస్ట్‌గా ప్రకటించింది. ముంబై ఉగ్రదాడితోపాటు మక్కికి ఎర్రకోట దాడిలో ప్రమేయం ఉంది. దీంతో అతడిని భద్రతా సంస్థలు భారత దేశంలో వాంటెడ్ టెర్రరిస్ట్‌గా ప్రకటించాయి. 2000 సంవత్సరం డిసెంబర్ 22న ఢిల్లీ ఎర్రకోటపై లష్కరే తోయిబాకు చెందిన ఆరుగురు ఉగ్రవాదులు దాడి చేసిన విషయం తెలిసిందే.

## 2025లో 4 గ్రహణాలు..



**ఇండోర్:** వచ్చే ఏడాది (2025 సంవత్సరం)లో మొత్తం నాలుగు గ్రహణాలు సంభవించనున్నాయి. ఇందులో రెండు చంద్ర గ్రహణాలు కాగా.. రెండు సూర్య గ్రహణాలు. వీటిలో ఒకటి మాత్రమే భారత్‌లో కన్పించనున్నట్లు మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని జీవాజీ అంతరిక్ష అధ్యయన కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రకాశ్ గుప్తా తెలిపారు.

వచ్చే ఏడాది మార్చి 14న సంపూర్ణ చంద్ర గ్రహణం సంభవించనుంది. అయితే.. అది పగటిపూట ఏర్పడడం వల్ల మన దేశంలో కనిపించే అవకాశం లేదని పేర్కొన్నారు. అమెరికా, పశ్చిమ ఐరోపా, పశ్చిమ ఆఫ్రికా, ఉత్తర, దక్షిణ అట్లాంటిక్ మహాసముద్రాల వద్ద ఈ చంద్రగ్రహణం కనిపిస్తుందని ప్రకాశ్ గుప్తా తెలిపారు. మార్చి 29న పాక్షిక సూర్య గ్రహణం వస్తుందని.. దాని ప్రభావం భారత్‌లో ఉండబోదని చెప్పారు. ఉత్తర అమెరికా, యూరప్, వాయువ్య రష్యాలో ఈ గ్రహణం కనిపిస్తుందన్నారు.

సెప్టెంబరు 7, 8 మధ్య ఏర్పడే సంపూర్ణ చంద్రగ్రహణాన్ని భారత ప్రజలు వీక్షించే అవకాశం ఉందని గుప్తా తెలిపారు. దీని కోసం ఖగోళ ప్రేమికులు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారని అన్నారు. ఈ చంద్ర గ్రహణం భారత్‌తో పాటు యూరప్, అంటార్కిటికా, పశ్చిమ పసిఫిక్ మహాసముద్రం, ఆస్ట్రేలియా, హిందూ మహాసముద్ర ప్రాంతాల్లో పూర్తిగా కనిపిస్తుందన్నారు. 2025 ఏడాదిలో చివరి గ్రహణం సెప్టెంబర్ 21 22 మధ్య సంభవిస్తుందని.. ఈ పాక్షిక సూర్యగ్రహణం భారత దేశంలో కనిపించదని పేర్కొన్నారు.

## మన్మోహన్ సింగ్ అవినీతి వ్యతిరేకి..

### ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశ చూపారు: అన్నాహజారే



**ముంబయి:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి ప్రముఖ సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే సంతాపం తెలిపారు. ఆయన ఎప్పుడూ సామాజిక సంక్షేమం, దేశాభ్యున్నతికే ప్రాధాన్యత ఇచ్చారని కొనియాడారు. మహారాష్ట్రలోని తన స్వగ్రామంలో పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ.. 'పుట్టినవారు మరణిస్తారు. కానీ, వారి జ్ఞాపకాలు, వారసత్వం మాత్రం నిలిచిపోతాయి. మన్మోహన్ సింగ్ దేశ ఆర్థిక వ్యవస్థకు కొత్త దిశను చూపించారు' అని అన్నారు. తాను 2010 తొలినాళ్లలో అవినీతి వ్యతిరేక ఉద్యమం చేపట్టినప్పటి విషయాలను ఈ సందర్భంగా అన్నాహజారే గుర్తు చేసుకున్నారు. ఆయన తనను చర్చలకు ఆహ్వానించారని, త్వరితగతిన నిర్ణయాలు తీసుకునేవారని తెలిపారు. అవినీతిని వ్యతిరేకించిన మన్మోహన్ సింగ్ లోక్‌పాల్, లోకాయుక్త చట్టానికి సంబంధించి తక్షణ నిర్ణయాలు తీసుకున్నారని, నిత్యం దేశం గురించి, దేశ ప్రజలకు ఇంకా ఏం చేయాలనే ఆలోచించేవారని తెలిపారు. మన్మోహన్ భౌతికంగా దూరమైనా.. ఆయన ప్రజల జ్ఞాపకాల్లో ఎప్పటికీ నిలిచిపోతారని తెలిపారు.

అన్నా వర్సిటీ ఘటనను నిరసిస్తూ..

# కొరడాతో కొట్టుకున్న అన్నామలై..



చెన్నై: అన్నా యూనివర్సిటీలో 19 ఏళ్ల విద్యార్థినిపై లైంగిక దాడి ఘటనను తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కే అన్నామలై తీవ్రంగా ఖండించారు. ఆ ఘటనకు నిరసనగా ఆయన అంతకుముందే చేసిన వాగ్దానం ప్రకారం శుక్రవారం కోయంబత్తూరులోని తన ఇంటి ముందు కొరడాతో ఆరు దెబ్బలు కొట్టుకున్నారు. అంతేగాక శుక్రవారంనుంచి 48 రోజులపాటు నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలిపారు.

డీఎంకే పాలనలో రాష్ట్రంలో అడుగడుగునా అన్యాయమే జరుగుతున్నదని అన్నామలై ఆవేదన వ్యక్తం చేశారు. అన్యాయాలను నిరసిస్తూ తమను తాము కొరడాలతో కొట్టుకోవడం, తమను తాము శిక్షించుకోవడం అనేది తమిళనాడు సంస్కృతిలో భాగంగా ఉన్నదని ఆయన అన్నారు. పూర్వకాలం నుంచి ఉన్న సంప్రదాయాన్నే తాను ఇప్పుడు పాటించానని చెప్పారు.

తన నిరసన ఏ వ్యక్తికి వ్యతిరేకం కాదని చెప్పారు.రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగానే తాను నిరసన తెలియజేస్తున్నానని అన్నామలై వెల్లడించారు. అన్నా యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఘటన అలాంటి అన్యాయాల్లో ఒకటని చెప్పారు. డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాన్యులకు వ్యతిరేకంగా అన్యాయాలు జరుగుతూనే ఉన్నాయని అన్నామలై తెలిపారు. మహిళలు, పిల్లలు అన్యాయాలకు గురవుతున్నారని చెప్పారు.రాష్ట్రంలో అవినీతి కూడా పెరిగిపోయిందని అన్నామలై విమర్శించారు.

ఈ అన్యాయాలకు వ్యతిరేకంగానే తాను నిరసన తెలియజేస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం గద్దెదిగే వరకు తాను కాళ్లకు చెప్పులు కూడా వేసుకోబోనని ఆయన శపథం చేశారు. అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు.. తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్‌తో కలిసి దిగిన ఫొటోలను అన్నామలై గురువారం మీడియాకు వెల్లడించారు. ఆ సందర్భంగానే ఆయన రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం కొరడాతో ఆరుదెబ్బలు కొట్టుకుంటానని, ఆ రోజు నుంచి 48 రోజులపాటు నిరాహార దీక్ష చేస్తానని, డీఎంకే అవినీతి పాలన ముగిసిపోయే వరకు తాను కాళ్లకు చెప్పులు వేసుకోబోనని అన్నామలై ప్రకటించారు. ఆ ప్రకారమే ఇవాళ ఆయన కొరడాతో కొట్టుకున్నారు.

## జైల్లో ఉన్నప్పుడు.. నా పిల్లలకు మన్మోహన్ స్కాలర్‌షిప్ ఆఫర్ చేశారు: మలేషియా ప్రధాని



**కౌలాలంపూర్:** భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం పట్ల ప్రపంచ దేశాధినేతలు సైతం తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక మంత్రిగా, ప్రధానిగా చేసిన సేవల్ని స్మరించుకుంటూ ఆయనతో తమకున్న అనుబంధాన్ని పంచుకొంటున్నారు. ఈ క్రమంలోనే మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం.. మన్మోహన్ సింగ్‌తో ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయనలోని గొప్ప మానవీయ కోణం, దయా గుణాన్ని వివరిస్తూ 'ఎక్స్' వేదికగా సుదీర్ఘ పోస్టు పెట్టారు. ఓ కేసులో తాను జైలుకు వెళ్లినప్పుడు తన పిల్లలకు మన్మోహన్ సింగ్ స్కాలర్‌షిప్‌లు ఆఫర్ చేశారని గుర్తు చేసుకున్నారు.

''నా గొప్ప మిత్రుడు మన్మోహన్ సింగ్ మరణించారన్న వార్తతో నా హృదయం దుఃఖంతో నిండిపోయింది. భారతదేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా కీర్తిగడించిన ఆయన గురించి అనేక వ్యాసాలు, పుస్తకాలు ఉంటాయి. ప్రపంచ ఆర్థిక దిగ్గజాల్లో ఒకటిగా భారతదేశం ఆవిర్భవించడంలో ప్రధానిగా ఆయన పాత్ర ఎంతో కీలకం. మేమిద్దరం ఆర్థిక మంత్రులుగా పనిచేశాం. ట్రాన్స్‌ఫర్మేటివ్ విధానాలను ప్రత్యక్షంగా చూసే అరుదైన అవకాశం నాకు దక్కింది. అవినీతికి వ్యతిరేక పోరాటంపై నిబద్ధతను షేర్ చేసుకున్నాం. ఒక ప్రధానమైన కేసును బయటపెట్టడంలోనూ సహకరించుకున్నాం. రాజకీయ నేతగా ఆయన కాస్త ఇబ్బంది పడినా.. దృఢ సంకల్పం కలిగిన గొప్ప రాజనీతిజ్ఞుడిగా రాబోయే తరాలకు స్ఫూర్తినిచ్చే వారసత్వాన్ని ఇచ్చారు. భావితరాలకు ఆయన ఎంతో స్ఫూర్తిదాయకం. నేను జైలుకెళ్లినప్పుడు..

''నా వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయం ఇది. చాలా మందికి తెలియదు. మలేషియన్లకు ఈ విషయాన్ని చెప్పాల్సిన సమయమిది. నేను జైలులో ఉన్నప్పుడు.. మన్మోహన్ సింగ్ నా పట్ల ఎంతో దయతో వ్యవహరించారు. నా పిల్లలకు, మరీ ముఖ్యంగా నా కుమారుడు ఇహ్సాన్‌కు స్కాలర్‌షిప్ ఆఫర్ చేశారు. అయితే, ఆ ఆఫర్‌ను నేను తిరస్కరించాను. ఈ గొప్ప లక్షణం ఆయనలో అసాధారణ మానవత్వం, దాతృత్వం, దయాగుణానికి ప్రతీక. ఆ చీకటి రోజుల్లో నేను జైలులో ఉన్నప్పుడు నాకు నిజమైన స్నేహితుడిగా నిలిచారు. అలాంటి మహోన్నత వ్యక్తిత్వమే ఆయన్ను ఇంకా ప్రత్యేకంగా నిలుపుతోంది. ఈ జ్ఞాపకాలు నా హృదయంలో ఎప్పటికీ గుర్తుండిపోతాయి. గుడ్ బై మిత్రమా.. మై భాయ్, మన్మోహన్'' అని పోస్టులో రాసుకొచ్చారు.

## పీఎం అయినా.. అద్దె మాత్రం ఠంచన్‌గా చెల్లించిన మన్మోహన్..!

**గువాహటి:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సంబంధించిన మరో ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది. అస్సాంలోని గువాహటిలో 1991లో డబుల్ బెడ్‌రూం ఇంటిని అద్దెకు తీసుకున్న ఆయన.. 2019 వరకు దానిని కొనసాగించారు. పలు దఫాలుగా రాజ్యసభ సభ్యుడిగా పనిచేసినా ఆయన ఇంటి అడ్రెస్ ఆ అద్దె ఇల్లే. మధ్యలో పీఎం అయినా.. రెంట్ మాత్రం ఠంచన్‌గా చెల్లించేవారు. ఇంతకీ ఆ స్టోరీ ఏంటంటే..?

1991లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు.. మన్మోహన్ సింగ్‌ను తన ఆర్థిక మంత్రిగా ఎంపిక చేశారు. దాంతో సింగ్ అస్సాం నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. అప్పుడు ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంది. దాంతో ఆ రాష్ట్రంలోకి ఒక బయటివ్యక్తిగా అడుగుపెట్టిన మన్మోహన్ సింగ్.. 2019 వరకు గువాహటిలోని సరుమ్‌త్రియాకు చెందిన నందన్‌నగర్ ప్రాంత వాసుడయ్యారు. ఆ ఏరియాలో రూ.700 పెట్టి ఇంటిని అద్దెకు తీసుకున్నారు. అప్పుడు రాష్ట్ర సీఎంగా ఉన్న హితేశ్వర్ సైకియాకు చెందిన ఇల్లే ఇది. సీఎం వ్యక్తిగత నివాసం వద్దే ఈ అద్దె ఇల్లు ఉండేది. తర్వాత మన్మోహన్ సింగ్, ఆయన సతీమణి దిల్లీ నుంచి మార్చుకొని ఆ ఇంటి చిరునామా మీదే ఓటర్ ఐడీలు తీసుకున్నారు.

''మన్మోహన్ సింగ్ అస్సాం రావడం కొందరికి నచ్చలేదు. ఆయనకు ఈ రాష్ట్రంలో ఎలాంటి చిరునామా లేదన్న కారణంతో రాజ్యసభ నామినేషన్‌ను కోర్టులో సవాల్ చేశారు. అప్పుడే మా డబుల్ బెడ్‌రూం అద్దెకు ఇచ్చాం. అదే వారి వ్యక్తిగత చిరునామాగా మారిపోయింది. ఆయన సాదాసీదా వ్యక్తి.

ఇక్కడకు వచ్చినప్పుడల్లా కుటుంబ విషయాలు మాట్లాడుకునేవాళ్లం. నా భర్త చనిపోయిన తర్వాత ఆ ఇంటి నుంచి మారాలని ఆయనకు పలువురు సూచించారు. కానీ అస్సాంతో బంధాన్ని ఆ ఇల్లే ఏర్పరిచిందని వారి సలహాను సున్నితంగా తిరస్కరించారు. అదే అడ్రెస్‌ను కొనసాగించారు.

అలాగే సమయానికి అద్దె చెల్లించేవారు. ప్రధానమంత్రి బాధ్యతలు స్వీకరించిన తర్వాత రెంట్ పంపడం మర్చిపోలేదు. ఒకసారి ఆయన పంపిన చెక్‌ను మేం క్యాష్ చేసుకోలేదు. దాంతో ఆయన ఒక ఉత్తరం రాసి, నగదు తీసుకోవాలంటూ కొత్త చెక్ పంపారు. ఇలా ఆయన నుంచి ఈతరం నేర్చుకోవాల్సినవి ఎన్నో విషయాలు ఉన్నాయి'' అని సైకియా సతీమణి మీడియాతో మాట్లాడారు. బయటి వ్యక్తిగా అస్సాంలో ప్రయాణం మొదలుపెట్టిన మన్మోహన్ సింగ్ (Manmohan Singh).. ఈశాన్య రాష్ట్ర ప్రధానిగా మారిపోయారు. ఆ రాష్ట్రానికి పలు ప్రాజెక్టులు తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు.

## పాక్ జాతిపిత జిన్నాను తాకిన మన్మోహన్ షాట్..!



**ఢిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కేవలం ఆర్థికవేత్తే కాదు.. హాకీ ప్రియుడు కూడా. దీనికి పాక్ జాతిపిత జిన్నానే సాక్ష్యం. ఈవిషయాన్ని ఓ సందర్భంలో స్వయంగా మన్మోహనే చెప్పారు. ఒకప్పుడు భారత్‌లో క్రికెట్ కంటే హాకీ అంటేనే క్రేజ్ ఎక్కువ. అవిభాజ్య భారత్‌లోని పంజాబ్‌లో మన్మోహన్ సింగ్ జన్మించారు. ప్రస్తుతం ఆ ప్రాంతం పాకిస్థాన్‌లో ఉంది. 1945లో ఆయనకు 13 ఏళ్లు. ఓ రోజు లాహోర్ జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో మన్మోహన్ తన మిత్రులతో కలిసి హాకీ ఆడుతున్నారు. ఆ గ్రౌండ్ పక్కనే ఓ పెద్దాయన వీరి ఆటను వీక్షిస్తున్నారు. ఇంతలో మన్మోహన్ గోల్ పోస్టులోకి కొట్టిన బంతి నేరుగా వెళ్లి ఆ పెద్దాయన తలను తాకింది. ఏం జరిగిందో కొద్దిసేపు ఆయనకు కూడా అర్థం కాలేదు. ఆ పెద్ద మనిషి ఎవరో కాదు. ముస్లిం లీగ్ అగ్రనేత మహమ్మద్ అలీజిన్నా. కళాశాల పొరుగునే ఆయన ఇల్లు ఉంది. ఆడుతోంది చిన్న పిల్లలు కావడంతో జిన్నా కూడా నవ్వి ఊరుకొన్నారు. ఈ సరదా సంఘటనను కొన్నేళ్లక్రితం కర్ణాటకలో ఎన్నికల ప్రచారం వేళ.. బెంగళూరులో స్వయంగా మన్మోహన్ సింగ్ కొందరు విలేకర్లకు వెల్లడించారు. ఈసందర్భంగా సరదాగా స్పందిస్తూ.. ప్రస్తుత రాజకీయ నాయకుల కంటే ముందే మీరు జిన్నాపై దాడి చేశారా అని ప్రశ్నించగా.. మన్మోహన్ తనదైన శైలిలో నవ్వేశారు. అంతకుముందే అలీఘడ్ ముస్లిం లీగ్ విశ్వవిద్యాలయంలో జిన్నా చిత్రపటంపై వివాదం మొదలైంది.



## కేంద్రమంత్రి సన్నిహితుడి ఇంట్లో ఈడీ సోదాలు

**పాట్నా:** కేంద్రమంత్రి, లోక్ జనశక్తి పార్టీ అధ్యక్షుడు చిరాగ్ పాసవాన్ సన్నిహితుడి నివాసంలో శుక్రవారం ఈడీ సోదాలు నిర్వహించింది. బిహార్ రాజధాని పట్నా, దిల్లీ, బెంగళూరులోని పలు ప్రాంగణాల్లో ఈ తనిఖీలు చేపట్టింది. బిహార్ లో ఇసుక మైనింగ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసును ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఈ క్రమంలోనే రాజకీయంగా సంబంధాలున్న పలువురు వ్యక్తులకు చెందిన ప్రాంగణాల్లో సోదాలు జరుగుతున్నాయి. వారిలో ఎల్‌జేపీలో కీలక వ్యక్తిగా చలామణీ అయిన హులాస్ పాండే (Hulas Pandey) కూడా ఉన్నారు. 2012లో సంచలనం సృష్టించిన ఓ హత్య కేసులో ప్రధాన సూత్రధారి హులాస్ అని సీబీఐ అభియోగాలు నమోదు చేసింది. దాంతో 2023లో అతడు పార్టీ పార్లమెంటరీ బోర్డు ఛైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఎల్‌జేపీలో చేరకముందు జనతాదళ్ (యునైటెడ్) పార్టీ సభ్యుడు. ఇక, ఎన్డీయే కూటమిలో ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ మంత్రిగా చిరాగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## మన్మోహన్ సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించేందుకు సీడబ్ల్యూసీ సమావేశం



**ఢిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు శ్రద్ధాంజలి ఘటించేందుకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమైంది. కాంగ్రెస్ పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే , కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్మన్ సోనియాగాంధీ , లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీతోపాటు ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు.మన్మోహన్ సింగ్ మృతికి సీడబ్ల్యూసీ తీవ్ర విచారం వ్యక్తం చేసింది. సీడబ్ల్యూసీ నేతలు మన్మోహన్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొంది.

## మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ భారత ఆర్థికవ్యవస్థకు రూపశిల్పి : మాజీ రాష్ట్రపతి



**ఢిల్లీ:** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ తీవ్ర సంతాపం తెలియజేశారు. మన్మోహన్ సింగ్ భారత ఆర్థిక వ్యవస్థకు రూపశిల్పి అని ఆయన అభివర్ణించారు. మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరనిలోటు మాత్రమే కాదని, వ్యక్తగతంగా తనకు కూడా లోటేనని అన్నారు. ఆయన తనకు చాలాకాలంగా తెలుసని, పొలైట్‌నెస్‌కు ఆయన గొప్ప ఉదాహరణ అని పేర్కొన్నారు.ఆయన భారత ఆర్థిక వ్యవస్థకు రూపశిల్పిగా తాను భావిస్తానని, తాను ఆయనకు నివాళులు అర్పిస్తున్నానని రామ్‌నాథ్ కోవింద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక సెల్ఫీ వీడియోను రిలీజ్ చేశారు. వృద్ధాప్య సంబంధ అనారోగ్యంతో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గురువారం సాయంత్రం ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో కన్నుమూశారు.

## మన్మోహన్ సింగ్‌కు నివాళులర్పించిన సోనియా, ఖర్గే, రాహుల్, ప్రియాంక

**ఢిల్లీ:** మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ పార్థివ దేహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పిస్తున్నారు . ఇప్పటికే రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు నివాళులర్పించిన విషయం తెలిసిందే. తాజాగా కాంగ్రెస్ అగ్రనాయకులు మాజీ ప్రధానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ , రాహుల్ గాంధీ , ప్రియాంక గాంధీ వాద్రా, రాబర్ట్ వాద్రా శుక్రవారంఉదయం మన్మోహన్ నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా దేశానికి మన్మోహన్ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.



# మారుతీ 800 కారంటే మన్మోహన్‌కు ఇష్టం !




న్యూఢిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు .. మారుతీ 800 కారంటే అమితమైన ఇష్టం. ఆయన ప్రధానిగా ఉన్న సమయంలో.. ఐపీఎస్ ఆఫీసర్ అరుణ్ అసిమ్.. మన్మోహన్‌కు స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ చీఫ్‌గా చేశారు. మన్మోహన్ మారుతీ 800 కారును చాలా ఇష్టపడేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం యూపీలోని కన్నౌజ్ సర్దార్ నుంచి అసిమ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. మన్మోహన్ చాలా సింపుల్‌గా ఉండేవారన్నారు. ఆయనకు ఒకే ఒక్క స్వంత కారు ఉండేదని, అది మారుతీ 800 కారు అని తెలిపారు. ప్రధాని ఇంటి వద్ద .. బీఎండబ్ల్యూ బుల్లెట్ ప్రూఫ్ కారుకు సమీపంలోనే ఆ మారుతీ కారు పార్క్ అయి ఉండేది. ఇది నా కారు, నా స్వంత కారు అని మన్మోహన్ ఎప్పుడూ చెప్పేవారని అసిమ్ గుర్తు చేశారు.2004 నుంచి 2007 మధ్య కాలంలో ఎస్పీజీ ప్రొటెక్షన్ టీమ్‌లో అరున్ చేశారు. అయితే మధ్యతరగతి కుటుంబానికి చెందిన మన్మోహన్.. ఆయన తన మూలాలను మరిచేవారు కాదన్నారు. బీఎండబ్ల్యూ ఉన్నా.. ఆయన తన మారుతీ కారుకే అధిక ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు. సాధారణ ప్రజల గురించి మన్మోహన్ ఎప్పుడు ఆలోచించేవారని అరుణ్ తెలిపారు. బీఎండబ్ల్యూ కారు లగ్జరీ కోసం కాదు, సెక్యూర్టీ కోసం అని మన్మోహన్‌కు చెప్పేవాడినన అసిమ్ తెలిపారు. అయితే ఆ సమయంలో.. ఖరీదైన కారు ప్రధానికి చెందుతుందని, కానీ మారుతి కారు మాత్రం తనదే అని చెప్పేవారని గుర్తు చేశారు.మన్మోహన్ సింగ్ గురువారం ఢిల్లీలో మరణించారు. ఆయనకు రేపు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. శుక్రవారం ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులు ఆయన మృతికి నివాళి అర్పించారు.







మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) గురువారం కన్నుమూసిన విషయం తెలిసిందే. అతి సాధారణ కుటుంబంలో జన్మించిన మన్మోహన్.. దేశ అత్యున్నత స్థానానికి చేరుకున్నారు. ప్రధానిగా పదేళ్లు సేవలందించారు. యూపీఏ హయాంలో 2004 నుంచి 2014 వరకూ ప్రధానిగా పనిచేశారు. ఇక 33 ఏళ్లపాటు రాజ్యసభ సభ్యుడిగా కొనసాగారు. మన్మోహన్ భారత ఆర్థిక విధానాలపై చెరగని ముద్ర వేశారు. ఆర్థిక సంక్షోభం నుంచి భారత్‌ను గట్టెక్కించడమే కాకుండా, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దేశాన్ని నిలిపారు. ఈనేపథ్యంలో మన్మోహన్ సింగ్ పై విశ్వంభర ప్రత్యేక కథనం...

# భారతావని గేమ్ ఛేంజర్

## అజాత శత్రువు..చేతల మహర్షి

**భారత ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించిన ఆర్థిక సంస్కర్త**

**తాను ఏటికి ఎదురీది.. దేశాన్ని ఒడ్డున పడేసిన మేధావి**

**ఆధార్, ఆర్టీఐ,ఉపాధి చట్టాలతో పాటు అనేక సంస్కరణలను తీసుకొచ్చి**

**దేశానికి సరికొత్త దశ, దిశ చూపిన ప్రధాని**

**మన్మోహన్ హయాంలోనే తెలంగాణ ఆవిర్భావం**

మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ భారత ఆర్థిక విధానాలపై చెరగని ముద్ర వేశారు. ఆర్థిక సంక్షోభం నుంచి భారత్‌ను గట్టెక్కించడమే కాకుండా, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దేశాన్ని నిలిపారు. ప్రధానిగా పదేళ్లు సేవలందించిన ఆయన దేశ చరిత్రలో ఎన్నో కఠినమైన నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానిగా పని చేసినప్పుడు ఆయనను మౌనమునిగా ప్రతిపక్షాలు విమర్శించేవి. మన్మోహన్ సింగ్ కాస్త నెమ్మదైన మనిషే! కానీ ఆయన ఆలోచనలు పాదరసంలాంటివి. మౌనంగా ఉంటూనే పదేళ్లపాటు దేశాన్ని సమర్థవంతంగా ముందుకు నడిపించిన ఘనత ఆయనకే దక్కుతుంది. దేశాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. దేశానికి సరికొత్త దశ, దిశ చూపిన ప్రధానిగా చరిత్రలో నిలిచిపోయారు. ఎక్కడా పెద్దగా మాట్లాడకుండానే 2004 నుంచి 2014 వరకు దేశాన్ని ఆయన సమర్థంగా ముందుకు నడిపించారు.2004 నుంచి 2014 వరకు భారత ప్రధానిగా సేవలందించిన మన్మోహన్ సింగ్ మొదటి పర్యాయంలోనే దేశంలో ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారు. పైకి మృదుస్వభావిలా కనిపించినా దేశం కోసం తీసుకునే నిర్ణయాల్లో అత్యంత కఠినంగా వ్యవహరించారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పాటు, ఉపాధి హామీ పథకం ప్రారంభం వంటి ఎన్నో కీలక పరిణామాలు ఆయన ప్రధానిగా ఉన్నప్పుడే చోటుచేసుకున్నాయి. 2008లో చారిత్రాత్మకమైన భారతదేశం-అమెరికా పౌర అణు ఒప్పందంపై సంతకం చేశారు. భారతదేశం ప్రపంచ అణు మార్కెట్లోకి ప్రవేశించడానికి, ఇంధన సంక్షోభాన్ని అధిగమించడానికి ఈ ఒప్పందం దోహదపడింది. యూపీఏ ప్రభుత్వానికి బయటి నుంచి మద్దతిచ్చిన లెఫ్ట్ పార్టీలు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. మద్దతు ఉపసంహరించుకున్నాయి. అయినా మన్మోహన్ సింగ్ ఎక్కడా వెనక్కి తగ్గలేదు. అవసరమైతే ప్రధాని పదవికి రాజీనామా చేసేందుకు కూడా సిద్ధమయ్యారు.

**అర్ధరాత్రి వచ్చిన ఫోన్‌కాల్..**
**రాజకీయ నాయకుడిని చేసింది..**

యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్ అనగానే మన్మోహన్ సింగ్ గుర్తుకొస్తారు. అయితే.. ''నేను యాక్సిడెంటల్ ప్రధాన మంత్రినే కాదు.. యాక్సిడెంటల్ ఆర్థికశాఖ మంత్రిని కూడా'' అని ఓ సందర్భంలో ఆయనే చెప్పుకొచ్చారు. తాను రాజకీయాల్లోకి వస్తానని మన్మోహన్ ఎప్పుడూ ఊహించలేదు. అర్ధరాత్రి సమయంలో వచ్చిన ఓ ఫోన్‌కాల్ తనను రాజకీయనాయకుడిని చేస్తుందనిగానీ, భారత ఆర్థిక వ్యవస్థను, తన కెరీర్‌ను సమూలంగా మార్చేస్తుందనిగానీ అప్పుడు ఆయనకు తెలియదు.1991లో పీవీ నరసింహారావు ప్రధానమంత్రి బాధ్యతలు చేపట్టిన సమయానికి దేశం దివాలా అంచున ఉంది. రాజకీయ సంక్షోభం తారస్థాయికి చేరుకుంది. సోవియట్ యూనియన్ పతనంతో కేవలం భారత్ మాత్రమే కాదు.. యావత్ ప్రపంచం సంక్షోభం దిశగా అడుగులు వేస్తున్న సమయమది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఛైర్మన్ హోదాలో నెదర్లాండ్స్‌లో నిర్వహించిన ఓ సదస్సుకు వెళ్లిన మన్మోహన్‌సింగ్.. పర్యటన ముగించుకొని తిరిగి వచ్చారు. ఇంట్లో నిద్రిస్తుండగా.. ప్రధాని ముఖ్యకార్యదర్శిగా పని చేస్తున్న పీసీ అలెగ్జాండర్ నుంచి అర్ధరాత్రి సమయంలో ఊహించని ఫోన్ కాల్ వచ్చింది. ఆర్థిక శాఖ మంత్రిగా ఆయన్ని కేంద్ర కేబినెట్‌లోకి తీసుకోబోతున్నట్లు దాని సారాంశం. పనులన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఆ క్రెడిట్ అందరూ తీసుకుంటారని, లేదంటే పదవి నుంచి తొలగిస్తారని నవ్వుతూ చెప్పారు అలెగ్జాండర్.బిత్తరపోయిన మన్మోహన్ కాసేపు తనని తాను నమ్మలేకపోయారట. '' నేను ఆర్థిక మంత్రిగా పని చేయడమేంటి?'' అని అనుకున్నారట. ఈ విషయాన్ని ఆయన కుమార్తె దమన్ సింగ్ రాసిన 'స్ట్రిక్ట్‌లీ పర్సనల్: మన్మోహన్ అండ్ గురుశరణ్' పుస్తకంలో ప్రస్తావించారు. 1991, జూన్ 21న రాష్ట్రపతిభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మన్మోహన్ సింగ్ ఆర్థికశాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆర్థిక మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సంస్కరణల దిశగా అడుగులు వేశారు.

**ఆయన హయాంలోనే ఆధార్ కార్డుల జారీ, సమాచార హక్కు చట్టం..**

మన్మోహన్ సింగ్ పాలనా కాలంలోనే దేశంలో 3జీ, 4జీ సేవల ప్రారంభంతో మొబైల్ సాంకేతిక విప్లవం ఊపందుకుంది. ఆధార్ కార్డుల జారీ మొదలైందీ ఆయన హయాంలోనే. మన్మోహన్ సర్కారు గ్రామీణ పేదలకు ఏడాదికి 100 రోజుల పనికి గ్యారెంటీ కల్పిస్తూ ఉపాధి హామీ పథకాన్ని తీసుకొచ్చింది. వివిధ పథకాల కింద నగదు సాయాన్ని ఆధార్





అనుసంధానమైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా బదిలీ చేసే (డీబీటీ) ప్రక్రియను ప్రారంభించింది. ప్రైవేటు పాఠశాలల్లోనూ కొందరు పేద విద్యార్థులు ఉచితంగా చదువుకునేలా నిబంధనలు రూపొందించింది. సామాన్యుడి చేతికి పాశుపతాస్త్రంలాంటి సమాచార హక్కును అందించింది.

**జాతీయ దర్యాప్తు సంస్థ అవతరణ**

భూసేకరణ చట్టాన్ని ఆధునికీకరించి.. ప్రభుత్వ పథకాలు, మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో భూములు కోల్పోయే బాధితులకు అధిక పరిహారం, పునరావాసం అందించేలా మన్మోహన్ చర్యలు తీసుకున్నారు. ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ఆయన హయాంలోనే అవతరించింది. తన మైనార్టీ ప్రభుత్వానికి వామపక్షాలు మద్దతు ఉపసంహరించుకొని హెచ్చరికలు జారీ చేసినా వెరవకుండా అమెరికాతో అణు ఒప్పందం చేసుకున్న ధైర్యశాలి మన్మోహన్. పార్టీ అధినాయకురాలిగా సోనియాగాంధీ బలంగా ఉన్నప్పటికీ, నేతలంతా ఆమె కనుసన్నల్లోనే నడుచుకున్నప్పటికీ.. ఎక్కడా తన మాటకు విలువ తగ్గకుండా, దేశ గౌరవాన్ని తగ్గించకుండా చాకచక్యంగా ప్రధానమంత్రి పదవీ బాధ్యతలను నిర్వర్తించారు మన్మోహన్.

**కుంభకోణాలు కుదిపేసినా..**

ప్రధానిగా మన్మోహన్ పదేళ్ల పదవీకాలంలో ఎన్నో సంక్షోభాలు తలెత్తాయి. ఆయన సర్కారుపై విమర్శలు, కుంభకోణాల ఆరోపణలు వెల్లువెత్తాయి. 2జీ, బొగ్గు, కామన్‌వెల్త్, ఆదర్శ్.. ఇలా చాలా కుంభకోణాలు ఆయన ప్రభుత్వాన్ని అతలాకుతలం చేశాయి. అయినప్పటికీ మన్మోహన్‌పై నేరుగా ఎవరూ వేలెత్తి చూపలేదు. 2008 నాటి ముంబయి ఉగ్రదాడి, 2012లో ఢిల్లీలో జరిగిన నిర్భయ ఘటన, అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమం దేశాన్ని ఊపేశాయి. అయినా ఎవరూ మన్మోహన్‌కు నిందల్ని ఆపాదించే సాహసం చేయలేదు.

**తెలంగాణ బిల్లును గట్టెక్కించి..**

తన ప్రభుత్వానికి పూర్తిస్థాయి మెజార్టీ లేకున్నా రాజ్యసభలో మహిళా రిజర్వేషన్ బిల్లుకు మన్మోహన్ ఆమోద ముద్ర వేయించారు. అత్యంత వ్యూహాత్మకంగా తెలంగాణ బిల్లునూ ఉభయసభల్లో గట్టెక్కించారు. ఢిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయం ఆయన హయాంలోనే రూపుదిద్దుకొంది. ఢిల్లీకి మరోవైపు జేవర్ ఎయిర్‌పోర్టుకూ భూసేకరణ చేపట్టి పునాదులు వేశారు. దేశ రాజధానితోపాటు చాలా నగరాల్లో మెట్రో రైలును విస్తరించారు. మన్మోహన్ హయాంలోనే ప్రతిభాపాటిల్ రాష్ట్రపతి పీఠమెక్కారు. తొలిసారి ఒక మహిళను దేశ అత్యున్నత స్థానంలో కూర్చోబెట్టిన ఘన కీర్తి ఆయన సర్కారుదే! మన్మోహన్ హయాంలోనే సేల్స్ ట్యాక్స్ స్థానంలో వ్యాట్ ప్రవేశపెట్టారు. జీఎస్‌టీ విధానాన్ని తెరమీదకు తీసుకొచ్చి.. రాష్ట్రాల మధ్య సమన్వయ సాధనకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఆయన ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య సేవలకు సంబంధించిన మౌలిక వసతులు పెంపొందించడానికి నేషనల్ రూరల్ హెల్త్ మిషన్‌ను ప్రారంభించింది. పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపరచడానికి జవహర్‌లాల్ నెహ్రూ అర్బన్ రెన్యూవల్ మిషన్‌ను ప్రారంభించి ఏడేళ్లలో 20 బిలియన్ డాలర్లు ఖర్చు చేసింది.

**రూ.72 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత మన్మోహన్ ప్రభుత్వానిదే..**

దేశంలో 3 కోట్లమంది చిన్న, సన్నకారు రైతులకు రూ.72 వేల కోట్ల రుణమాఫీ చేసిన ఘనత మన్మోహన్ ప్రభుత్వానికి దక్కుతుంది. రుణమాఫీపై ఆయన సర్కారు తీసుకున్న సాహసోపేత నిర్ణయం కారణంగానే 2009లో యూపీయే వరుసగా రెండోసారి అధికారంలోకి రాగలిగింది. దాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఆ తర్వాత చాలా రాష్ట్ర ప్రభుత్వాలు రైతు రుణమాఫీ హామీతో ఎన్నికలకు వెళ్లి గెలిచాయి. మన్మోహన్ హయాంలోనే విదర్భ, బుందేల్‌ఖండ్ ప్రాంతాల్లో రైతు ఆత్మహత్యల నివారణ కోసం ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించారు.

**మోదీ సర్కార్‌పై మండిపడ్డ మన్మోహన్..**

వృద్ధాప్య సమస్యలతో క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ.. కొన్ని నెలల క్రితం జరిగిన సార్వత్రిక ఎన్నికల వేళ మాత్రం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తన గళాన్ని వినిపించారు. పాలక పక్షం విధానాలు, ప్రధాని మోదీ వైఖరిని ఓ లేఖ రూపంలో దుయ్యబట్టారు. లోక్‌సభ తుది దశ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో దానిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పై మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల ప్రచారంలో విద్వేషపూరిత, అనుచిత ప్రసంగాలతో ప్రధాని కార్యాలయం హుందాతనాన్ని తగ్గించారని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షిస్తూ అభివృద్ధిదాయకమైన ఉజ్వల భవిష్యత్తుకు కాంగ్రెస్ పార్టీ మాత్రమే భరోసా ఇవ్వగలదని తెలిపారు. ''యువతలో దేశభక్తి, సాహసం, సేవానిరతి నాలుగేళ్ల పాటు మాత్రమే ఉంటాయని బీజేపీ భావిస్తోంది. ఇది వారి బూటకపు జాతీయవాదానికి నిదర్శనం'' అంటూ మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్నివీర్ పథకాన్ని ఎండగట్టారు.''ఎన్నికల ప్రచారంలో మోదీ ప్రసంగాలన్నీ విభజన, విద్వేష స్వభావం కలిగినవే. బహిరంగ ప్రసంగాల గౌరవాన్ని, ప్రధానమంత్రి కార్యాలయం హుందాతనాన్ని దిగజార్చారు. ఓ వర్గాన్ని కానీ, విపక్షాలను కానీ లక్ష్యంగా చేసుకొని గతంలో ఏ ప్రధాని కూడా ఇటువంటి ప్రసంగాలు చేయలేదన్నారు.

## భారత ఆర్థిక వ్యవస్థను పరుగులు పెట్టించిన మన్మోహన్..

1991లో దేశం కఠినమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రధానిగా ఎన్నికైన పీవీ నరసింహారావు .. ఆర్బీఐ గవర్నర్‌గా ఉన్న మన్మోహన్ సింగ్‌కు అనూహ్యంగా తన క్యాబినెట్‌లో చోటు కల్పించి ఆర్థిక మంత్రిని చేశారు. ఈ నిర్ణయం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. బ్యాంకింగ్ రంగంలో అనేక ఆర్థిక సంస్కరణలు చేపట్టిన మన్మోహన్‌సింగ్ భుజాలపై దుర్భర స్థితిలో ఉన్న దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ఠపరిచే బాధ్యతను ఉంచారు. ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి పెద్ద మార్పులు తీసుకురావడానికి మన్మోహన్‌సింగ్‌కు పీవీ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. అప్పటి నుంచి వారిద్దరూ కలిసి దేశ ఆర్థిక రథాన్ని పరుగులు పెట్టించారు. 1991 లో ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ ప్రవేశపెట్టిన ఆయన తొలి బడ్జెట్‌ను గేమ్ ఛేంజర్ బడ్జెట్ అని పిలుస్తారు. దిగుమతి-ఎగుమతి విధానాన్ని మార్చడం ద్వారా మన్మోహన్‌సింగ్ భారత ఆర్థిక వ్యవస్థను ప్రపంచానికి తెరిచారు. ఈ బడ్జెట్ కారణంగా, భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఊపందుకున్నది. దేశంలో ఆర్థిక సంస్కరణలను ముందుకు తీసుకెళ్లేందుకు బ్లూప్రింట్ సిద్ధం చేయబడింది. దీనికి ముందు దేశ ఆర్థిక వ్యవస్థ అనేక కారణాల వల్ల వెనుకబడి ఉన్నది. స్టాక్ మార్కెట్ కుంభకోణాలు, చైనా, పాకిస్తాన్‌తో యుద్ధాలు, దిగుమతుల కోసం సంక్లిష్టమైన లైసెన్సింగ్ వ్యవస్థలు, విదేశీ మూలధన పెట్టుబడులపై ప్రభుత్వ ఆంక్షలు వంటి అనేక అంశాలు ఆర్థిక వ్యవస్థ వృద్ధిని నిలిపివేశాయి.మన్మోహన్ సింగ్ సరళీకరణ, ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ అనే మూడు విభాగాల్లో కీలక మార్పులు తీసుకొచ్చారు. దాంతో పాటు దిగుమతి-ఎగుమతి విధానంలో మార్పులు చేశారు. దిగుమతి లైసెన్స్ ఫీజు తగ్గించి, ఎగుమతులను ప్రోత్సహించేలా నిర్ణయం తీసుకున్నారు. కస్టమ్ డ్యూటీ 220 శాతం నుంచి 150 శాతానికి తగ్గింది. బ్యాంకులపై ఆర్‌బీఐ నియంత్రణను తగ్గించారు. డిపాజిట్లు, రుణాలపై వడ్డీ రేటు, రుణ మొత్తాన్ని నిర్ణయించే అధికారం బ్యాంకులకు ఇచ్చారు. దేశంలో బ్యాంకుల విస్తరణకు దారితీసేలీ ప్రైవేట్ బ్యాంకులు ప్రారంభించేందుకు నిబంధనలను సడలించారు. లైసెన్స్ రాజ్‌ను రద్దు చేసింది. దాదాపు 18 పరిశ్రమలు మినహా అందరికీ లైసెన్స్ అవసరాన్ని తొలగించారు. ఈ మార్పులు అంతర్జాతీయ మార్కెట్‌తో నేరుగా భారతీయ పరిశ్రమలకు పోటీకి తలుపులు తెరిచాయి. ఈ సంస్కరణల ఫలితంగా మరుసటి దశాబ్దంలో భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందింది.దీంతో పీవీ-మన్మోహన్ జోడీ వ్యతిరేకతను ఎదురీది దేశాన్ని సంక్షోభ సుడిగుండం నుంచి ఒడ్డుకు చేర్చింది. ఆర్థిక వ్యవస్థను సరళతరం చేయడం ద్వారా సమూల మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రధాని పీవీ నరసింహారావు కొన్నిసార్లు సందేహం వ్యక్తం చేసేవారని, ఆయన్ని ఒప్పించి మన్మోహన్ ముందుకెళ్లేవారట.



## తాను ఏటికి ఎదురీది.. దేశాన్ని ఒడ్డున పడేసి..!

ఆధునిక భారత్‌ను మేలిమలుపు తిప్పిన 1991 బడ్జెట్‌పై మన్మోహన్ సింగ్‌కు సొంత పార్టీ నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ముఖ్యంగా ఎరువులు, పెట్రోల్, ఎల్పీజీ ధరలను పెంచడం చాలామంది ఎంపీలకు మింగుడు పడలేదు. కానీ, మన్మోహన్ మాత్రం ఆ వ్యతిరేకతను చాలా కూల్‌గా ఎదుర్కొన్నారు. పార్టీ మీటింగ్‌లో నాటి ప్రధాని పీవీ నరసింహారావు కూడా సభ్యులను ఒప్పించే భారం మన్మోహన్‌పై వేసి మౌనంగా కూర్చొన్నారు. ఈనేపథ్యంలో మన్మోహన్ తోటి సభ్యులను ఒప్పించి.. మెప్పించి ముందడుగు వేశారు. అప్పటివరకు అన్నింటికీ లైసెన్స్‌లు తీసుకోవాలని అలవాటు చేసిన అధికారుల విధానాన్ని తొలగించకుండా మర్నాడు ముందస్తుగా ఎటువంటి షెడ్యూల్ లేకుండానే ఆయన ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ రాసిన 'టు ది బ్రింక్ అండ్ బ్యాక్: ఇండియా'స్ 1991 స్టోరీ'లో వెల్లడించారు.ఆ విలేకర్ల సమావేశంలో తన బడ్జెట్‌లోని అంశాలను మన్మోహన్ స్పష్టంగా వివరించారు. దానిని 'బడ్జెట్ విత్ హ్యూమన్ ఫేస్'గా అభివర్ణించారు. తీవ్ర విమర్శల మధ్య కూడా ఎరువులు, పెట్రోల్, ఎల్పీజీ ధరల పెంపును సమర్థించారు. మరోవైపు సొంత పార్టీ నేతల్లో వచ్చిన అసంతృప్తిని నాటి ప్రధాని నరసింహారావు గమనించి.. ఆగస్టు1న కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ మీటింగ్ ఏర్పాటుచేశారు. ఎంపీలు తమ ఆగ్రహం, అసంతృప్తిని బహిరంగంగా వెళ్లగక్కేందుకు అవకాశం ఇచ్చారు. వాటిని మన్మోహన్ నేరుగా ఎదుర్కొని సమాధానం చెప్పేలా నరసింహారావు మౌనంగా ఉన్నారు. ఈ సమావేశం 2, 3 తేదీల్లో ఇది సుదీర్ఘంగా కొనసాగింది. వాటిల్లో కూడా ప్రధాని పాల్గొన్నారు. ఈసందర్భంగా మన్మోహన్‌కు కేవలం మణిశంకర్ అయ్యర్, నాథూరామ్ మిర్ధా నుంచి మాత్రమే మద్దతు లభించింది. ఇది రాజీవ్‌గాంధీ ఆకాంక్షలకు తగినట్లు ఉందని నాడు అయ్యర్ వర్ణించారు. సభ్యులను శాంతపర్చేందుకు నాడు మన్మోహన్ ఎరువుల ధరల్లో స్వల్ప తగ్గింపును చేశారు. ఎల్పీజీ, పెట్రోల్ ధరల్లో మాత్రం రాజీ పడలేదు. పార్టీ సమావేశాలు ముగియగానే ఆగస్టు 4వ తేదీ నుంచి కేబినెట్ కమిటీ ఆన్ పొలిటికల్ అఫైర్స్ భేటీలు మొదలయ్యాయి. ఇవి రెండ్రోజులపాటు జరిగాయి. లోక్‌సభలో ఆర్థిక మంత్రి ప్రకటనపై చర్చించారు. చివరికి బడ్జెట్ ప్రతిపాదనలను వెనక్కి తీసుకొనే డిమాండ్లను కొట్టిపారేసి.. చిన్న రైతుల ప్రయోజనాలు కాపాడటానికి కట్టుబడినట్లు పేర్కొన్నారు. మొత్తం మీద అన్ని పక్షాలను శాంతపరుస్తూనే.. ఎరువుల ధరలపై నియంత్రణ తొలగింపును కొనసాగించగలిగారు.వాస్తవానికి బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిన జులై నాటికి భారత విదేశీ మారకద్రవ్యం పూర్తిగా అడుగంటింది. దీంతో ఆ నెల ఆర్‌బీఐ తన వద్ద ఉన్న 41 టన్నుల బంగారాన్ని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ వద్ద కుదవపెట్టి విదేశీ మారక ద్రవ్యాన్ని తెచ్చుకొంది. ఇది కూడా కొన్నాళ్లు మాత్రమే దేశ అవసరాలు తీర్చగలదు. ని ఆ పుస్తకంలో దమన్ సింగ్ ప్రస్తావించారు.మన్మోహన్ చాలా పరిశ్రమలకు లైసెన్స్ నియంత్రణల నుంచి విముక్తి కల్పించారు. గుత్తాధిపత్యం, నిర్బంధ వ్యాపార విధానానికి సంబంధించిన చట్టాలను సవరించారు. కొత్త పన్నుల విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. ప్రభుత్వరంగ సంస్థల ఆధిపత్యాన్ని చాలా వరకు తగ్గించారు.

# బాక్సింగ్ డే టెస్టులో కష్టాల్లో భారత్

- ముగిసిన రెండో రోజు ఆట ఆఖర్లో తడబాటు..
- భారత్ స్కోరు 164/5



**మెల్‌బోర్న్:** బాక్సింగ్ డే టెస్టులోనూ భారత్ కష్టాల్లో పడింది. మరోసారి ఫాలోఆన్ గండం నుంచి బయటపడాలంటే వందకుపైగా పరుగులు చేయాల్సిన పరిస్థితి. ఇప్పటికే సగం వికెట్లను కోల్పోయిన భారత్‌కు మూడో రోజు తొలి సెషన్ అత్యంత కీలకం కానుంది. ఆసీస్ బ్యాటర్లు విజృంభించిన పిచ్‌పై భారత ఆటగాళ్లు తడబాటు కావడం అభిమానులను నిరాశకు గురి చేసింది. ఇన్నింగ్స్ కుదుటపడిందనుకొనేలోపే వరుసగా వికెట్లను సమర్పించి ఇబ్బందులను కొనితెచ్చుకుంది.

మెల్‌బోర్న్ వేదికగా ఆస్ట్రేలియా భారత్ జట్ల మధ్య నాలుగో టెస్టు జరుగుతోంది. రెండోరోజు ఆట ముగిసే సమయానికి భారత్ 46 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 164 పరుగులు చేసింది. క్రీజ్‌లో రిషభ్ పంత్ (6*), రవీంద్ర జడేజా (4*) ఉన్నారు. ఆసీస్ బౌలర్లలో కమిన్స్, బోలాండ్ చెరో రెండు వికెట్లు తీశారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 474 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. టీమ్‌ఇండియా ఇంకా 310 పరుగుల వెనకంజలో ఉంది. ఫాలో ఆన్‌ను తప్పించుకోవాలంటే మరో 111 పరుగులు చేయాలి.

**ఆ రనౌట్‌తో మలుపు..**

భారత ఇన్నింగ్స్‌లో రనౌట్ కీలక మలుపుగా మారింది. ఓపెనర్, కెప్టెన్ రోహిత్ శర్మ (3) విఫలమైనప్పటికీ.. కేఎల్ రాహుల్ (24) కాసేపు క్రీజ్‌లో పాతుకుపోయాడు. మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ (82) ఆరంభంలో ఆచితూచి ఆడాడు. కాస్త కుదురుకున్నాక బ్యాట్‌ను ఝుళిపించాడు. కేఎల్‌తో కలిసి రెండో వికెట్‌కు 43 పరుగులు జోడించాడు. ఇలాంటి సమయంలో కేఎల్‌ను కమిన్స్ అద్భుతమైన బంతికి క్లీన్‌బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత యశస్వితో విరాట్ కోహ్లీ (36) కలిశాడు. వీరిద్దరూ ఆసీస్ బౌలింగ్‌ను చిత్తు చేసి పరుగులు రాబట్టారు. సెంచరీ భాగస్వామ్యం నమోదు చేశారు. ఈక్రమంలో యశస్వి జైస్వాల్ కెరీర్‌లో 9వ అర్ధ శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అయితే, బోలాండ్ బౌలింగ్‌లో మిడాన్ వైపుగా బంతిని కొట్టిన యశస్వి పరుగు కోసం నాన్‌స్ట్రైకింగ్ ఎండ్‌కు పరుగెత్తాడు. కోహ్లీ మాత్రం వద్దని వారించి వెనక్కి మళ్లాడు. అప్పటికే యశస్వి ఇటువైపు వచ్చేశాడు. మిడాన్ ఫీల్డర్ కమిన్స్ నేరుగా స్ట్రైకింగ్ వైపు బంతిని విసిరాడు. వికెట్ కీపర్ బంతిని తీసుకొని స్టంప్స్‌ను గిరాటేశాడు. సెంచరీ చేసే అవకాశం కోల్పోవడంతో యశస్వి నిరాశగా పెవిలియన్‌కు చేరాడు.

**మళ్లీ ఆ బలహీనతకే వికెట్..**

ఈ సిరీస్‌లో ఆఫ్‌సైడ్ బంతిని ఆడి ఇప్పటివరకు ఔటైన కోహ్లీ మరోసారి తన బలహీనతకే పెవిలియన్‌బాట పట్టాడు. ఆరంభంలో ఆఫ్‌సైడ్ బంతులను వదిలేసి 'క్రమశిక్షణ' పాటించాడని అనుకున్న తరుణంలో.. బోలాండ్ వేసిన ఆఫ్ సైడ్ బంతిని కదిలించి వికెట్ కీపర్ చేతికి చిక్కాడు. యశస్వి రనౌట్‌తోపాటు విరాట్ బ్యాటింగ్ చేస్తున్నంతసేపూ మెల్‌బోర్న్ మైదానం తన నామస్మరణతో హోరెత్తిపోవడంతో ఏకాగ్రతను కోల్పోయినట్లు ఉన్నాడని క్రికెట్ విశ్లేషకుల అభిప్రాయం. నైట్ వాచ్‌మన్‌గా వచ్చిన ఆకాశ్ దీప్ (0) రెండు ఓవర్లపాటు క్రీజ్‌లో ఉన్నా పరుగుల ఖాతా తెరవలేదు. బోలాండ్ బౌలింగ్‌లో నాథన్ లైయన్ అద్భుతంగా క్యాచ్ పట్టడంతో ఆకాశ్ ఔటయ్యాడు.



## మన్మోహన్ సింగ్‌కు టీమ్‌ఇండియా ఘన నివాళి

**- నల్ల బ్యాండ్‌లతో బరిలోకి**

**మెల్‌బోర్న్:** భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలువురు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు మాజీ ప్రధాని మృతి పట్ల సంతాపం తెలియజేస్తున్నారు. ప్రస్తుతం మెల్‌బోర్న్‌లో ఉన్న భారత క్రికెట్ జట్టు సైతం మన్మోహన్‌కు నివాళులర్పించింది.ఆయన గౌరవార్థం మెల్‌బోర్న్ టెస్ట్‌లో రెండో రోజు టీమ్ ఇండియా ఆటగాళ్లంతా చేతికి నల్లబ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు. ఈ మేరకు ఆటగాళ్లు నల్ల బ్యాండ్‌లతో ఉన్న ఫొటోలను బీసీసీఐ ఎక్స్ వేదికగా పోస్టు చేసింది. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.మెల్‌బోర్న్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్ రెండో రోజు టీమ్ ఇండియా రెండు వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేసింది. ఓపెనర్ జైశ్వాల్ ఆఫ్ సెంచరీ చేశారు. ఆస్ట్రేలియా 474 రన్స్‌కు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఆలౌటైంది.

## కోహ్లీపై ఆసీస్ మీడియా హెడ్‌లైన్లు.. ఘాటుగా స్పందించిన రవిశాస్త్రి

**ముంబయి:** మెల్‌బోర్న్ టెస్టు ప్రారంభమైనప్పటినుంచి భారత ఆటగాడు విరాట్ కోహ్లీ వార్తల్లో నిలుస్తున్నాడు. ఆస్ట్రేలియా ప్లేయర్ కాన్‌స్టాస్‌తో వాగ్వాదం జరిగిన సంగతి తెలిసిందే. కోహ్లీకి ఐసీసీ 20 శాతం జరిమానా విధించింది. ఈక్రమంలో ఆసీస్ మీడియా విరాట్ కోహ్లీని లక్ష్యంగా చేసుకొంది. ప్రధాన ఎడిషన్లలో అతడి ఫొటోలను ప్రచురించింది. 'క్లౌన్ కోహ్లీ' (జోకర్ అనే అర్థంలో) అంటూ హెడ్‌లైన్లను పెట్టింది. దీనిపై భారత మాజీ క్రికెటర్ రవిశాస్త్రి ఘాటుగా స్పందించాడు.

"స్వదేశంలో ఆస్ట్రేలియా ఇలానే స్పందిస్తుందని తెలుసు. ఇదే సమయంలో మన ఆటగాళ్లకు మన దేశం కూడా మద్దతుగా నిలవాలని కోరుకుంటున్నా. ఆసీస్ మీడియా ఇలా హెడ్‌లైన్లు పెట్టడంలో నాకేమీ ఆశ్చర్యం కలగలేదు. ఎందుకంటే మెల్‌బోర్న్‌లో ఆసీస్ గత 13 ఏళ్లుగా మ్యాచ్ గెలవలేదు. చివరిసారిగా 2011లో ఓ టెస్టు మ్యాచ్‌ను ఆస్ట్రేలియా గెలిచింది. ఇప్పుడు ఆధిపత్యం ప్రదర్శించే అవకాశం వచ్చింది. అందుకే, ఇలాంటివాటిని ప్రయోగిస్తోంది. సిరీస్ ఇంకా అయిపోలేదు. 11తో ఇరు జట్లూ సమంగా ఉన్నాయి. బోర్డర్ గావస్కర్ ట్రోఫీని ఇంకా మీరు గెలవలేదు. ఒకవేళ మీరు మెల్‌బోర్న్‌లో గెలిస్తే ఇవన్నీ లెక్కలోకి వస్తాయి. నేను ఇప్పటికే ఆసీస్‌లో చాలాసార్లు పర్యటించా. జట్టుకు అండగా దేశం మొత్తం ఉంటుంది. కేవలం ప్రేక్షకులే కాకుండా మీడియా కూడా ఇందులో భాగస్వామే. కాబట్టి, ఇలాంటివి నాకు సర్‌ప్రైజ్ అనిపించడం లేదు.

ఒకవేళ ఆసీస్ 30 లేదా 20 తో ముందంజలో ఉండుంటే.. ఆ హెడ్‌లైన్లు విభిన్నంగా ఉండేవి. అసలు ఇలాంటివి ఎక్కడనుంచి వచ్చాయనేది నాకు తెలుసు. నిన్న కోహ్లీ కాన్‌స్టాస్ మధ్య చోటుచేసుకున్న వాగ్వాదాన్ని తమకు అనుకూలంగా మార్చుకొనేందుకు అక్కడి మీడియా ప్రయత్నించింది. విరాట్ కోహ్లీ ముక్కుకుపెట్టిన బంతికి సీమ్ థ్రెడ్ వేయడం మరిచిపోయినట్లు ఉన్నారు. దానిని బంతిగా చెప్పడానికి వారికి అవకాశం లేదు" అని రవిశాస్త్రి తెలిపాడు.



### కోహ్లీ ఆటను చూసేందుకే నా చివరి క్షణం..

## ఆఖరి డాలర్ వెచ్చిస్తా: లాంగర్



సిడ్నీ: సచిన్ తెందూల్కర్, బ్రియాన్ లారా వంటి దిగ్గజ క్రికెటర్లతో ఆస్ట్రేలియా మాజీ ఆటగాడు, మాజీ ప్రధాన కోచ్ జస్టిన్ లాంగర్ ఆడాడు. కానీ, వారందరి ఆటకంటే భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ గేమ్‌ను చూసేందుకే ఇష్ట పడతానని వెల్లడించాడు. సచిన్, లారా అద్భుతమైన క్రికెటర్లే అయినా.. తన చివరి క్షణంలో వారందరికంటే కోహ్లీ ఆటను చూసేందుకే ఆఖరి డాలర్‌ను వెచ్చిస్తానని వ్యాఖ్యానించాడు. అందుకు కారణాలనూ తెలిపాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా భారత్ జట్ల మధ్య నాలుగో టెస్టు జరుగుతున్న విషయం తెలిసిందే. కోహ్లీ తొలి ఇన్నింగ్స్‌లో 36 పరుగులు చేసి ఔటయ్యాడు. "ఇప్పటికే నేను విరాట్ కోహ్లీ అత్యుత్తమ ఆటగాడు అని చెప్పా. నేను చూసిన వారిలో అతడే బెస్ట్. అలాగని సచిన్, బ్రియాన్ లారా, రికీ పాంటింగ్‌ను తక్కువ చేసే ఉద్దేశం లేదు. వారిందరితో కలిసి ఆడిన అనుభవం నాకు ఉంది. నా దగ్గర ఒకే ఒక్క డాలర్ ఉందనుకుంటే.. లారా గేమ్‌ను చూసేందుకు ఇష్టపడతా. అలా కాకుండా ఒక్క డాలర్‌తోపాటు ఒక్క క్షణమే ఉందనుకుంటే విరాట్ గేమ్‌ను చూసేందుకే ఆసక్తి చూపిస్తా. విరాట్ బ్యాటింగ్‌ను ఇష్టపడతా. దీనికి కారణం లేకపోలేదు. కేవలం అతడు మంచి కవర్ డ్రైవ్‌లు కొడతాడనే కాదు. చాలా రీజన్లు ఉన్నాయి. బంతిని గమనించే తీరు బాగుంటుంది. వికెట్ల మధ్య పరిగెత్తడమూ సూపర్‌గా ఉంటుంది. ఇక అతడి ఫిట్‌నెస్ స్థాయి గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కొన్ని మ్యాచుల్లో విఫలమైనంత మాత్రాన అదేమీ సమస్య కాబోదు. కోహ్లీ గొప్పతనమేంటో అతడి గణాంకాలే చెబుతాయి. అందుకే, అతడు ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్ అయ్యాడు" అని జస్టిన్ లాంగర్ వెల్లడించాడు.

## దిగ్గజ వ్యాపారవేత్త ఒసాము సుజుకి కన్నుమూత



**ముంబయి:** ప్రముఖ వ్యాపారవేత్త, దిగ్గజ వాహన తయారీ సంస్థ సుజుకి మోటార్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఒసాము సుజుకి కన్నుమూశారు. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన ఇవాళ తుది శ్వాస విడిచినట్లు కంపెనీ అధికారికంగా ప్రకటించింది. లింఫోమా బ్లడ్ క్యాన్సర్‌తో మరణించినట్లు తెలిపింది.1930 జనవరి 30న జపాన్‌లోని గెరోలో ఒసాము జన్మించారు. 1958లో షోహో సుజుకీని ఆయన వివాహం చేసుకున్నారు. సుజుకీ కుటుంబానికి వారసులు లేకపోవడంతో వివాహం అనంతరం ఆ కంపెనీ పగ్గాలు చేపట్టారు. ఆ కంపెనీకి చెందిన బైక్‌లు, కార్లను ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడంలో కీలకపాత్ర పోషించారు. దాదాపు 40 సంవత్సరాలకు పైగా సుజుకి మోటార్ కార్ప్‌కు నాయకత్వం వహించారు. 2021 సంవత్సరంలో ఆయన పదవీ విరమణ ప్రకటించారు. డిసెంబర్ 25న ఆయన క్యాన్సర్‌తో మరణించినట్లు కంపెనీ ఇవాళ ప్రకటించింది.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న పీవీ సింధు దంపతులు

**తిరుమల:** తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధుదర్శించుకున్నారు. తన భర్త వెంకట దత్తసాయి , ఇతర కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం ఉదయం శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న సింధు దంపతులకు తితిదే అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా సింధు దంపతులు స్వామి వారి అభిషేక సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వారికి పండితులు ఆశీర్వచనం చేశారు. అనంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు.కాగా, పీవీ సింధు - వెంకట దత్తసాయి వివాహం ఈనెల 22న ఘనంగా జరిగిన విషయం తెలిసిందే. రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లోని ఓ సరస్సులో 21 ఎకరాల్లో విస్తరించిన ఒక దీవిలో కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ జంట ఒక్కటైంది. ఇక పెళ్లికి సంబంధించిన ఫొటోలను కూడా సింధు సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో గ్రాండ్‌గా రిసెప్షన్ కూడా జరిగింది. పెళ్లి, రిసెప్షన్‌కు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.

## కర్ణాటకలో సోలార్ విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించిన హీరో ఫ్యూచర్ ఎనర్జీ




**బెంగళూరు:** హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ శుక్రవారం కర్ణాటకలోని చిత్రదుర్గలో 29 మెగా వాట్ల సోలార్ విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభించినట్లు ప్రకటించింది. ఈ సోలార్ ప్రాజెక్ట్ ఏటా 33 మిలియన్ యూనిట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేస్తుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఇది వాణిజ్య, పారిశ్రామిక సెక్టార్‌కు సంబంధించిన విద్యుత్ అవసరాలను తీర్చగలదని హీరో ఫ్యూచర్ ఎనర్జీస్ పేర్కొంది. హెచ్‌ఎఫ్‌ఈ ఇటీవల కర్ణాటక ప్రభుత్వంతో రాష్ట్రవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల్లో పెట్టుబడుల కోసం రూ.11 వేల కోట్ల విలువైన అవగాహన ఒప్పందంపై సంతకం చేసింది. హీరో గ్రూప్‌కు సంబంధించిన పునరుత్పాదక శక్తి విభాగం, హెచ్‌ఎఫ్‌ఈ కు..ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్ వంటి ప్రముఖ గ్లోబల్ ఇన్వెస్టర్ల ఆర్థిక తోడ్పాటు ఉంది.

## ఫార్మా హెల్త్ కేర్ స్టాక్స్‌తో లాభాలతో ముగిసిన ఈక్విటీ మార్కెట్లు..



ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం లాభాలతో ముగిశాయి. బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 226 పాయింట్ల లబ్ధితో 78,699.07 పాయింట్ల వద్ద ముగిసింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 79,043.15 పాయింట్ల గరిష్టం నుంచి 78,699.07 పాయింట్ల కనిష్టానికి చేరుకున్నది. మరోవైపు, ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 63 పాయింట్ల లబ్ధితో 23,813.40 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో 23,938.85 పాయింట్ల గరిష్ట స్థాయి నుంచి 23,800.60 పాయింట్ల కనిష్ట స్థాయి మధ్య తచ్చాడింది. ఫార్మా, హెల్త్ కేర్, బ్యాంకింగ్, ఫైనాన్సియల్ స్టాక్స్ కొనుగోళ్లతో ఈక్విటీ మార్కెట్లకు కలిసి వచ్చింది.ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ50లో 29 స్టాక్స్ లాభాలతో ముగిశాయి. డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఎచిర్ మోటార్స్, విప్రో స్టాక్స్ 2.51 శాతం వరకూ లబ్ధి పొందాయి. మరోవైపు హిందాల్కో, కోల్ ఇండియా, ఎస్బీఐ, ఓఎన్జీసీ, టాటా స్టీల్స్ సహా 21 స్టాక్స్ 1.81 శాతం వరకూ నష్టపోయాయి. నిఫ్టీ ఫార్మా 1.30 శాతం వృద్ధి చెందితే నిఫ్టీ ఆటో 0.97, నిఫ్టీ హెల్త్ కేర్ 0.80 శాతం లాభ పడ్డాయి. నిఫ్టీ మెటల్, నిఫ్టీ పీఎస్ యూ బ్యాంకు, నిఫ్టీ రియాల్టీ, నిఫ్టీ ఆయిల్ అండ్ గ్యాస్ నష్టాలతో ముగిశాయి.బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 30లో మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, బజాజ్ ఫిన్ సర్వ్ లబ్ధి పొందాయి. ఎస్బీఐ, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, జొమాటో, ఆల్ట్రాటెక్ సిమెంట్ నష్టపోయాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి విలువ మరో 25 పైసలు పతనమై రూ.85.52లకు చేరింది. అంతర్జాతీయంగా బ్యారెల్ బ్రెంట్ క్రూడాయిల్ 73.37 డాలర్లు పలుకుతున్నది. ఔన్స్ బంగారం 2,639 డాలర్లకు లభిస్తుంది.

## లాభాల్లో ముగిసిన మార్కెట్ సూచీలు..

**మరింత బలహీనపడిన రూపాయి**

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నప్పటికీ.. మన సూచీలు ఓ మోస్తరుగా రాణించాయి. ముఖ్యంగా ఫార్మా, హెల్త్‌కేర్, బ్యాంక్, ఫైనాన్షియల్ స్టాక్స్‌లో కొనుగోళ్లతో సూచీలకు కలిసొచ్చింది.సెన్సెక్స్ ఉదయం 78,607.62 (క్రితం ముగింపు 78,472.48) పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 79,043.15 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 226.59 పాయింట్ల లాభంతో 78,699.07 వద్ద ముగిసింది. నిఫ్టీ 63.20 పాయింట్ల లాభంతో 23,813.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ మరోసారి కనిష్ఠ స్థాయికి చేరింది. నేడు మరో 25 పైసలు క్షీణించి 85.52కి చేరింది.సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండస్ ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, జొమాటో, అల్ట్రాటెక్ సిమెంట్ నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్యారెల్ చమురు 73.37 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2639 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.




### వెస్టిండీస్‌తో వన్డే సిరీస్..

## క్లీన్‌స్వీప్ చేసిన భారత్




**వదోదర:** విండీస్‌తో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత మహిళల జట్టు.. అదే ఊపులో మూడు వన్డేల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. శుక్రవారం వెస్టిండీస్‌తో జరిగిన మూడో వన్డేలో దీప్తి శర్మ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చిన వేళ భారత్ ఐదు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత విండీస్‌ను 162కే కట్టడి చేసిన టీమ్‌ఇండియా.. లక్ష్యఛేదనలో ఆరంభంలో కాస్త తడబడినా 28.2 ఓవర్లలో టార్గెట్‌ని ఛేదించింది. దీప్తి శర్మ (39*; 48 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), హర్మన్‌ప్రీత్ కౌర్ (32; 22 బంతుల్లో 7 ఫోర్లు), జెమీమా రోడ్రిగ్స్ (29) రాణించారు. చివర్లో రిచా ఘోష్ (23*; 11 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సులు) దూకుడుగా ఆడింది. రిచా వరుసగా రెండు సిక్సర్లు బాది భారత్‌కు సూపర్ విక్టరీని అందించింది. గత మ్యాచ్‌లో రాణించిన స్మృతి మంధాన (4), హర్లీన్ డియోల్ (1) ఈ సారి సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరగడంతో భారత్ 23 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. తర్వాత వచ్చిన బ్యాటర్లు తలోచేయి వేసి జట్టును విజయం దిశగా నడిపించారు.టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న వెస్టిండీస్ 38.5 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌటైంది. టీమ్‌ఇండియా బౌలర్ దీప్తి శర్మ (6/31), రేణుకా ఠాకూర్ (4/29) దెబ్బకు విండీస్ కుదేలైంది. ఆ జట్టు బ్యాటర్లలో చినెల్లె హెన్రీ (61) హాఫ్ సెంచరీ సాధించగా.. క్యాంప్‌బెల్లె (46) రాణించగా.. అలియా అలెన్ (21) పరుగులు చేసింది. ఓపెనర్లు క్వినా జోసెఫ్ (0), హేలి మాథ్యూస్ (0)ను తొలి ఓవర్‌లోనే రేణుక ఔట్ చేసింది. మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు.

## డేటా యూజర్లకు జియో షాక్.. ఈ వోచర్ల వ్యాలిడిటీ ఇక ఒక్కరోజే

**ముంబయి:** ప్రముఖ టెలికాం సంస్థ రిలయన్స్ జియో యూజర్లకు షాకిచ్చింది. రోజువారీ డేటా పరిమితి అయిపోయినప్పుడు వినియోగించే రూ.19, రూ.29 డేటా వోచర్ల వ్యాలిడిటీని కుదించింది. జియో వెబ్‌సైట్‌లో ప్లాన్లను పరిశీలిస్తే ఇప్పటికే కొత్త కాలపరిమితులు అమల్లోకి వచ్చాయని స్పష్టమవుతోంది. రోజువారీ డేటా అయిపోయినప్పుడు, అదనపు డేటా అవసరమైనప్పుడు ఇంటర్నెట్ సేవలు పొందేందుకు ప్రత్యేక డేటా ప్యాక్‌లను అందిస్తోంది. రూ.19 ప్లాన్‌తో 1జీబీ డేటా, రూ.29 ప్లాన్‌తో 2జీబీ డేటా ఇస్తోంది. ప్రస్తుత ప్లాన్ గడువు ముగిసే వరకు ఈ డేటా వోచర్లకు వ్యాలిడిటీ ఉండేది. తాజాగా కాలవ్యవధిని కుదించింది. రూ.19 ప్లాన్ కాలవ్యవధిని ఒక్క రోజుకు పరిమితం చేసింది. రూ.29 ప్లాన్‌కు గడువును రెండు రోజులుగా నిర్ణయించింది. ప్రస్తుతం తక్కువ ధరలో రూ.11తో మరో డేటా ప్యాక్‌ను అందిస్తోంది. కేవలం ఒక గంట వ్యవధి కలిగిన ఈ ప్యాక్‌తో అపరిమిత డేటా పొందొచ్చు.



# మ్యాక్స్ యాక్షన్‌ని ప్రధానంగా చేసుకుని మలిచిన కథనం

## ఆకట్టుకున్న సుదీప్ మాస్ హీరోయిజం, యాక్షన్ సన్నివేశాలు

### ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు ఓ ప్రత్యేకమైన అనుభూతిని పంచుతుంది




**చిత్రం:** మ్యాక్స్; నటీనటులు: సుదీప్, వరలక్ష్మి శరత్‌కుమార్, సంయుక్త, సుధా బెలవాడి, సుకృత, సునీల్, శరత్ లోహితాశ్వ, అచ్యుత్‌కుమార్ తదితరులు; సంగీతం: అజనీశ్ లోకనాథ్; సినిమాటోగ్రఫీ: శేఖర్ చంద్ర; ఎడిటింగ్: ఎస్.ఆర్.గణేశ్ బాబు; నిర్మాత: కలైపులి ఎస్.థాను, సుదీప్; దర్శకత్వం: విజయ్ కార్తికేయ; విడుదల: 27-12-2024

కన్నడ నుంచి వచ్చిన మరో పాన్ ఇండియా చిత్రం 'మ్యాక్స్'. పలు భాషల్లో సినిమాలు చేసి ప్రేక్షకులకు చేరువైన కిచ్చా సుదీప్ ఇందులో కథానాయకుడు. 'ఈగ', 'బాహుబలి' తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులపై ప్రత్యేకమైన ముద్ర వేసిన నటుడాయన. మరి 'మ్యాక్స్'లో ఎలాంటి ప్రభావం చూపించాడు? యాక్షన్ థ్రిల్లర్ కథతో ఆయన థ్రిల్‌ను పంచాడా లేడా?

**కథేంటంటే:** అర్జున్ మహాక్షయ్ అలియాస్ మ్యాక్స్ (కిచ్చా సుదీప్) ఓ పోలీస్ అధికారి. ట్రాన్స్‌ఫర్లు, సస్పెండ్‌ల విషయంలో ఆయనకంటూ ఓ రికార్డ్ ఉంటుంది. అలా ఓ విషయంలో సస్పెండ్ అయి, తిరిగి పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు తీసుకోవడానికి వెళుతూనే డ్యూటీ మొదలు పెడతాడు. ఓ మహిళా పోలీసుతో అసభ్యంగా ప్రవర్తించడంతో ఇద్దరు మంత్రుల కుమారుల్ని తీసుకెళ్లి స్టేషన్‌లో పెట్టేస్తాడు. అనూహ్యంగా ఆ ఇద్దరూ స్టేషన్‌లో చనిపోతారు. అసలు వాళ్లు చనిపోవడానికి కారణం ఏమిటి?మంత్రుల కుమారుల కోసం పోలీస్‌స్టేషన్‌పైకి దండెత్తిన గ్యాంగ్స్‌ని భయపడుతున్న తన పోలీస్ బృందంతో కలిసి మ్యాక్స్ ఎలా ఎదుర్కొన్నాడు?క్రైమ్ సీఐ రూప (వరలక్ష్మి శరత్‌కుమార్)కీ, మ్యాక్స్‌కీ మధ్య ఏం జరిగింది? ఈ కథలో గని భాయ్ (సునీల్) ఎవరు? తదితర విషయాల్ని తెరపై చూడాల్సిందే.

**ఎలా ఉందంటే:** కొత్త కథేమీ కాదు. ఆ మాటకొస్తే ఇందులో చెప్పుకోదగ్గ కథ కూడా లేదు. చిన్నపాటి ఆ కథనే, బిగువైన కథనంతో మలిచి ఆసక్తికరంగా ముందుకు నడిపించే ప్రయత్నం చేశాడు దర్శకుడు. మ్యాగ్జిమమ్ కిచ్చా సుదీప్ మాస్ ఇమేజ్‌ని వాడుకుంటూ... ఓ మంచి యాక్షన్ సినిమాని ప్రేక్షకులకు అందించే ప్రయత్నంలో చిత్రబృందం చాలావరకూ సఫలమైంది. ప్రథమార్ధం కాస్త అటూ ఇటూ అనిపించినా, ద్వితీయార్ధం మాత్రం తర్వాత ఏం జరుగుతుందనే ఉత్కంఠని రేకెత్తిస్తూ పరుగులు పెడుతుంది. ప్రేక్షకులకు మంచి సినిమాటిక్ అనుభూతిని పంచుతుంది. ఒక్క రోజు రాత్రిలో జరిగే కథ ఇది. ఈ సినిమా సాగుతున్నంతసేపూ 'ఖైదీ' సహా చాలా సినిమాలు గుర్తొస్తుంటాయి. కథా నేపథ్యం, ఆ టోన్ కూడా ఇటీవలి కాలంలో కన్నడ నుంచి, తమిళం నుంచి వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ సినిమాల్ని గుర్తు చేస్తుంటాయి. కానీ, అవేవీ సినిమాకి మైనస్‌గా అనిపించవు. కథనం బలంగా ఉంటే జరిగే మేజిక్కే అది. మంత్రుల కుమారులు చనిపోయారని బయటకు తెలియకుండా పోలీసులు జాగ్రత్తపడే సన్నివేశాలు, స్టేషన్‌పైకి దండెత్తిన గ్యాంగ్స్‌ని మ్యాక్స్ తనదైన శైలిలో ఎదుర్కొంటూనే, తన బృందాన్ని రీఛార్జ్ చేయడంలాంటి సన్నివేశాలు సినిమాకి కీలకం. ప్రథమార్ధమంతా పోలీస్‌స్టేషన్, రౌడీల చుట్టూనే సాగుతుంది. సుదీప్ ఎంట్రీ, ఆయన ఎలివేషన్స్ కాస్త ప్రత్యేకంగా నిలిచాయి. ద్వితీయార్ధంలోనే అసలు హంగామా. దాన్ని తెరపై చూడాల్సిందే. సుదీప్ మేనరిజమ్స్, ఆయన మైండ్ గేమ్, పొలిటికల్ కోణం, కథలో మలుపులు సినిమాకి హైలైట్. రేసీ యాక్షన్ థ్రిల్లర్‌ని అందించే క్రమంలో కొన్ని విషయాల్ని పట్టించుకోలేదు. హీరో నేపథ్యంతోపాటు, పోలీసులు భయపడినట్టుగా విలన్ గ్యాంగ్ అకృత్యాలేవీ ఇందులో కనిపించవు. దాంతో సినిమా హడావుడిగా ముగిసిన ఫీలింగ్ కలుగుతుంది. అయినా సరే, ఓ మంచి మాస్ యాక్షన్ సినిమాని చూసిన అనుభూతితో ప్రేక్షకుడు థియేటర్ నుంచి బయటికొస్తాడు. యాక్షన్ ప్రియులకు అమితంగా నచ్చే ఈ సినిమాలో కథ పరంగానే కాస్త లోటు చేశాడు దర్శకుడు.

**ఎవరెలా చేశారంటే:** కిచ్చా సుదీప్ మాస్ హీరోయిజం, ఆయన చేసిన యాక్షన్ సన్నివేశాలు ఈ సినిమాకి కీలకమయ్యాయి. ఆయన తెరపై కనిపించి యాక్షన్‌కి సన్నద్ధమైన ప్రతిసారీ థియేటర్లో విజిల్స్ పడతాయి. మ్యాక్ పాత్రలో లీనమై నటించారు. గనీభాయ్ పాత్రలో సునీల్ ఆకట్టుకుంటాడు. వరలక్ష్మి శరత్‌కుమార్ బలమైన పాత్రలో సందడి చేస్తుంది. ఇళవరసు, సంయుక్త, సుకృత తదితర నటులు పాత్రలకి తగ్గట్టుగా నటించారు. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. అజనీష్ లోకనాథ్ సంగీతం యాక్షన్ సన్నివేశాల్ని మరో స్థాయికి తీసుకెళ్లింది. యాక్షన్ డిజైన్, ప్రొడక్షన్ డిజైన్, శేఖర్ చంద్ర ఛాయాగ్రహణం ఈ సినిమాకి ప్రధాన బలం. ప్రతి యాక్షన్ సన్నివేశం ప్రేక్షకులకు ఓ ప్రత్యేకమైన అనుభూతిని పంచుతుంది. కథ మూడ్‌కి తగ్గ టోన్‌ని అందించాయి కెమెరా, ప్రొడక్షన్ డిజైన్ విభాగాలు. నిర్మాణం ఉన్నతంగా ఉంది. దర్శకుడు విజయ్ కార్తికేయ యాక్షన్‌ని ప్రధానంగా చేసుకుని మలిచిన కథనం మెప్పిస్తుంది.

**బలాలు**
సుదీప్ నటన
యాక్షన్ సన్నివేశాలు
కథనం

**బలహీనతలు**
బలమైన కథ లేకపోవడం
ప్రథమార్ధంలో కొన్ని సన్నివేశాలు

**చివరిగా:** మ్యాక్స్... మ్యాగ్జిమమ్ అలరించాడు

**గమనిక:** ఈ సమీక్ష సమీక్షకుడి దృష్టి కోణానికి సంబంధించింది. ఇది సమీక్షకుడి వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే!

# త్వరలోనే జాకెంట్ భారత్‌లో దొరుకుతుందని ఆశిస్తున్నా: పూరి జగన్నాథ్

ఏంజెలా లూనా డిజైనర్ చేసిన 'జాకెంట్' ఎంతో మంది శరణార్థుల ప్రాణాలను కాపాడిందని పూరి జగన్నాథ్ అన్నారు. 'పూరి మ్యూజింగ్స్' పేరుతో ఆయన వివిధ అంశాలపై తన అభిప్రాయాన్ని పంచుకుంటున్న సంగతి తెలిసిందే. తాజాగా 'జాకెంట్' గురించి మాట్లాడారు. ''యుద్ధాలు, రకరకాల ఇబ్బందులతో దేశాన్ని, ఇంటిని వదిలి కట్టుబట్టలతో పెళ్లాం పిల్లలను తీసుకుని, వేరే ప్రాంతాలకు వలసపోతున్న వాళ్లెంతో మంది ఉన్నారు. వేరే దేశంలో వీరికి ఇల్లనేది ఉండదు. చాలా చోట్ల వలస జీవితాలను చూస్తున్నాం. ముఖ్యంగా నైజీరియా, హోండరాస్, ఇరాక్, సూడాన్, ఇండియా, చైనా, ఇథియోపియా, కాలిఫోర్నియా,న్యూయార్క్ ఫ్లోరిడాలో ఇల్లులేని వాళ్లు చాలా మంది ఉన్నారు. ఇండియాలో 4 కోట్ల మంది అడుక్కు తినేవాళ్లున్నారు. ప్రపంచంలో ఐదుశాతం జనానికి ఇల్లులేదు. వీళ్ల కష్టాలు వర్ణనాతీతం. వడదెబ్బ, తీవ్రమైన చలికి తట్టుకోలేక చనిపోతున్నారు. ఇల్లు వాకిళ్లు వదిలేసి ఒక మనిషి, తనకు అవసరమైనవి మాత్రమే తీసుకుని బయలు దేరాల్సి వస్తే, ఆ బ్యాగ్‌లో ఏం వేయాలో తెలియదు. దేన్నీ వదులుకోలేం. అలాంటి బ్యాగ్ చాలా బరువుగా ఉంటుంది. దాన్ని పట్టుకుని మోసుకుంటూ నడవాలంటే ఎంతో కష్టం. దుస్తులు, గిన్నెలు, స్టవ్ చాలా బరువు ఉంటాయి. ఆఖరికి దుప్పటి పట్టుకెళ్లాలన్న కొన్నిసార్లు కష్టంగానే ఉంటుంది. అలాంటిది వసతిని మోస్తామా? ఇక టెంట్‌ను మోసుకువెళ్లే పరిస్థితి అసలు ఉండదు''

''ఇలా వసతి సౌకర్యం లేకపోవడం వల్ల ప్రపంచంలో ఎంతో మంది చనిపోతున్నారు. ఇల్లులేని వాళ్ల కోసం ఏంజెలా లూనా అనే డిజైనర్ ఒక అద్భుతమైన డిజైన్ చేసింది. దానిపేరు జాకెంట్. జాకెట్‌ను, టెంట్‌ను కలిపి చేసిన డిజైన్ అది. దీన్ని మీరు జాకెట్‌లా వేసుకోవచ్చు. అలా ఎక్కడైనా పడుకోవాల్సి వస్తే.. టెంట్‌లా మారిపోతుంది. ఎంతో మంది సిరియా శరణార్థులను ఇది కాపాడింది. చాలా మంది డిజైనర్లు సెలబ్రిటీలు, డబ్బున్న వాళ్లకోసం కోసం లక్షలు, కోట్లు ఖర్చు పెట్టి కాస్ట్యూమ్స్ డిజైన్ చేస్తారు. వాటన్నింటి కంటే గ్రేట్ డిజైన్ ఇది. ఎంతో మంది ప్రాణాలనూ కాపాడింది. ఏంజెలా లూనాను అందరూ ప్రశంసించాలి. అతి తక్కువ ధరకు ఇది దొరుకుతుంది. 'జాకెంట్' ఇంకా ఇండియాలోకి రాలేదు. త్వరలోనే రావాలని కోరుకుంటున్నా. అడక్కునేవాళ్లకు దుప్పట్లు, ఫుడ్ పంచే మంచి మనుషులు ఉన్నారు. ఇలాంటి జాకెంట్స్ వస్తే, వాళ్లకు గిఫ్ట్‌గా ఇవ్వొచ్చు. మనం ఎక్కడికైనా క్యాంపునకు వెళ్లినా వాడుకోవచ్చు. ఏదైనా కంపెనీ వీటిని ఇండియాలో పరిచయం చేస్తే బాగుంటుందని ఆశ. ఇదే ఐడియాను తీసుకుని తయారు చేసినా, సంతోషమే. ఎంతో మందిని కాపాడిన వాళ్లు అవుతారు. త్వరలోనే జాకెంట్ భారత్‌లో దొరుకుతుందని ఆశిస్తున్నా'' అని పూరి జగన్నాథ్ అన్నారు.

# మనం చేయగలం.. ట్రెండింగ్‌లో సమంత బ్యూటిఫుల్ ఫొటోస్

కష్టతర సమయాల్లో ఎలా ఉండాలో కొంతమంది సెలబ్రిటీలను చూసి నేర్చుకోవచ్చు. అలాంటి వారి జాబితాలో టాప్‌లో ఉంటుంది చెన్నై సుందరి సమంత . సోషల్ మీడియాలో చురుకుగా ఉండే ఈ భామ ఎప్పటికప్పుడు ఏదో ఒక పోస్ట్‌తో ఫాలోవర్లు, అభిమానుల్లో జోష్ నింపుతూంటుంది. తాజాగా ఉదయాన్నే మోటివేషన్ క్లాసులు చెబుతోంది. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన పోస్ట్ నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. మార్నింగ్ మోటివేషన్.. మనం చేయగలం సామ్ మీ కలలను ఫాలో అవండి.. వాటికి మార్గం తెలుసు.. కొటేషన్‌ను హైలెట్ చేస్తూ.. బహుశా చూస్తూ కూర్చోవడం మంచిది. లేదంటే కాసేపు వేచి ఉండవచ్చు. బిజీ ప్రపంచంలో మీకు కావలసిందల్లా సాధారణ జీవితం. ప్రణాళిక లేకపోవడమనేది కూడా ప్రణాళికలో భాగమే కావచ్చు.. చక్కర్లు కొట్టడానికి.. హ్యాపీ హాలీడేస్ అంటూ క్యాప్షన్ ఇచ్చింది. సమంత ఓ వైపు బెడ్‌పై దుప్పటి కప్పుకొని హాయిగా నిద్రపోతున్న స్టిల్.. మరోవైపు వర్కవుట్ స్టిల్‌ను షేర్ చేయగా.. ఇప్పుడీ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. గతేడాది శాకుంతలం, ఖుషి సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది సామ్. ఆ తర్వాత హిందీలో వరుణ్ ధవన్‌తో సిటడెల్ వెబ్‌సిరీస్‌లో నటించింది. ఈ ప్రాజెక్టు తర్వాత సామ్ నుంచి కొత్త సినిమా ప్రకటన రావాల్సి ఉంది.






# సల్మాన్ ఖాన్ సికందర్ టీజర్ వాయిదా..

బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ కాంపౌండ్ నుంచి వస్తోన్న మోస్ట్ ఎవెయిటెడ్ సినిమాల్లో ఒకటి 'సికందర్'. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 2025 ఈద్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. మేకర్స్ ముందుగా ప్రకటించిన ప్రకారం టీజర్‌ను శుక్రవారం ఉదయం 11:07 నిమిషాలకు లాంచ్ చేయాల్సి ఉంది.అయితే మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ గురువారం రాత్రి కన్నుమూసిన విషయం తెలిసిందే. దేశమంతా సంతాపం ప్రకటిస్తున్న ఈ సమయంలో ఆయన మృతికి సంతాపంగా టీజర్ లాంచ్ ఈవెంట్‌ను వాయిదా వేస్తున్నాం. టీజర్‌ను రేపు ఇదే (ఉదయం 11:07) సమయానికి లాంచ్ చేస్తామని అధికారిక ఖాతాలో ట్వీట్ చేసింది నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్. సికిందర్‌లో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తుండగా.. సత్యరాజ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు.

# తెలుగు హీరోయిన్స్‌కి మరిన్ని అవకాశాలు రావాలి



పేరుకి తెలుగు చిత్ర పరిశ్రమే కానీ మన పరిశ్రమలో ఒక్క తెలుగు హీరోలకి తప్ప తెలుగు హీరోయిన్స్ కి పెద్దగా అవకాశాలు ఉండవు అనే మాట ఎప్పుడు నుంచో వినిపిస్తోంది. మన తెలుగు సినిమాలో ఏదోకటి చేద్దాం అని చాలా మంది హీరోయిన్స్ ఈ మధ్య కాలంలో కూడా అడుగుపెడుతున్నారు. కానీ ఇతర భాషల నుంచి వచ్చే పోటీతో వారు బాగా స్ట్రగుల్ అవుతున్నారు. పోనీ మన దగ్గర మంచి అందంగా ఉండే హీరోయిన్స్ లేరా అంటే..హిందీ లేదా తమిళ్, మలయాళం నుంచి వచ్చిన వారి కంటే అందంగా ఉండేవాళ్ళు కూడా ఉన్నారు. అయినప్పటికీ మన తెలుగులో మాత్రం ఇప్పటికీ సరైన అవకాశాలు లేవని బాధ పడుతుంటారు. ఇలా తెలుగు ఇండస్ట్రీలో పరిచయం అయ్యి అవకాశాలు కోసం చూడటం ఒకింత బాధ అయితే ఇది కాకుండా తమ ఇంట్లో నుంచి కూడా వారికి అవమానాలు లాంటివి ఎదురైతే అది ఇంకా బాధాకరం అని చెప్పక తప్పదు. అలా సొంత తల్లి దగ్గరే అవమానాలు ఎదుర్కొందట తెలుగు బ్యూటీ వకీల్ సాబ్ ఫేమ్ అనన్య నాగళ్ళ. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ దర్శకుడు వేణు శ్రీరామ్ కాంబినేషన్ లో వచ్చిన సోషల్ మెసేజ్ ఎమోషనల్ చిత్రం "వకీల్ సాబ్" అందరికీ తెలిసిందే. కాగా ఈ చిత్రంలో ముగ్గురు అమ్మాయిలు ప్రధానంగా కనిపిస్తారు. వారిలో అంజలి, నివేథా థామస్‌లు అందరికీ తెలిసిన హీరోయిన్స్. కానీ ఆ తెలియని మూడో అమ్మాయే అనన్య నాగళ్ళ. ఇనోసెంట్ పల్లెటూరి అమ్మాయి పాత్రలో నటించిన ఈమె నటించిన లేటెస్ట్ సినిమా ఈవెంట్ లో చేసిన కామెంట్స్ వైరల్ అయ్యాయి. తన కెరీర్ స్టార్టింగ్ లో సినిమాల్లోకి వస్తున్నట్టుగా ఇంట్లో చెప్పలేదట. నా మొదటి సినిమా రిలీజ్ కి కొంచెం సమయం ఉంది అనగా చెప్పాను అని అనన్య తెలిపింది.

దీంతో మా అమ్మ చాలా గొడవ పెట్టేసింది , కానీ కొన్నాళ్ల తర్వాత ఓరోజు నాకు కాల్ చేసి తమ బంధువుల ఇంటికి వెళితే వారు ఎంతో అవమానంగా మా అమ్మ పెంపకంపై మాట్లాడారు అని అనన్య ఆవేదన వ్యక్తం చేసింది. అప్పుడు చాలా బాధపడ్డానని అనన్య తెలిపింది. దీనితో ఎలాగైనా సక్సెస్ కొట్టే చూపించాలి అని అక్కడే ఫిక్స్ అయ్యానని ఆమె అన్నారు. అప్పటి నుంచి ట్రై చేస్తూనే ఉన్నాను అంటూ అనన్య నాగళ్ల ఎంతో ఎమోషనల్ గా మాట్లాడింది. దీనితో ఆ కామెంట్స్ విన్న ప్రతీ ఒక్కరూ మరింత ఎమోషనల్ అవుతున్నారు. మన తెలుగు హీరోయిన్స్ కి మరిన్ని అవకాశాలు రావాలని వాళ్లంతా కోరుకుంటున్నారు. తాజాగా అనన్య నాగళ్ళ నటించిన చిత్రం శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్ థియేటర్స్‌లో ఉంది. ఈ సినిమాలో ఆమె క్యారెక్టర్‌కి మంచి ప్రశంసలు వస్తున్నాయి. మరి ఈమెకు తాను కోరుకున్న పెద్ద బ్రేక్ దక్కుతుందో లేదో చూడాలి. నిజానికి వకీల్ సాబ్ తోనే ఆమెకు ఫేమ్ దక్కింది . కానీ ఆ సినిమా తనని లైమ్ లైట్ లోకి తీసుకొచ్చేందుకు మాత్రమే పనికొచ్చింది. కానీ మెయిన్ హీరోయిన్ గా మాత్రం తాను ఇంకా స్ట్రగుల్ అవుతూనే ఉంది.

# మన్మోహన్ పాత్రను రిజెక్ట్ చేయాలనుకున్నా: అనుపమ్ ఖేర్



భారత మాజీ ప్రధాని, ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ (92) కన్నుమూసిన విషయం తెలిసిందే. గురువారం రాత్రి ఢిల్లీలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆయన తుదిశ్వాస విడిచారు. మన్మోహన్‌సింగ్ మృతిపై రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖులు, రాజకీయవేత్తలు సంతాపం వ్యక్తంచేశారు. తాజాగా నటుడు అనుపమ్ ఖేర్ కూడా మన్మోహన్ గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పించాడు. ఈ క్రమంలోనే మన్మోహన్‌సింగ్ జీవితం ఆధారంగా తెరకెక్కిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'ను బాలీవుడ్ సీనియర్ నటుడు అనుపమ్ ఖేర్ గుర్తుచేసుకున్నారు. ఈ సినిమాలో మన్మోహన్ పాత్రలో నటించాడు అనుపమ్ ఖేర్.మన్మోహన్ సింగ్ చాలా తెలివైన వ్యక్తి. ఎంతో నిజాయతీపరుడు, గొప్ప నాయకుడు. ఆయనను కలిసే అవకాశం నాకు రెండు సార్లు వచ్చింది. అయితే ఆయన జీవిత ఆధారంగా తెరకెక్కిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' సినిమాలో నేను మన్మోహన్ పాత్రలో నటించాను. మొదట ఈ సినిమా కోసం చిత్రబృందం నన్ను సంప్రదించినప్పుడు నేను ఒప్పుకోలేదు. నా పర్సనల్ కారణాలతో పాటు రాజకీయ ఒత్తిడులకు తలవంచి ఈ ప్రాజెక్ట్‌ను వదిలేద్దమనుకున్నాను. కానీ ఒక గొప్ప వ్యక్తి జీవిత చరిత్రలో నటించే అవకాశం అందరికి రాదని ఈ సినిమాను అంగీకరించాను. నేను చేసిన గొప్ప సినిమాల్లో ఇదోకటి. ఆ చిత్రం వివాదాస్పదం అయ్యి ఉండవచ్చు.. కానీ ఆయన మాత్రం వివాదాలు లేనివాడు అంటూ అనుపమ్ చెప్పుకొచ్చాడు.అనుపమ్ ఖేర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్'. ఈ సినిమాకు విజయ్ గుట్టే దర్శకత్వం వహించగా.. సంజయ్ బారు రచించిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్: ది మేకింగ్ అండ్ అన్ మేకింగ్ ఆఫ్ మన్మోహన్ సింగ్' అనే నవల ఆధారంగా ఈ సినిమా వచ్చింది. 2019లో విడుదలైన ఈ చిత్రం తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. మన్మోహన్ సింగ్ కూడా ఈ సినిమాపై స్పందిస్తూ.. ఇందులో చెప్పినవన్ని అబద్ధాలు అంటు చెప్పుకొచ్చాడు.

# ఓటీటీలోకి 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్'..



కని కుశ్రుతి, దివ్య ప్రభ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్'. విభిన్నమైన కథతో డ్రామా ఫిల్మ్‌గా దీనిని రూపొందించారు. దర్శకురాలు పాయల్ కపాడియా తెరకెక్కించిన తొలి ఫీచర్ ఫిల్మ్ ఇదే. కేన్స్ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమై 'గ్రాండ్ పిక్స్' అవార్డును అందుకోవడంతోపాటు గోల్డెన్ గ్లోబ్ అవార్డులకు సైతం నామినేట్ అయిన ఈ సినిమా త్వరలో ఓటీటీలో విడుదల కానుంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ప్రముఖ ఓటీటీ సంస్థ డిస్నీ + హాట్‌స్టార్ తాజాగా ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది. జనవరి 3 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుందని తెలిపింది.ముంబయి నర్సింగ్ హోమ్‌లో పనిచేసే కేరళకు చెందిన ఇద్దరు నర్సుల కథే 'ఆల్ వి ఇమేజిన్ యాజ్ లైట్'. ఇద్దరు కలిసి ఓ బీచ్ టౌన్‌కు రోడ్ ట్రిప్‌నకు వెళ్తారు. ఆ తర్వాత వారి జీవితాలు ఎలా మారాయి? అన్నదే చిత్ర కథాంశం. ఈ సినిమాకు అంతర్జాతీయ పబ్లికేషన్స్‌లో మంచి రివ్యూలు వచ్చాయి. కేన్స్ ఉత్సవంలో 'గ్రాండ్ పిక్స్' అవార్డు గెలుచుకుంది. 30 ఏళ్ల తర్వాత భారతీయ చిత్రానికి దక్కిన గౌరవమిది. బెస్ట్ నాన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ మోషన్ పిక్చర్, బెస్ట్ డైరెక్టర్ విభాగాల్లో ఈ చిత్రం గోల్డెన్ గ్లోబ్ అవార్డులకు నామినేట్ అయింది. తెలుగులో ఈ చిత్రాన్ని రానా విడుదల చేశారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com